ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 07.06.2025 | సంపుటి :11 సంచిక : 319 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# ప్రపంచంతో పోటీపడుతున్నాం



## తెలంగాణను అభివృద్ధిపథంలో నడిపిస్తున్నాం : సీఎం రేవంత్ రెడ్డి

### బీఆర్ఎస్ కాదు.. డీఆర్ఎస్ అదో దెయ్యాల రాజ్యసమితి

- ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం
- ప్రజల సమస్యలు పట్టకుండా ఫామ్‌హౌస్‌లో నిద్రపోతున్న దెయ్యాల నేత
- గంధమల్ల రిజర్వాయర్‌ను ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదు?
- మూసీ ప్రక్షాళన చేస్తామంటే ఎందుకు అడ్డుకుంటారు?
- యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటనలో
- ముఖ్యమంత్రి విమర్శలు
- తిరుమలలాగా యాదగిరి గుట్ట అభివృద్ధి
- యాదగిరిగుట్టలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం
- ఆలేరులో పలు అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో (జనంసాక్షి): తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. "యాదాద్రిని తిరిగి యాదగిరిగుట్టగా మార్చాం. కొండపై భక్తులు నిద్రించేలా.. ఆటోలు నడిచేలా చేస్తాం. 60 కిలోల బంగారంతో ఆలయ గోపురం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం. టీటీడీ బోర్డు మాదిరిగా తెలంగాణలోనూ వైటీడీ ఏర్పాటు చేశాం. యాదగిరిగుట్టలోని విద్యాసంస్థలను వర్సిటీ స్థాయికి అభివృద్ధి చేస్తాం. ఎవరు అడ్డం పడినా సరే.. మిగతా 2లో..

## బనకచర్లతో తెలంగాణకు
# అన్యాయం

### ఈ మేరకు కేంద్రమంత్రులకు లేఖలు రాశాం

- రాష్ట్ర నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తాం
- జలవిధానాలకు విరుద్ధంగా కట్టడం.. ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించం
- కృష్ణా బేసిన్‌లో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే పదేళ్లు బీఆర్ఎస్ సహకరించింది
- అనుమతులు ఇవ్వకుండా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్(జనంసాక్షి): బనకచర్లతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంతర్రాష్ట్ర జలవిధానాలకు, జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టు ఉందని ఆక్షేపించారు. ఈ ప్రాజెక్టను తెలంగాణ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరం తెలుపుతూ కేంద్రమంత్రులు సీఆర్‌పాటిల్, నిర్మలా సీతారామన్‌కు లేఖలు రాశామని చెప్పారు."ఏపీ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని.. వస్తే అన్ని నిబంధనలు పరిశీలిస్తామని పాటిల్ చెప్పారు. చట్టం ప్రకారం ముందుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏపీ ఉల్లంఘనలను పూర్తిగా లేఖల్లో వివరించాం. చట్టవిరుద్ధంగా ఏపీకి కేంద్రం సహకరిస్తుందని అనుకోవట్లేదు.



## బనకచర్లపై న్యాయపోరాటం

### బీఆర్ఎస్ తరపున సుప్రీం కోర్టులో కేసు వేస్తాం
### అబద్ధాలతో కాలం గడుపుతున్న సీఎం, మంత్రులు
### కేంద్రంతో పోరాటం చేయకుండా బిజెపి సైలెంట్ అయ్యింది: హరీశ్ రావు



సిద్దిపేట(జనంసాక్షి): అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి అనుకున్నం, కానీ ఆ యన్ని మించి తాత అయ్యిండు ఉత్తమ్ కుమార్ రెడ్డి అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ఉత్తమ్ అబద్దాలు చూస్తే గోబెల్స్ అనే వాడు ఉంటే ఉరి పెట్టుకునే వాడు అని హరీశ్‌రావు అన్నారు. దుబ్బాకలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు- బీజేపీ ఎంపీలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మిగతా 2లో..

### ఎట్టకేలకు ..
## జీ-7 సదస్సుకు భారత్‌కు
# అందిన ఆహ్వానం

### మోదీకి కెనడా ప్రధాని ఫోన్



న్యూఢిల్లీ(జనంసాక్షి): కెనడాలోని అల్బెర్టాలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న జీ7 సదస్సుకు భారత్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు మోదీకి.. కెనడా ప్రధాని మార్క్ కార్నే ఫోన్ చేసి సదస్సులో మిగతా 2లో..



### వరుసగా మూడోసారి
# వడ్డీరేట్లు తగ్గింపు

- రెపోరేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గింపు
- ఆర్బీఐ సంచలన నిర్ణయం
- గృహ,వాహన రుణాలపై తగ్గనున్న వడ్డీలు.. ఈఎంఐలు

ముంబై(జనంసాక్షి): ఆర్బీఐ సంచలన నిర్ణయం తీసుకుంది. వరుసగా మూడోసారి వడ్డీరేట్లను తగ్గించింది. రెపోరేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. దీనివల్ల రెపో రేటు 6 శాతం నుంచి 5.50 శాతానికి దిగొచ్చింది. ఆర్బీఐ తీసుకున్న నిర్ణయంతో గృహ రుణాల వడ్డీరేట్లు 7.5 శాతం తగ్గనున్నాయి. అలాగే బ్యాంకు ఈఎంఐలు తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.దేశ ఆర్థిక వృద్ధిని పెంపొందించడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.16 శాతంగా ఉంది. ఎస్‌బీఐ నివేదిక ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరంలో రెపోరేటు- మరో 75 బేసిస్ పాయింట్ల తగ్గింపు జరిగే అవకాశం ఉంటుంది. దీంతో రెపో రేటు- 5.0 నుంచి 5.25కు చేరుకోవచ్చు. దీనివల్ల బ్యాంకులు కూడా రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించడానికి వీలుంటుంది. వడ్డీ రేట్లను తగ్గించడం ఈ ఏడాదిలో వరుసగా ఇది మూడోసారి అని చెప్పాలి. ఫిబ్రవరి, మిగతా 2లో..

## నాకేం తెలియదు.. అంతా కేసీఆర్, హరీశ్‌లకే తెలుసు

### కాళేశ్వరం కమిషన్ విచారణలో చేతులు దులిపేసుకున్న ఈటల రాజేందర్

- కాళేశ్వరం నిర్ణయం మొత్తం కేసీఆర్‌దే..
- తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టుకు మహారాష్ట్ర ఒప్పుకోలే
- కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలి
- తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలని.. రిపోర్ట్ విషయంలో తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. కాళేశ్వరం విచారణ అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. కంఠంపై తుపాకీ పెట్టినా ఈటెల నిజమే మాట్లాడుతారని మిగతా 2లో..



## పట్టణాల్లోని పేదలకూ
# ఇందిరమ్మ ఇండ్లు



- వారున్న చోటే జి+3 పద్ధతిలో నిర్మాణం
- హైదరాబాద్ లో 16 మురికివాడలను గుర్తించాం
- గిరిజనులకు ప్రత్యేకంగా 22 వేల నివాసాలు
- మంత్రి పొంగులేటి

హైదరాబాద్(జనంసాక్షి):పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాలలో ఒక కొలిక్కి తీసుకువచ్చిన నేపథ్యంలో పట్టణ ప్రాంతాలలో కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై దృష్టి సారించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం

# పాలమూరు-రంగారెడ్డి పూర్తిచేస్తాం

- బీడు భూములను సస్యశ్యామలం చేస్తాం
- ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ
- రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం
- బీఆర్ఎస్ పాలనలో నీళ్లు.. నిధులు లేవు..
- గత పాలకులు దొంగల్లా అందిన కాడికి దోచుకున్నారు
- ఇప్పుడు దయ్యాల్ల వికటాట్టహాసం
- చేస్తున్నారు..
- వారికి ప్రజలపై ప్రేమ లేదని కుటుంబ
- సభ్యులే చెబుతున్నారు: డిప్యూటీ సీఎం భట్టి



మహబూబ్‌నగర్(జనంసాక్షి):వెనుకబడిన పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేస్తాం, అందుకు కావలసిన నిధులు సంపూర్ణంగా విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో 12 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన అనంతరం స్థానికంగా ఏర్పాటుచేసిన మిగతా 2లో..

## జైల్లో పెట్టినా.. ఫ్యాక్టరీని అడ్డుకొని తీరుతాం

### ప్రైవేటు సైన్యం దాడిచేస్తే వారిపై కేసులు పెట్టరా..?

- జైల్లో ఉండడానికైనా సిద్ధమేనంటున్న గ్రామస్తులు
- చుట్టుపక్కల గ్రామాల్లో కొనసాగుతున్న పోలీసుల విచారణ
- పరామర్శించేందుకు వెళ్తున్నవారూ అరెస్ట్
- పోలీసులపై అఖిలపక్షం నాయకులు ఫైర్



రాజోలి(జనంసాక్షి) : పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక ఆందోళన కొనసాగుతూనే ఉంది. పోలీసులు గ్రామాల్లోకి వచ్చి నిరసనకారులపై విచారణ పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు గ్రామస్తులు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఇప్పటికే 40మందిపై కేసులు నమోదు చేసిన పోలీసులు ఎప్పుడు ఎవరిని ఎక్కడ అరెస్ట్ చేస్తారోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. 12 మందిని రిమాండ్‌కి తరలించగా, మిగతా వారి కోసం పోలీసులు గ్రామాల్లోకి వచ్చి గాలిస్తున్నట్టు పలువురు చెబుతున్నారు. అయితే మిగతా 2లో..

తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం నాయకుడికి
### వేధింపులు తగదు
ఖండించిన తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం

క్రిమినల్ కేసులు సహా అన్ని కేసులు ఉపసంహరించాలని డిమాండ్ 2లో

## మావోయిస్టు అగ్రనేత
# భాస్కర్ మృతి



### బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పుల్లో కన్నుమూసిన కీలకనేత.. ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న ఎన్‌కౌంటర్లు

రాయ్‌పూర్(జనంసాక్షి):ఛత్తీస్‌గఢ్‌లోవరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. తాజాగా రెండోరోజూ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో శుక్రవారం భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మరో కీలక నేత మైలారపు ఆడెల్లు అలియాస్ భాస్కర్ మృతిచెందారు. ఆడెల్లు స్వస్థలం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెర గ్రామం. భాస్కర్ కేంద్ర కమిటీతోపాటు- రాష్ట్ర కమిటీకి కార్యదర్శిగా పని చేస్తున్నారు. అతి తక్కువ సమయంలోనే రాష్ట్ర కమిటీ స్థాయికి భాస్కర్ ఎదిగారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల రిక్రూట్‌మెంట్‌లో ఆయన కీలక పాత్ర పోషించారు. అతడి తలపై రూ.25లక్షల రివార్డు ఉంది. ఈ ఎన్‌కౌంటర్ జరిగిన ఘటనా స్థలంలో ఏకే 47తోపాటు పలు ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సమాచారం. కాగా మావోలు, భద్రతా దళాల మధ్య ఇంకా ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. గురువారం నేషనల్ పార్క్ అటవీ మిగతా 2లో..



## నీట్ ఎంట్రన్స్ టెస్ట్ వాయిదా

ఆగష్టు 3న నిర్వహించనున్న ఎన్‌బీఈ

న్యూఢిల్లీ(జనంసాక్షి):నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ నీట్- 2025 పరీక్షను వాయిదా వేయాలన్న నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అభ్యర్థనకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం మిగతా 2లో..

### రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసులో
# కేటీఆర్‌కు సుప్రీం నోటీసులు

కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ పిటిషన్‌పై ధర్మాసనం విచారణ



న్యూఢిల్లీ(జనంసాక్షి): కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ చేసిన రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసులో సుప్రీం నోటీసులిచ్చింది. కాంగ్రెస్ నాయ కురాలు ఆత్రం సుగుణ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంలో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిం దంటూ కేటీఆర్ గతంలో మిగతా 2లో..



# ఇక చీనాబ్‌పై చికు బుకు

- ప్రతిష్టాత్మక వంతెనను ప్రారంభించిన మోడీ
- రైలు బోగీలో ప్రయాణించిన ప్రధాని తదితరులు
- ఈఫిల్ టవర్‌కన్నా ఎత్తయిన వంతెనగా ప్రసిద్ధి
- శ్రీనగర్-వైష్ణోదేవి మధ్య నేటి నుంచి రాకపోకలు

శ్రీనగర్(జనంసాక్షి):ప్రపంచంలోనే ఎత్తైన చినాబ్ రైల్వే వంతెనను ప్రధాని మోడీ అట్టహాసంగా ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్ తరవాత తొలిసారిగా ప్రధాని మోడీ కాశ్మీర్‌కు వెళ్లారు. శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జమ్ము కశ్మీర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ కేంద్రం ఎంతో ప్రతిష్మాత్మకంగా నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి చీనాబ్ రైలు వంతెనను ప్రధాని ప్రారంభించారు. జెండా ఊపి రైల్వే వంతెనపై రాకపోకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే బ్రిడ్జిపై పరుగులు తీసిన కోచ్‌లో ప్రధాని ప్రయాణించారు. మిగతా 2లో..

## నేను దొంగను కాను.. జస్ట్ పారిపోయానంతే..

### వ్యాపార వేత్త విజయ్ మాల్యా

లండన్(జనంసాక్షి):బ్యాంకులకు రూ.వేల కోట్లు- ఎగవేసి విదేశాల్లో దాక్కొన్న బిలియనీర్ విజయ్ మాల్యా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టయ్యే పరిస్థితులు ఉన్నాయి కాబట్టే తాను భారత్‌ను వీడానని పేర్కొన్నారు. దొంగతనం చేయలేదని.. అసలు దొంగతనం ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు. తాను భారత్ నుంచి పారిపోయానని.. కానీ దొంగను కానని అన్నారు. భారత్ నుంచి వెళ్లిపోయినందుకు నన్ను దేశం నుంచి పారిపోయిన వ్యక్తి అని పిలవండి. కానీ దొంగ అని ముద్ర వేయకండి. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ రుణాల విషయంలో మోసం చేసినట్లు- విజయ్ మాల్యా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దేశం విడిచి వెళ్లిపోయిన ఆయన మార్చి మిగతా 9లో..



జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
07.06.2025

## బనకచర్లతో తెలంగాణకు అన్యాయం

తెలంగాణకు అన్యాయం జరిగితే.. ఎంత వరకైనా పోరాడుతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తాం.. వెనక్కి తగ్గేదేలే. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలి. కృష్ణాలో అన్యాయం జరుగుతుంటే పదేళ్లు భారాస సహకరించింది. ఉమ్మడి ఏపీలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 724 టీఎంసీలు ఏపీకి వెళితే భారాస హయాంలో 1,254 టీఎంసీలు తరలించారు. కాళేశ్వరానికి వృథా ఖర్చు చేయకుంటే కృష్ణా ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యేవి. తుమ్మిడిహట్టి దగ్గర కాకుండా.. మేడిగడ్డ వద్ద కట్టడం వల్ల రూ.68వేల కోట్లు కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు ఖర్చు అయింది. ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకం చేసింది భారాస ప్రభుత్వం కాదా? కృష్ణా నీళ్లలో అప్పుడు మోసం చేసి ఇప్పుడు భారాస నేతలు నాటకాలు ఆడుతున్నారు"అని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. బనకచర్లకు అనుమతులు ఇవ్వకుండా కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కృష్ణా బేసిన్ నుంచి తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే పదేళ్లు బీఆర్ఎస్ సహకరించిందని విమర్శించారు. ఉమ్మడి ఏపీలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 724 టీఎంసీలు ఏపీకి వెళితే, బీఆర్ఎస్ హయాంలో 1,254 టీఎంసీలు తరలించారని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు.కాళేశ్వరానికి వృథా ఖర్చు చేయకుంటే కృష్ణా ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యేవి. తుమ్మిడిహట్టి దగ్గర కాకుండా మేడిగడ్డ వద్ద కట్టడం వల్ల రూ.68వేల కోట్లు కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు ఖర్చు అయింది. ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా కృష్ణా నీళ్లలో అప్పుడు మోసం చేసి ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బనకచర్లపై న్యాయపోరాటం

ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ సమావేశం నిరాకరించిందని మాజీ మంత్రి హరీష్ రావువ్యాఖ్యలు చేశారు. ఆరు గ్యారంటీలను ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. గాలి మోటార్లపై తిరుగుతూ గాలి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక్క డీఏ ఇచ్చేందుకు ముచ్చటగా మూడు కమిటీలు వేశారని.. దీనికి కేబినెట్‌లో అయిదు గంటల చర్చ చేశారని వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిట్ట నిలువునా ముంచుతోందన్నారు. తక్షణమే మూడు డీఏలు చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఉద్యోగులపైనే సర్కార్ కేసులు పెడుతోందన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి గ్రామాల్లో పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మించిపోయారని వ్యాఖ్యలు చేశారు. ఉత్తమ్ కుమార్ ఏది మాట్లాడినా అబద్ధమే అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో క్రాప్ హాలిడే ప్రకటించిందన్నారు. 65 టీఎంసీలు నీటిని ఉపయోగించుకోకుండా చేసింది ఉత్తమ్ అంటూ ఆరోపించారు. నీతి ఆయోగ్ మీటింగ్‌లో ప్రధానిని రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. గోదావరి బనకచర్ల కోసం బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టు వెళ్తుందన్నారు. గోదావరి బనకచర్ల మీద బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. శ్రీశైలం రైడింగ్ ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును ఉత్తమ్ కుమార్ రెడ్డి అడ్డుకోవాలన్నారు. కాళేశ్వరం కుప్ప కూలిందని చెప్పే రేవంత్ రెడ్డి గంధమళ్ళకు నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు.

## నీట్ ఎంట్రన్స్ టెస్ట్ వాయిదా

కోర్టు ఆమోదం తెలిపింది. జూన్ 15వ తేదీన జరగాల్సిన పరీక్షను ఆగస్టు 3వ తేదీన నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయమూర్తి పీకే మిశ్రా నేతృత్వంలోని బెంచ్.. పరీక్ష వాయిదాపై కేంద్రాన్ని, ఎన్‌బీఈని ప్రశ్నించింది. 'ఇంకా రెండు నెలలు పరీక్షను వాయిదా వేయటం ఎందుకు..జులై రెండు లేదా మూడో వారంలో పరీక్ష నిర్వహించవచ్చుగా' అని అడిగింది. కేంద్రం తరఫున అదనపు సోలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ స్పందిస్తూ..' లాజిస్టికల్ సవాళ్ల కారణంగా పరీక్ష వాయిదా పడింది. పరీక్ష కేంద్రాల సంఖ్యను రెట్టింపు చేయడం, కఠినమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టడం వంటి వాటి కోసం ఈ నిర్ణయం తీసుకోవటం జరిగింది. చిన్న పొరపాట్లు- పరీక్ష ప్రక్రియపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే పరీక్షను వాయిదా వేయడానికి ఎన్బీఈ నిర్ణయించిందని తెలిపారు.అనంతరం న్యాయమూర్తి మిశ్రా మాట్లాడుతూ.. ' పరీక్ష ఎప్పుడు జరిగినా నిష్పక్షపాతంగా, సమగ్ర భద్రతతో జరగాలని స్పష్టం చేశారు. గత వారం ఇచ్చిన తీర్పును కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. అప్పటి నుంచి మీరు ఏం చేశారంటూ ఎన్‌బీఈని ప్రశ్నించింది. దీనిపై ఎన్‌బీఈ మాట్లాడుతూ.. ' పరీక్ష విషయంలో మేము ఏమాత్రం రాజీ పడదలచుకోవడం లేదని స్పష్టం చేసింది. కాగా, నీట్ పీజీ పరీక్షను రెండు షిఫ్టుల్లో జరపడానికి పర్మిషన్ కోరుతూ ఎన్‌బీఈ గతంలో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దానిపై విచారణ జరిపిన కోర్టు ఎన్‌బీఈ ప్రతిపాదనను తోసిపుచ్చింది. రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరిగితే విద్యార్థులపై చెడుగా ప్రభావం చూపే అవకాశం ఉందని అభిప్రాయపడింది. దేశ వ్యాప్తంగా ఒకే షిఫ్టులో పరీక్ష పెట్టాలని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే పరీక్ష ఒకే షిఫ్టులో జరపడానికి మరింత సమయం కావాలని బోర్డు కోరింది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన కోర్టు ఆగస్టు 3వ తేదీన పరీక్ష జరపడానికి అవకాశం కల్పించింది. ఒకే షిఫ్ట్‌లో పరీక్షను ముగించాలని ఇటీవల అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పరీక్ష నిర్వహణ తేదీని జూన్ 15 నుంచి మార్చుకునేందుకు వీలు కల్పించింది.వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత పరీక్ష (నీట్)కు సంబంధించి ఇటీవల సుప్రీంలో విచారణ జరిగింది. పరీక్షను రెండు షిఫ్టులలో నిర్వహించడానికి నిరాకరించింది. దానివల్ల కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంది. పరీక్ష నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటించాలని, సురక్షితమైన పరీక్షా కేంద్రాలనే ఎంచుకోవాలని సూచించింది. రెండు ప్రశ్నపత్రాలు ఎప్పటికీ ఒకేవిధమైన కాఠిన్య లేదా సులభ స్థాయిని కలిగిఉండవని అభిప్రాయపడింది. పోటీ- తీవ్రత దృష్ట్యా ప్రతి మార్కూ ర్యాంకు నిర్ధరణలో అత్యంత కీలకమేనని తెలిపింది. నార్మలైజేషన్ విధానాన్ని కొన్ని ప్రత్యేక కేసుల్లో మాత్రమే అనుసరించాలని, ప్రతి ఏడాదీ నిర్వహించుకొనే పరీక్షకు అది సరికాదని ధర్మాసనం పేర్కొంది.

## సిమ్లా ఒప్పందానికి ఇక విలువలేదు..

**దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు: పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్**

**ఇస్లామాబాద్(జనంసాక్షి):**ఇటీవల పహల్గామ్ దాడి తరవాత భారత్ సిమ్లా ఒప్పందం రద్దుచేస్తూ ప్రకటన చేసింది. అయితే దనీఇని పాక్ పెద్దగా పట్టించుకున్నట్లుగా కనిపించడం లేదు. ఏప్రిల్‌లో పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత నుంచి భారత్‌-పాక్ సంబంధాలు పూర్తిగా క్షీణించాయి. భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఆ తర్వాత మే 7వ తేదీన పాకిస్థాన్, పీవోకేలోని 9 ఉగ్ర స్థావరాలపై దాడులు చేసింది. ఆ తర్వాత మే 8,9,10 తేదీల్లో పాక్ సైన్యం భారత మిలిటరీ బేస్‌లపై దాడికి యత్నించగా.. మన దళాలు తిప్పికొట్టాయి. ఆ తర్వాత పాక్ అభ్యర్థన మేరకు భారత్ ఆపరేషన్ సిందూర్‌కు తాత్కాలిక విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. భారత్‌తో 1972లో జరిగిన సిమ్లా ఒప్పందం నుంచి వైదొలగే అంశంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పాకిస్థాన్ విదేశాంగ శాఖ వివరణ ఇచ్చింది. ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ మాట్లాడుతూ సిమ్లా ఒప్పందానికి ఇక విలువలేదు.. అదొక డెడ్ డాక్యుమెంట్ అని వ్యాఖ్యానించారు. సింధూజలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేశారో లేదో తెలియదు గానీ.. సిమ్లా అగ్రిమెంట్ పనైపోయిందని పేర్కొన్నారు. దీంతో తాము 1948 నాటి స్థితికి చేరుకొన్నామని పేర్కొన్నారు.

# ప్రపంచంతో పోటీపడుతున్నాం



మూసీ ప్రక్షాళన చేసి నల్గొండ రైతులను ఆదుకుంటాం. గోదావరి జలాలతో మూసీ నదిని నింపుతాం. సబర్మతి, గంగా నదులు ప్రక్షాళన చేసుకోవచ్చు.. మూసీ నదిని మాత్రం ప్రక్షాళన చేయకూడదా? అని అన్నారు.పదేళ్లలో ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయిన ఘనత బిఆర్ఎస్‌దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట వద్ద అపచారానికి మూల్యం చెల్లించుకున్నారు. పాపాలు చేసినందునే మీ పరిస్థితి ఆ విధంగా మారింది. తమ పార్టీలో దెయ్యాలు చేరాయని ఆ పార్టీ నాయకురాలే చెప్పారు. జవాబివ్వలేక దెయ్యాల నేత ఫాంహౌస్‌లో నిద్రపోతున్నారు. బీఆర్ఎస్ కాదు.. డీఆర్ఎస్.. దెయ్యాల రాజ్యసమితి. కొరివి దెయ్యాలను తరిమికొట్టే బాధ్యత నేను తీసుకుంటా. అందుకు కార్యకర్తల సహకారం కావాలని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.బంగారు తెలంగాణ ముసుగులో పదేళ్లు దోచుకున్న వాళ్లా నన్ను ప్రశ్నించేది. వాసాలమర్రి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఇళ్లన్నీ కూలగొట్టారు. ఆ తర్వాత కేసీఆర్ ఆ గ్రామాన్ని పట్టించు కోలేదు. పదేళ్లు దోచుకొని రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చారు. రూ.8లక్షల కోట్లు- అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీశారు. విద్యార్థులు, రైతులు, ఉద్యమకారులను పొట్టన పెట్టుకున్నారు. పేదలను తప్పుదోవ పట్టించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. రూ.20లక్షల కోట్లు ఉంటే రూ.2వేల కోట్లతో ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయలేదు అంటూ నిప్పులు చెరిగారు. యాదాద్రిని తిరిగి యాదగిరిగుట్టగా మార్చాం. కొండపై భక్తులు నిద్రించేలా.. ఆటోలు నడిచేలా చేస్తాం. 60 కిలోల బంగారంతో ఆలయ గోపురం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం. టీటీడీ బోర్డు మాదిరిగా తెలంగాణ లోనూ వైటీడీ ఏర్పాటు చేశాం. యాదగిరిగుట్టలోని విద్యాసంస్థలను వర్సిటీ స్థాయికి అభివృద్ధి చేస్తాం. ఎవరు అడ్డంపడినా సరే.. మూసీ ప్రక్షాళన చేసి నల్గొండ రైతులను ఆదుకుంటాం. గోదావరి జలాలతో మూసీ నదిని నింపుతాం. సబర్మతి, గంగా నదులు ప్రక్షాళన చేసుకోవచ్చు.. మూసీ నదిని మాత్రం ప్రక్షాళన చేయకూడదా అని ప్రశ్నించారు. సభలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.గంధమల్ల రిజర్వాయర్‌నును ఎందుకు పూర్తి చేయలేదుగంధమల్ల రిజర్వాయర్‌నును గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు పూర్తిచేయలేకపోయిందని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. యాదగిరిగుట్ట పేరును గత ప్రభుత్వంలో యాదాద్రిగా మార్చారని, మేం వచ్చాక మళ్లీ ప్రజలంతా పిలుచుకునే యాదగిరిగుట్టగా మార్చామన్నారు. తిరుమల మాదిరిగా యాదగిరిగుట్ట ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని సీఎం రేవంత్ వెల్లడించారు. యాదగిరిగుట్టలో యూనివర్సిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామన్నారు.

## పాలమూరు- రంగారెడ్డి పూర్తిచేస్తాం

బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఆర్ & ఆర్, భూ సేకరణకు సంబంధించిన నిధులు వెంటనే విడుదల చేస్తాం, నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్ల మధ్య ఉన్న గ్యాప్ ను పూరించేందుకు అవసరమైన నిధులు విడుదల చేస్తాం. ఉద్దండపూర్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి 70 కోట్లు కావాలి అంటే వాటిని వెంటనే విడుదల చేశాం, భవిష్యత్తులో ఎన్ని నిధులు అవసరమైతే అన్ని నిధులు విడుదల చేసేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. గత పాలకులు దొంగల మాదిరి అందిన కాడికి దోచుకున్నారు, ఇప్పుడు దయ్యాల ఇక హట్టహాసం చేస్తున్నారు, నాటి పాలకులకు ప్రజలపై ప్రేమ లేదని వారి కుటుంబ సభ్యులే వాస్తవాలను బయటపెడుతున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. నిజమైన ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేందుకు, ప్రజలకు నిధులను ఖర్చు పెడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ తెలంగాణ రాష్ట్రం ప్రపంచం తోనే పోటీపడేలా పరిపాలన చేస్తుంది, ప్రపంచం మొత్తం తెలంగాణ వైపు చూసేలా పాలనను కొనసాగిస్తున్నామని డిప్యూటీ సీఎం అన్నారు. ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు అండదండలు ఉండాలని కోరారు. వ్యాపారాలు, కాంట్రాక్టులు చేయాలనుకుంటే ఎమ్మెల్యేలు కావాల్సిన అవసరం లేదని.. ప్రజల గొంతుకై శాసనసభలో మాట్లాడి ప్రజల అవసరాలను తీర్చి ప్రజాస్వామ్యంలో ఓటు విలువ పెంచే ఎమ్మెల్యేలను ఎన్నుకున్నందుకు మహబూబ్నగర్ ప్రజలను డిప్యూటీ సీఎం అభినందించారు. మాది ప్రజా ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆశయాలే నిజంగా పనిచేస్తాం, వారి ఆశయాలే మా లక్ష్యంగా పరిపాలన అందిస్తాం అని డిప్యూటీ సీఎం తెలిపారు. కృష్ణా నది ఒడ్డున ఉన్న పాలమూరు బిడ్డలు ఆ నీళ్లను వారి భూముల్లో పారించుకునేందుకు ప్రత్యేక రాష్ట్రం తీసుకొని వచ్చారు, అయితే 10 ఏళ్ల కాలంలో గత పాలకులు ఒక్క ఎకరాకు సాగునీరు ఇవ్వలేదని విమర్శించారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో ఆనాడు చేపట్టిన జూరాల, కోయిల్ సాగర్, బీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టులన్ని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేశామని గుర్తు చేశారు. నాటి కాంగ్రెస్ పాలకులు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతిస్తే 2015 జూన్ మాసంలో కరివేన ప్రాజెక్టు దగ్గర నాటి సీఎం కేసీఆర్ పునాది వేసి మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తాను అని హామీ ఇచ్చారు, పది సంవత్సరాలు అయిన నీళ్లు ఎందుకు పారించలేకపోయారని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు.సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు పండుగ పేరుతో బహిరంగ సభ నిర్వహించి యావత్ క్యాబినెట్‌ను ఆహ్వానించి వివరించిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని యావత్ క్యాబినెట్ అర్థం చేసుకొని విద్యుత్తు, సాగునీరు, విద్యా, వైద్యం, రోడ్లు ఇలా అన్ని రంగాల్లో పాలమూరు అభివృద్ధి చేసేందుకు కావలసిన నిధులు మంత్రివర్గం అందిస్తుందని వివరించారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలతో పాటు ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నాం అన్నారు.

## పట్టణాల్లోని పేదలకూ ఇందిరమ్మ ఇండ్లు

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూపట్టణాల్లోని మురికి వాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని ముఖ్యంగా హైదరాబాద్ కు దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. హైదరాబాద్ కు దూరంగా గతంలో 42 వేల ఇండ్లను నిర్మించగా సుమారు 19 వేల మంది మాత్రమే అక్కడికి వెళ్లారు. ఇటీవల క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలన జరుపగా కేవలం 13 వేల మంది మాత్రమే ఆ నివాసాలలో ఉంటున్నట్లు తేలిందన్నారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని పట్టణ ప్రాంతాలలో ప్రధానంగా హైదరాబాద్ నగరంలోని మురికి వాడల్లో పేదలు ఉన్నచోటే జి౦3 పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

## ఇక చీనాబ్‌పై చికు బుకు

ఆయన వెంట కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా కూడా ఉన్నారు. భారత దేశం మరో అద్భుత కట్టడానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మాణం జరిగింది. చీనాబ్ రైల్వే బ్రిడ్జిగా పిలువబడుతున్న ఈ బ్రిడ్జి శుక్రవారం ఉదయం ప్రారంభం అయింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం ఉదమ్‌పూర్.. శ్రీనగర్.. బారాముల్లా రైల్ లింక్ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు.. ఈ చినాబ్ రైల్వే వంతెన ఈఫిల్ టవర్ కంటే ఎత్తుగా ఉంటుంది. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెన చినాబ్ సొంతం. అలాంటి రైల్వే వంతెనను ప్రధాని మోడీ శుక్రవారం జాతికి అంకింతం చేశారు. రూ.46వేల కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైలును కూడా జెండా ఊపి ప్రారంభించారు. వంతెన కారణంగా ఈ మార్గం ప్రధానంగా పర్యాటరంగాన్ని మరింత ఆకర్షించనుంది. శ్రీ మాతా వైష్ణో దేవి ఆలయాన్ని వందలాది మంది యాత్రికులు దర్శిస్తుంటారు. ఈ రైల్వే వంతెన ప్రారంభంతో పర్యాటకరంగంగా మరింత పుంజుకోనుంది. ఈ చినాబ్ బ్రిడ్జి 1,315 మీటర్లు విస్తరించి ఉంది. కఠినమైన వాతావరణాన్ని కూడా ఈ వంతెన తట్టు-కోగలదు. ఈ ప్రాంతం భూకంపం జోన్ 5లో ఉంది. ఇంజనీర్లు అత్యంత అద్భుతంగా ప్రణాళికలు వేసి ఈ బ్రిడ్జిని నిర్మించారు. గంటకు 260 కిలోమీటర్ల వేగంతో ప్రచండమైన గాలులు వీచినా ఈ వంతెనకు ఏం కాదు. బలమైన గాలులు తట్టుకునే విధంగా నిర్మించారు. ఇక వంతెన నిర్మించడానికి దాదాపు 30,000 టన్నుల ఉక్కును ఉపయోగించారు. ప్రస్తుతం ఇదే ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెనగా నిలుస్తుంది. చీనాబ్ వంతెన నిర్మాణం 2002లో వాజ్‌పేయ్ హయాంలో ప్రారంభించగా 2022లో మోడీ హయాంలో పూర్తయ్యింది. ఉధంపూర్‌-శ్రీనగర్‌-బారాముల్లా రైలు మార్గం ప్రాజెక్టులో భాగంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి విజయవంతంగా ముగించారు. శనివారం నుంచి శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా రైల్వే స్టేషన్ నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైళు పరిగెత్తనున్నాయి.



## జైల్లో పెట్టినా.. ఫ్యాక్టరీని అడ్డుకొని తీరుతాం

నిరసనలో భాగంగా జరిగిన దాడి సందర్భంగా పలు వీడియోలు వైరల్ కాగా.. అందులో స్థానికులను కనిపెడుతూ వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పడంతో స్థానికులు మండిపడుతున్నారు. ఫ్యాక్టరీ రద్దుకై తమ ప్రాణాలను లెక్కచేయమని తెగేసి చెప్తున్నారు.అక్రమ కేసుల్లో బంధింపబడ్డ రైతుల కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లే క్రమంలో అయిజ పోలీసులు అరెస్టు చేయడం దారుణమని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. శాంతియుతంగా పోరాడుతున్న రైతులను అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపిన ప్రభుత్వ తీరు అప్రజాస్వామికం అన్నారు. రైతులపై దాడి చేసి వారిని గాయాల పాలు చేసిన పరిశ్రమ యాజమాన్య ప్రైవేటు వ్యక్తులపై కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. వ్యవసాయానికి అనుకూలమైన సాగుభూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించి ప్రశ్నించిన రైతులపై నియంతత్వంతో వ్యవహరిస్తున్న ప్రభుత్వ విధానాల వ్యతిరేకంగా ప్రజల ఐక్యం కావాలన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పడానికి వెళుతున్న అఖిలపక్ష సామాజిక ప్రజా సంఘాల నాయకులను మార్గ మధ్య లోనే అరెస్టు చేయడం పట్ల పోలీసులపై విరుచుకుపడ్డారు. తక్షణమే ఇథనాల్ పరిశ్రమ అనుమతిని రద్దు చేసి రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి, రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దీర్ఘ కాల ఉద్యమానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, సీపీఐ సీపీఎం జిల్లా కార్యదర్శులు ఆంజనేయులు, వెంకటస్వాములు, బిఆర్ఎస్వీ విడియో జిల్లా కన్వీనర్ కుర్వ పల్లయ్య, రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జి గోపాల్ బహుజన రాజ్య సమితి నాయకులు, వాల్మీకి వినోద్, ఉప్పేర్ నరసింహ, దానయ్య సుబాన్ తదితరులు పాల్గొన్నారు.

## జీ-7 సదస్సుకు భారత్‌కు ఆహ్వానం..

పాల్గొనాలని ఆహ్వా నించారు. ఈ విషయాన్ని మోదీ అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. కార్నేతో ఫోన్‌లో మాట్లాడటం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఇటీ వల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన ఆయన్ను అభినందించినట్లు తెలిపారు. భారత్, కెనడా శక్తిమంతమైన ప్రజాస్వామ్య దేశాలన్న మోదీ.. పరస్పర ఆసక్తులను గౌరవించుకుంటూ పని చేస్తామన్నారు. మార్క్ కార్నేతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. 51వ జీ-7 సదస్సుకు కెనడా ఆతిథ్యమిస్తున్న సంగతి తెలిసిందే. జీ7 దేశాల్లో భారత్ లేకున్నప్పటికీ.. నిర్వహణ దేశాల ఆహ్వానం మేరకు మన ప్రధాని ఆ శిఖరాగ్ర సదస్సుల్లో పాల్గొంటున్నారు. గతేడాది ఇటలీ వేదికగా జరిగిన సదస్సుకు భారత్‌తోపాటు ఆఫ్రికా, దక్షిణ అమెరికా, పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు పాల్గొన్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా పాల్గొని తన గళాన్ని వినిపించారు.

## రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసులో కేటీఆర్‌కు సుప్రీం నోటీసులు

ఆరోపణలు చేశారు. దీంతో కేటీఆర్ చేసిన ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ.. ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేత ఫిర్యాదుతో కేటీఆర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని గతంలోనే కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు.. కేటీఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చింది. అయితే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుగుణ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం నాయకుడికి వేధింపులు తగదు

**ఖండించిన తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం**

**క్రిమినల్ కేసులు సహా అన్ని కేసులు ఉపసంహరించాలని డిమాండ్**


పసునూరి రవీందర్


కందుకూరి రమేశ్‌బాబు


టి.రమేశ్ బాబు

హైదరాబాద్, జూన్ 6 (జనంసాక్షి) : గద్వాల జిల్లా పెద్దధన్వాడ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఉద్యమించిన, ప్రజలకు మద్దతుగా నిలిచినందుకు ఓ జర్నలిస్టుపై కేసులు పెట్టడం ఏమాత్రం సరైంది కాదని తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం (టీయూజేఎస్) నేతలు సాహితీవేత్త, జర్నలిస్టు పసునూరి రవీందర్, సీనియర్ జర్నలిస్టులు టి.రమేశ్ బాబు, కె.రమేశ్ బాబు ఖండించారు. తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు, జనంసాక్షి ఎడిటర్ రహమాన్‌పై ఆ కంపెనీ ఇచ్చిన ఫిర్యాదుకు విలువివ్వడం ఏమాత్రం విజ్ఞత కాదన్నారు. సత్యాన్ని వెలికితీసే, ప్రజలకు నిజాలను చేర వేసే బాధ్యత పత్రికలపై ఉందన్న విషయం ప్రభు త్వాధికారులు గుర్తించా లన్నారు. ఎడిటర్ రహమాన్‌పై క్రిమినల్ కేసులు పెట్టడం ద్వారా పత్రికా స్వేచ్ఛను అణచివేసేందుకు యత్నిస్తున్నారని అర్థమవుతోందన్నారు. రహమాన్ ఒక బాధ్య తాయుతమైన పత్రికా వ్యక్తిగా, సమాజంలో అన్యాయాలను, అవినీతిని ఎండగట్టేందుకు తన వృత్తిని అంకితం చేశారని గుర్తుచేశారు. ఆయనపై కేసులు పెట్టడం వెనుక ప్రైవేటు శక్తుల ప్రమేయం ఉందని బలంగా నమ్ముతున్నామన్నారు. ఇలాంటి చర్యలు పత్రికా స్వేచ్ఛను హరించడమే కాక, ప్రజాస్వామ్య విలువలను బలహీనపరుస్తాయని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఈ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని టీయూజేఎస్ డిమాండ్ చేస్తోందని, అలాగే, పత్రికలు, జర్నలిస్టులు నిర్భయంగా తమ వృత్తిని నిర్వ హించేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పిం చాలని కోరుతున్నామని ఉద్యమ జర్నలిస్టుల సంఘం (టీయూజేఎస్) నేతలు పేర్కొన్నారు.

## వరుసగా మూడోసారి వడ్డీరేట్లు తగ్గింపు

ఏప్రిల్‌లో 25 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గించారు. తాజాగా మళ్లీ వడ్డీ రేట్లు తగ్గించడం ద్వారా వివిధ రకాల ప్రయోజనాలు కలగనున్నాయి. గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశం ఉంటుంది. కాబట్టి రుణాలు తీసుకున్న వారందరికీ ఇది శుభవార్త అనే చెప్పాలి. నెలవారీ చెల్లింపుల వాయిదా భారం మోస్తున్న గృహ వినియోగదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి శుభవార్త చెప్పిందనే అనుకోవాలి. కీలక వడ్డీరేట్లను ఏకంగా 50 బేసిస్ పాయింట్లు- తగ్గించి మరింత ఊరట కల్పించింది. ఫ్లోటింగ్ రేట్‌పై గృహ రుణాన్ని తీసుకున్న వారికి సవరించిన వడ్డీరేటు- ఆధారంగా ఊరట లభించనుంది. 2019 అక్టోబర్ 1 తర్వాత జారీ చేసిన గృహ రుణాలన్నీ ఫ్లోటింగ్ రేటు-తో జారీ అయినవే. కాబట్టి వారికి బ్యాంకులు ఆ మేరకు వడ్డీ రేట్లను సవరిస్తాయి. పాత వినియోగదారులకే కాదు.. కొత్తగా రుణాలు తీసుకునేవారు తక్కువ వడ్డీకే రుణాలు పొందొచ్చు. పైగా ఎక్కువ మొత్తం రుణం పొందేందుకు అవకాశం ఉంటుందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించిన నేపథ్యంలో రుణగ్రహీతల ముందు ఇప్పుడు రెండు ఆప్ష న్లు ఉండబోతున్నాయి. ఒకటి ఈఎంఐ తగ్గించుకోవడం. రెండోది కాలవ్యవధి తగ్గించుకోవడం. దీంట్లో రెండో ఆప్షన్ ఎంచుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తంలో వడ్డీని ఆదా చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఉదాహరణకు ఈ ఏడాది జనవరిలో 20 ఏళ్ల కాలవ్యవ ధికి రూ.50 లక్షల రుణం తీసుకున్నారనుకుందాం. అప్పట్లో బ్యాంకు వడ్డీ రేటు 8.50శాతం ఉంటే.. నెలకు రూ.43,391 చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆర్‌బీఐ మూడు దఫాల్లో వడ్డీ రేట్లను సవరించడంతో ఈఎంఐ మొత్తం రూ. 40,280కి తగ్గనుంది. అంటే నెలకు దాదాపు రూ.3వేల పైనే ఆదా అవుతుంది.ఒకవేళ ఈఎంఐని స్థిరంగా ఉంచుకొని కాలవ్యవధిని మార్చుకుంటే గనుక.. రుణ చెల్లింపు గడువు దాదాపు మూడు సంవత్సరాల వరకు తగ్గుతుంది. ఈ ఏడాది జనవరిలో 240 నెలల కాల వ్యవధికి రూ.50 లక్షల రుణం తీసుకున్నారనుకుంటే.. ఆర్‌బీఐ ఊరటతో ఈ కాలవ్యవధి 206 నెలలకు తగ్గుతుంది. అంటే వడ్డీ భారం దాదాపు రూ.14.78 లక్షల మేర ఆదా అవుతుంది. ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయంతో బ్యాంకులు ఎంత వేగంగా వినియోగదారులకు ఆ ప్రయోజనాన్ని బదిలీ చేస్తారనే దానిపై ఈ ఊరట ఆధారపడి ఉంటు-ంది. ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ లెండింగ్ రేటుపై తీసుకున్న రుణాలను బ్యాంకులు వెంటనే సవరించాల్సి ఉంటు-ంది. మూడు నెలలకోసారి సమీక్షించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని నిబంధనలు చెబుతున్నాయి.

## మావోయిస్టు అగ్రనేత భాస్కర్ మృతి

ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ భద్రతా బలగాలకు సమాచారం అందింది. దీంతో ఈ ప్రాంతంలో భద్రతా బలగాలు, పోలీసులు కూంబింగ్ చేపట్టాయి. ఈ విషయాన్ని మావోయిస్టులు పసిగట్టారు. కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. దీంతో వారు ఎదురుకాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మరణించారు. అతడి తలపై రూ. కోటి రివార్డు ఉన్న సంగతి తెలిసిందే. ఇదే ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టు సైతం మృతిచెందిన విషయం విదితమే. ఇదే ప్రాంతంలో భారీగా ఆయుధాలను సైతం భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరోవైపు వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్‌లలో ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతి చెందారు. అలాగే ప్రభుత్వం ఎదుట మరికొంతమంది మావోయిస్టులు లొంగిపోయారు. ఇంకొంతమంది ని పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

## నాకేం తెలియదు.. అంతా కేసీఆర్, హరీశ్‌లకే తెలుసు

స్పష్టం చేశారు. ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు డిజైన్లు, నిర్మాణంతో సంబంధం ఉందా అని కమిషన్ అడిగిందని.. తనకేం సంబంధం లేదని చెప్పానన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్‌పై అధికారం ఉండేదా అని అడగ్గా.. తనకు ఎలాంటి అధికారం లేదని చెప్పినట్లు తెలిపారు. కాళేశ్వరం నిర్మాణం క్వాలిటీ- గురించి ఇంజనీర్లు చూసుకోవాలని.. హరీష్ నాయకత్వంలో కేబినెట్ సబ్ కమిటీ వేశారన్నారు. మంత్రివర్గ ఉపసంఘం, సీడబ్ల్యూసీ రిపోర్ట్ ఆర్థిక శాఖ ముందు పెట్టారని తెలిపారు. నిజాయితీగా ఉండాలని కోరే పార్టీ బీజేపీ అని ఎంపీ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు సృష్టికర్త కేసీఆర్ అని ఆయనే చెప్పుకున్నారని.. ప్రాజెక్టు కట్టాలనే ఆలోచన ఆనాటి ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. కాళేశ్వరంపై నిర్ణయం తీసుకుంది కేసీఆర్ అని.. అప్పుడు ఆయనే బాస్ అన్నారు. తెలంగాణలో మొట్టమొదటి ఆర్థిక మంత్రిగా పనిచేశానన్నారు. తెలంగాణ సాధించుకుంది నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసమని చెప్పారు. 2006లో తుమ్మిడిహట్టి రూ.16 వేలు ఉంటే 2015లో రూ.38 వేల కోట్లకు పెరిగిందన్నారు.

# రేపు, ఎల్లుండి చేప మందు ప్రసాదం పంపిణీ

- ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్



హైదరాబాద్ (జనంసాక్షి) : సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ నెల 8, 9వ తేదీలలో చేప మందు ప్రసాదం పంపిణీ చేయబోతున్నామని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. గాంధీభవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత 175 సంవత్సరాల నుంచి ఉబ్బసంతో బాధపడుతున్న వారికి చేప మందు ప్రసాదం బత్తిని కుటుంబ సభ్యుల ద్వారా ఇస్తున్నారని, చేప మందు ప్రసాదాన్ని ప్రత్యేక ప్రణాళిక తో గతంలో కంటే ఎక్కువ క్యూ లైన్లు ఏర్పాటు చేసిన వివిధ సంస్థల ద్వారా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గతంలో 32 క్యూ లైన్లు ఉంటే ..ప్రస్తుతం 42 క్యూ లైన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. అధికారులను సమన్వయం చేసి ఫిషరీస్ డిపార్ట్ మెంట్ ద్వారా లక్షకు పైగా చేప పిల్లల ప్రసాదం పంపిణ చేస్తామన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, టీ పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారని తెలిపారు. ఏ కోశానా సమస్యలు తలెత్తకుండా పంపిణీ చేస్తామన్నారు. చేప మందు ప్రసాదం కోసం బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక ,జమ్మూ కాశ్మీర్తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాధి గ్రస్తులకు ప్రత్యేక సదుపాయం ఏర్పాటు చేశామన్నారు.ఎంతమంది వచ్చినా చేప మందు ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు భారీ సంఖ్యలో హాజరై చేప మందు ప్రసాదం వినియోగించుకోవాలని కోరారు. చేప మందు ప్రసాదం కోసం సమయనుసారం ప్రత్యేక టోకెన్లు ఇస్తున్నామని, మీడియా ప్రతినిధులకు ప్రత్యేక విజ్ఞప్తి.. వారి కోసం ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

# ఈ నెల 25న లాసెట్ ఫలితాలు

హైదరాబాద్, జూన్ 6 (జనంసాక్షి) : ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహించిన టీజీ లాసెట్, పీజీ లాసెట్ ఫలితాలు ఈ నెల 25న విడుదల కానున్నాయి. అదే రోజు ఫైనల్ కీతోపాటు, ఫలితాలను ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు విడుదల చేయనున్నారు. లాసెట్, పీజీ లాసెట్ పరీక్షలను శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వుడిత్యాల బాలకిష్టారెడ్డి, వైస్‌చైర్మన్లు ప్రొఫెసర్ ఎస్కే మహమూద్, ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్‌లు పాల్గొని పేపర్ కోడ్‌ను ఎంపికచేశారు.

**79.02శాతం హాజరు..**

మొత్తం మూడు సెషన్లల్లో 76 పరీక్షాకేంద్రాల్లో పరీక్షలను నిర్వహించగా 79.02శాతం అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. ఉదయం సెషన్‌లో 20,719 మందికి, 16,109 (77.75శాతం), రెండో సెషన్‌లో 20, 491 మందికి 16,009 (78.13శాతం), మూడో సెషన్‌లో 16,505 మందికి 13,491 (81.74శాతం) అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మీ తెలిపారు.

**10న ప్రాథమిక కీ విడుదల..**

లాసెట్, పీజీ లాసెట్ ప్రాథమిక కీని ఈ నెల 10న తేదీన విడుదల చేస్తారు. కీ కోసం https:/lawcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు. అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోపు ప్రాథమిక కీపై అభ్యంతరాలు వ్యక్తంచేయవచ్చు. ఈ నెల 25న ఫలితాలు విడుదల చేస్తారు.

# రాజన్న కోడెలపై రాజకీయం వద్దు

- 10 ఏళ్ల పాలనలో మీరేం చేశారో చెప్పగలరా?
- గత ప్రభుత్వంలో వేములవాడకి నిధులు ప్రకటించి ఒక్క పైసా కూడా ఇవ్వలేదు?
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్ (జనంసాక్షి) : రాజన్న కోడెలపై రాజకీయమొద్దని.. గడిచిన 10 ఏండ్లలో వేములవాడ టెంపుల్ కి సంబంధించి దేవాదాయ శాఖకు సంబంధించి బీఆర్ఎస్ పాలనలో ఏం చేశారో చెప్పగలరా? అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూటిగా ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేములవాడ టెంపుల్ కి కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఒక్క పైసా కూడా ఇవ్వలేదని ఆమె నిలదీశారు. హామీ ఇచ్చిన నిధులు కేటాయించకపోవడం వల్లనే వేములవాడలో రాజన్న కోడెలకు ఈ దుస్థితి వచ్చిందని ఆగ్రహించారు. నేటి ఈ కోడెల దుస్థితికి పాపం కేసీఆర్ పాలనదేనని అన్నారు. అయితే, కోడెల ఘటన జరిగిన వెంటనే తమ ప్రభుత్వం స్పందించిందని అన్నారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోని ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. అయినా, ప్రతిపక్ష పార్టీలు ఈ విషయంలో బురద రాజకీయం చేయడం సరికాదన్నారు. శుక్రవారం ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో మన రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై బీఆర్ఎస్ నాయకుల మాటలు, స్పందనలు చూస్తే చాలా హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. అవి చూస్తే తనకు ఒకటే గుర్తుకు వస్తుందని అన్నారు. వేములవాడ రాజన్న దగ్గర మొక్కులు మొక్కి రూ.100 కోట్లు ఇస్తానని దేవుడిని మోసం చేసిన ఘనత కేసీఆర్, కేటీఆర్ లది కాదా? అని ఆమె ప్రశ్నించారు. అప్పుడు కేసీఆర్ హామీ ఇచ్చినట్లు వేములవాడకు వంద కోట్లు ఖర్చు పెడితే గోశాల కూడా బాగుపడేది కదా సురేఖ చెప్పుకొచ్చారు. కోడెల మొక్కులు, కోడెలు సమర్పించుకోవటం భక్తుల నమ్మకం, విశ్వాసాలకు సంబంధించిందన్నారు. వాటిని కూడా రాజకీయం చేయటం బీఆర్ఎస్ పార్టీ నీచ రాజకీయానికి, ఆ పార్టీ నాయకుల నీచ మనస్తత్వానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. కేసీఆర్ పదేండ్ల అరిష్టపు పాలన ఇప్పటికీ వేములవాడను వెంటాడుతోందన్నారు. ఆ పాపం బీఆర్ఎస్ పార్టీని కూడా వెంటాడుతుందని.. అందుకే ఆ పార్టీలో లుకలుకలు తెరపైకి వస్తున్నాయన్నారు. తమ నాయకు రేవంత్ రెడ్డి అన్న సీఎం అయ్యాక వేములవాడకు మాస్టర్ ప్లాన్ ఆమోదించుకున్నామని, వేములవాడ అభివృద్ధికి నిధులు ఇచ్చామన్నారు. రాజన్న టెంపుల్ విస్తరించేందుకు వేగంగా చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. ఒక్కో నెలలో భక్తులు ఎక్కువ సంఖ్యలో కోడెలను సమర్పిస్తారని, ఇది అక్కడ అందరికీ తెలిసిందేనని, కొన్నిసార్లు అనారోగ్యంతో ఉన్న కోడెలను భక్తులు ఆలయం వద్ద వదిలేసి వెళుతారని.. వాటిని కూడా సంరక్షించిన బాధ్యత ఆలయంపై ఉంటుందని అన్నారు. ఆ క్రమంలో జరిగిన పరిణామాలపై రాద్ధాంతం, రాజకీయం చేయడం శోచనీయమని మంత్రి పేర్కొన్నారు. గోశాలలో కోడెలకు స్థలం చాలని పరిస్థితి వచ్చిందని మంత్రి గుర్తు చేశారు. కోడెలు జబ్బు పడ్డప్పుడు, వాటి సంరక్షణకు 12 మందితో పశువైద్య అధికారుల బృందాన్ని తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ప్రతి రోజూ సరిపడేంత పచ్చి గడ్డి అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోవులను కాపాడాలని, గోశాలలను అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని గుర్తు చేశారు. గత పదేండ్లలో ఎప్పుడైనా బీఆర్ఎస్ ప్రభుత్వం గోశాల మీద సమావేశం పెట్టిందో లేదో ఫాంహౌసులో పడుకున్న కేసీఆర్ వచ్చి సమాధానం చెప్పాలని నిలదీశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలో ఎన్కేపల్లిలో గోశాల ఏర్పాటు చేయాలని ఇటీవలే అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి ఆదేశాలు కూడా జారీ చేశారన్నారు. వేములవాడలో కూడా సువిశాలమైన గోశాల ఏర్పాటు చేద్దామని, అందుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి తమకు సూచించారన్నారు. తమ అధికారులు, తామంతా అదే పని మీద ఉన్నారన్నారు. తమ ప్రజా ప్రభుత్వాన్ని నిందించే ముందు బీఆర్ఎస్ పదేండ్ల దుర్మార్గాన్ని, దయ్యాల పాలనపై ఆత్మ విమర్శ చేసుకోవాలని భక్తుల విశ్వాసాలు, దేవుళ్లపై రాజకీయ కుట్రలు మానుకోవాలన్నారు. ఎములాడ రాజన్న విషయంలో గానీ.... కోడెల విషయంలో గానీ... తమ ప్రభుత్వం వెంటనే స్పందించిందన్నారు. ఘటనపై స్థానిక కలెక్టర్ సందీప్ కుమార్ ఝూను వెంటనే ఘటనాస్థలికి వెళ్ళి పరిశీలించేందుకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. తీసుకోవాల్సిన చర్యల నిమిత్తం ప్రభుత్వానికి ఆయన నివేదించగా... తాము కోడెల రక్షణకి చర్యలు సైతం తీసుకున్నామన్నారు.

## శ్రీ విశ్వశాంతి మహాశక్తిగా గణపతి రూపం

- ఖైరతాబాద్ మహాగణపతి ఎత్తు 69 అడుగులు
- నిర్జల ఏకాదశి పురస్కరించుకున్న కర్రపూజ



హైదరాబాద్, జూన్6 (జనంసాక్షి) : హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగే ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలకు ఈ ఏడాది శంకుస్థాపనగా కర్ర పూజ ఘనంగా నిర్వహించారు. నిర్జల ఏకాదశి సందర్భంగా శుక్రవారం సంప్రదాయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంవత్సరం ఖైరతాబాద్ మహాగణపతి భక్తులకు 69 అడుగుల ఎత్తులో దర్శనమివ్వనున్నాడు. ఈసారి గణపతి రూపాన్ని శ్రీ విశ్వశాంతి మహాశక్తిగా రూపొందిస్తున్నారు. మహాగణపతికి కుడి వైపు శ్రీ జగన్నాథ స్వామి, శ్రీ లక్ష్మి సమేత హయగ్రీవ స్వామి దర్శనమిస్తే, ఎడమవైపు లలిత త్రిపురసుందరి మరియు శ్రీ గజ్జలమ్మ దేవి కూడా కొలువై ఉంటారు. ఉత్సవ సమితి సభ్యులు ఈ ఏడాది గణపతి రూపాన్ని అధికారికంగా విడుదల చేశారు. భక్తులకు విశేషంగా ఆకర్షించే విధంగా రూపొందిస్తున్న ఈ గణేశ్ విగ్రహం నిర్మాణం త్వరలో ప్రారంభమవనుంది. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేందుకు ఉత్సవ కమిటీలు సిద్ధంగా ఉన్నాయి.కార్యక్రమానికి ఖైరతాబాద్ మహాగణపతి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ కార్యక్రమాన్ని శ్రీగణేష్ ఉత్సవ కమిటీ–ఖైరతాబాద్, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కర్ర పూజ కార్యక్రమంలో కేంద్ర మంత్రి, స్థానిక ఎంపీ కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి కూడా పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం కూలి ఇద్దరు బాలురకు తీవ్ర గాయాలు

- తృటిలో తప్పిన పెను ప్రమాదం
- కుబీర్ మండలం అంతర్నీ గ్రామంలో ఘటన



ముధోల్ , జూన్ 6(జనం సాక్షి) : నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని అంతర్నీ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఘటన సంచలనం రేపింది. గ్రామంలో శిథిలావస్థలో ఉన్న పాత ప్రాథమిక పాఠశాల భవనం అకస్మాత్తుగా కూలిపోవడంతో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి.గ్రామస్తుల కథనం ప్రకారం, గ్రామంలో ఇటీవలే కొత్త పాఠశాల భవనాన్ని నిర్మించినప్పటికీ పాత భవనం ప్రాంగణంలోనే చిన్నారులు రోజూ ఆడుకుంటుండేవారు. శుక్రవారం మధ్యాహ్నం పిల్లలు ఆడుకుంటుండగా ఒక్కసారిగా పాత భవనం కూలిపోయింది. ఈ ప్రమాద సమయంలో అక్కడే ఉన్న చిన్నారులు భయంతో పరుగులు తీశారు. అయితే ఇద్దరు పిల్లలు శిథిలాల్లో చిక్కుకుపోయారు. విషయం గమనించిన స్థానిక యువకులు తక్షణమే స్పందించి వారిని కాపాడారు. వేసవి సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి వచ్చిన సాయికుమార్ (7) తలకు తీవ్ర గాయాలు కాగా, అదే గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్ (6) కాలుకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికుల సాయంతో ఇద్దరిని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ ఘటన గ్రామస్థులను తీవ్ర కలకలం లోకి నెట్టింది. అధికారులు శీఘ్రమే శిథిల భవనాలను తొలగించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

## ప్రజావాణిలో 187 దరఖాస్తులు

- దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య



హైదరాబాద్ (జనం సాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 187 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 28, రెవెన్యూ శాఖకు సంబంధించి 35, ఇందిరమ్మ ఇండ్ల కోసం 47, మున్సిపల్ శాఖకు 10, విద్యుత్ శాఖకు 17, హెూం శాఖకు 10 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 33 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సింగరేణిలో కారుణ్య నియామకాలు చేపట్టాలని, అందుకు చొరవ చూపాలని నిరుద్యోగ యువకులు చిన్నారెడ్డి, దివ్యలను కోరగా, సంబంధిత అధికారులతో వారు ఫోన్ లో మాట్లాడి త్వరలో నియామక ప్రక్రియ మొదలు పెట్టాలని సూచించారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## మళయాళ నటుడు చాకో కారుకు ప్రమాదం

- తమిళనాట ప్రమాదంలో తండ్రి మృతి

చెన్నై, జూన్6 (జనంసాక్షి) : ప్రముఖ మలయాళ నటుడు, దసరా సినిమా విలన్ షైన్ టామ్ చాకో కుటుంబం ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. శుక్రవారం ఉదయం వారు ప్రయాణిస్తున్న కారు ఓ లారీని ఢీకొట్టింది. తమిళనాడులోని పాలకోట్టాయ్ సమీపంలో ఉదయం 7 గంటల ప్రాంతంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చాకో తండ్రి అక్కడికక్కడే చనిపోయాడు. చాకో, చాకో తల్లి తీవ్రంగా గాయపడ్డారు. కారు డ్రైవర్, చాకో తమ్ముడికి కూడా గాయాలు అయినట్లు తెలుస్తోంది. గాయపడ్డ వారిని హుటాహుటిన ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఉప్పరపల్లి విద్యార్థులను అభినందించిన వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద



చెన్నారావుపేట, జూన్ 6(జనం సాక్షి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వరంగల్ రీజియన్ వారు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయి ద్వితీయ బహుమతిని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కల్లెపు హరిప్రియ, చిత్రలేఖన పోటీలో ప్రత్యేక బహుమతిని చిలపాక ద్రాక్షాయని అందుకున్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ లో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద చేతులమీదుగా ప్రశంస పత్రం, మెమెంటో పొందారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, జిల్లా అటవి కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నిట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పరపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను గైడ్ టీచర్లు గజవెల్లి సుందర్, కె. సంతోష్ కుమార్, రాగి శశిధర్, పిన్నింటి బాలాజీ రావు లను అభినందించారు.

## కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్‌కు ఊరట

- ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దన్న హైకోర్టు

బెంగళూరు, జూన్ 6 (జనంసాక్షి) : బెంగళూరు తొక్కిసలాటకు సంబంధించి కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్‌పై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం, ఈవెంట్ ఆర్గనైజర్ డీఎన్ఏ ఎంటర్–టైన్‌మెంట్‌తో పాటు–కేఎస్‌సీఏపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తమపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కేఎస్‌సీఏ న్యాయస్థానాన్ని ఆశ్రయించా.. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ ఇచ్చింది.ఐపీఎల్ 2025 ఛాంపియన్ గా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు– విజయోత్సవ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటతో తమకు ఎలాంటి సంబంధం లేదని కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ వెల్లడించింది. ఇది కేవలం రాష్ట్ర ప్రభుత్వం, ఆర్సీబీ యాజమాన్యం, ఈవెంట్ నిర్వాహకుల తీరు వల్లే కొనసాగిందన్నారు. అభిమానులను కట్టడి చేయడంలో పోలీసులు విఫలం అయ్యారు.. వారు చేసిన పొరపాటుకు కేఎస్‌సీఏపై కేసులు పెట్టడం తగదని విమర్శించింది. దీనిపై కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే, ఆర్సీబీ జట్టు విజయోత్సవ ర్యాలీతో తమకు ఎలాంటి సంబంధం లేదని కేఎస్‌సీఏ వెల్లడించింది. ప్లేయర్స్ ను సత్కరించాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయించింది.. అది కూడా ఎం చిన్నస్వామి స్టేడియంలో జరగలేదు.. విధాన సౌధ దగ్గర కొనసాగదింది.. ఈ కార్యక్రమంలో సీఎం, డిప్యూటీ– సీఎంతో పాటు– కేబినెట్ మంత్రులు, ఉన్నతాధికారులు సైతం పాల్గొన్నారు.. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అధికారులు పర్మిషన్ ఇచ్చారు.. ఇందులో కేఎస్‌సీఏ జోక్యం కొంచెం కూడా లేదన్నారు. కేవలం వేదికను రెండ్ కు ఇవ్వడం, క్రికెట్ సంబంధిత వ్యవహారాల వరకే ఆసోసియేషన్ బాధ్యత తీసుకుంటుందని కేఎస్‌సీఏ పేర్కొంది.

## పోలీసు అదుపులో ఉన్న మావోయిస్టు నాయకులను కోర్టులో హాజరుపరచాలి

- ప్రాణలతో దొరికిన వారిని హత్యచేయడం రాజ్యాంగ విరుద్ధం
- వారికి ప్రాణహాని తలపెట్టవద్దు : తెలంగాణ పౌర హక్కుల సంఘం

హైదరాబాద్, జూన్ 6 (జనంసాక్షి) : చత్తీస్గఢ్ పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్ట్ నాయకులు బండి ప్రకాష్, నేషనల్ పార్క్ కార్యదర్శి దిలీప్, మద్దెడు ఏరియా కార్యదర్శి సీటు, రామన్న డిసి మెంబర్, మున్నా, సునీత, మహేష్‌లతో పాటు పది మంది మావోయిస్ట్ నాయకులకు పోలీసులు ప్రాణహాని తలపెట్టకుండా వెంటనే కోర్టులో హాజరు పరచాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణ రావు ఒక ప్రకటన విడుదల చేశారు. బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవి ప్రాంతంలోని ఒక గ్రామంలో గురువారం రోజు మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ మెంబర్ సుధాకర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ మెంబెర్ మైలారపు ఆడేళ్ళు ఏ భాస్కర్, బండి ప్రకాష్, నేషనల్ పార్క్ కార్యదర్శి దిలీప్, మద్దెడు ఏరియా కార్యదర్శి సీటు, రామన్న డిసి మెంబర్, మున్నా, సునీత, మహేష్‌లతో పాటు పది మంది మావోయిస్ట్ నాయకులను పోలీసులు ప్రాణాలతో పట్టుకున్నారు. అదేరోజు సుధాకర్‌ను ఎన్కౌంటర్ పేరున హత్య చేశారు. శుక్రవారం సాయంత్రం భాస్కర్‌ను కూడా ఎన్‌కౌంటర్ పేరుతో హత్యచేశారు. అదుపులోని బండి ప్రకాష్, మిగతా మావోయిస్టు నాయకులను కూడా ఎన్కౌంటర్ పేరున హత్యచేసే ప్రమాదముంది. వారికి ఎలాంటి హాని తలపెట్టకుండా వెంటనే కోర్టులో హాజరు పరచాలని పౌరహక్కుల సంఘం తెలంగాణ డిమాండ్ చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రాణాలతో దొరికిన మావోయిస్టు నాయకులను హతమార్చడం రాజ్యాంగ విరుద్ధమని, దేశవ్యాప్తంగా ప్రజాస్వామికవాదులు, ప్రతిపక్ష పార్టీలు దీన్ని ముక్తకంఠంతో ఖండిరచాలని కోరారు. మావోయిస్ట్ పార్టీ ప్రకటించినట్లుగా కేంద్ర ప్రభుత్వం కూడా కాల్పుల విరమణ ప్రకటించి, ఆ పార్టీతో శాంతి చర్చలు జరపాలని పౌర హక్కుల సంఘం డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు.

## అప్పుల బాధ యువకుని ఆత్మహత్య

కడెం, జూన్ 6(జనం సాక్షి) : అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కడెం మండలంలోని చిట్యాల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కడెం ఎస్సై ఎం కృష్ణ సార్ రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. చిట్యాల గ్రామానికి చెందిన బాణావత్ రవి అనే యువకుడు గత నాలుగు సంవత్సరాల క్రితం అప్పు చేసి దుబాయ్ వెళ్లి వట్టి చేతులతో ఇంటికి తిరిగి వచ్చాడు. దాంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది గురువారం రోజున రాత్రి అందాద 11:30 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని చనిపోయాడని తల్లి జీజ బాయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడెం ఎస్సై ఎం కృష్ణసారెడ్డి తెలిపారు.

## బెంగళూరు తొక్కిసలాటలో మరో వికెట్ డౌన్

- సిఎం రాజకీయకార్యదర్శి గోవిందరాజన్‌కు ఉద్వాసన

బెంగళూరు, జూన్6 (జనంసాక్షి) : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజకీయ కార్యదర్శి కె.గోవిందరాజ్‌ను ఆ పదవి నుంచి తొలగించారు. ఆయన నియమాకాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం వెంటనే అమల్లోకి వచ్చినట్టు– ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఆర్‌సీబీ ఐపీఎల్ టీ–మ్ విజయోత్సవం సందర్భంగా బెంగళూరులోని స్టేడియంలో ఈనెల 4న జరిగిన తొక్కిసలాటలో 11 మంది దుర్మరణ పాలయ్యాయి. ఈ నేపథ్యంలో గోవిందరాజ్‌కు ఉద్వాసన చెప్పినట్టు–తెలుస్తోంది. అయితే ఆయనను తొలగించడానికి కారణం ఏమిటనేది అధికారిక ప్రకటనలో వెల్లడించలేదు. ఆర్‌సీబీ ఐపీఎల్ టీమ్ విజయోత్సవాన్ని విభేదిస్తూ తాను సీఎంకు సలహా ఇచ్చానని గోవిందరాజ్ పేర్కొన్నట్టు– ఒక కథనం వచ్చింది. అయితే తన మాటలను వక్రీకరించారని, ఈ అంశంపై తాను ఎప్పుడూ ముఖ్యమంత్రికి సలహా ఇవ్వలేదని గోవిందరాజ్ వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రికి సలహా ఇవ్వడానికి నేనెవర్ని? అని ఆయన ప్రశ్నించారు. విషాదంతంగా మారిని ఫెలిసిటేషన్ ఈవెంట్ ఎ÷–లానింగ్, నిర్ణయం విషయంలో తనకెలాంటి ప్రమేయం లేదన్నారు. క్రికెట్‌కు సంబంధించిన విషయంలో తాను ఎలాంటి బ్రీఫింగ్ ఇవ్వలేదని, నిజానికి తాను కర్ణాటక ఒలంపిక్ అసోసియేషన్‌కు హెడ్‌గా ఉన్నానని చెప్పారు. ఆ కారణంగా క్రికెట్ సెలబ్రేషన్‌పై తాను సలహాలివ్వడం సరికాదన్నారు. కాగా, తొక్కిసలాట ఘటన అనంతరం బెంగళూరు సిటీ– పోలీస్ కమిషనర్ బి.దయానంద సహా పలువురు ఐపీఎస్ అధికారులను కర్ణాటక పోలీసులు సస్పెండ్ చేశారు. సిటీ– కొత్త పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి సీమంత్ కుమార్ సింగ్ శుక్రవారంనాడు బాధ్యతలు చేపట్టారు.

## ఈ నెల 8, 9 తేదీల్లో ఐసెట్ పరీక్ష..

హైదరాబాద్, జూన్ 6 (జనంసాక్షి) : ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2025 – 26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఐసెట్ పరీక్ష ఈ నెల 8, 9 తేదీల్లో (ఆదివారం, సోమవారం) రాష్ట్రవ్యాప్తంగా జరగనుంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో నిర్వహించే ఈ పరీక్షకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్ష సందర్భంగా ఎగ్జామ్ సెంటర్ల గేట్లను పరీక్షకు 15 నిమిషాల ముందే క్లోజ్ చేస్తామని ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ అలువాల రవి తెలిపారు. రెండు రోజుల్లో మూడు సెషన్లల్లో ఐసెట్ పరీక్ష జరుగుతుందని కన్వీనర్ ప్రొఫెసర్ అలువాల రవి అన్నారు. మొదటి సెషన్ ఈనెల 8న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 : 30 గంటల వరకు, ఇక మధ్యాహ్నం 2 : 30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్ష జరుగుతుందన్నారు.

ఇక ఈ నెల 9వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 : 30 గంట వరకు మూడో సెషన్‌లో పరీక్ష జరుగుతుందన్నారు. దీంతో పరీక్షలు ముగుస్తాయయని పేర్కొ న్నారు. ఉదయం సెషన్‌లో 9: 45 గంటలు, మధ్యాహ్నం సెషన్‌లో 2: 15 గంటలకే గేట్లు మూసేస్తామని చెప్పారు. 16 జోన్లల్లో 96 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక ఈ సారి మొత్తం 71,757 మంది ఐసెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 34,409 మంది పురుషులుండగా, 37,331 మంది మహిళలున్నారు. హాల్‌టికెట్ నంబర్లపై క్యూఆర్‌కోడ్‌ను ముద్రించారు. ఈ కోడ్‌ను స్కాన్‌చేసి సెంటర్ల అడ్రస్ తెలుసుకోవచ్చని ప్రొఫెసర్ అలువాల రవి తెలిపారు.

# సింగరేణిలో మందుల కొరత?



ఉదయం 8 గంటలకే గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పిటల్ ఔట్‌పేషెంట్స్‌తో సందడిగా ఉంటుంది. క్లర్క్‌లు చిట్టీలు రాయడం మొదలుపెట్టకముందే 60 ఏళ్లు పైబడిన రిటైర్డ్ కార్మికులు క్యూలో నిలబడటం సర్వసాధారణం. రిటైర్మెంట్ తర్వాత వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన కార్మిక కుటుంబాలు నెలకు ఒకసారి తమ రిటైర్డ్ ఏరియా హాస్పిటల్‌కు మందుల కోసం వస్తుంటారు. గోదావరిఖని, కొత్త గూడెం, ఇల్లందు, మణుగూరు, భూపాలపల్లి, రామకృష్ణపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియా హాస్పిటల్స్‌లో పేరు నమోదు, డాక్టర్ సంతకం, మందుల నమోదు, ఫార్మసిస్ట్ వద్దుఇలా నాలుగు చోట్ల క్యూలో నిలబడి మందులు తీసుకుంటున్నారు.

బీపీ, షుగర్, థైరాయిడ్, హార్ట్ సమస్యలు, కీళ్ల నొప్పులు వంటి దీర్ఘకాలిక వ్యాధులకు మందుల కోసం 100-200 కిలోమీటర్ల దూరం ప్రయాణించి సింగరేణి హాస్పిటల్స్‌కు రావడం వల్ల ఆర్థిక, శారీరక, మానసిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని రిటైర్డ్ కార్మికులు అనేకసార్లు విజ్ఞాపనలు సమర్పించారు. కనీసం కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌లలోని సింగరేణి రెఫరల్ హాస్పిటల్స్‌లో మందులు అందించే సౌకర్యం కల్పించాలని చిర కాలంగా డిమాండ్ చేస్తున్నారు. 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించినప్పటికీ, ఇప్పటివరకు ఆచరణాత్మక చర్యలు లేవు.

పైగా, గతంలో నెల రోజులకు సరిపడా మందులు ఇచ్చేవారు, ఇప్పుడు కేవలం వారం లేదా పది రోజులకు సరిపడే మందులు మాత్రమే అందిస్తున్నారు. ఎందుకని అడిగితే, "మందుల కొరత" అని సమాధానం. ఈ కొరతకు అధికారుల అలసత్వమే కారణం. సంస్థాగత విధానాలు, అధికారులకు బాధ్యతాయుత పనితీరును కల్పించే చర్యలు లేకపోవడం వల్ల కార్మికుల హక్కుల అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

సింగరేణికి 136 ఏళ్ల గొప్ప చరిత్ర ఉంది. 1889లో 59,671 టన్నుల బొగ్గు ఉత్పత్తితో మొదలై, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, సింగరేణి "నల్ల బంగారం"గా రాణిస్తోంది. ఈ ఉత్పత్తిలో 60.79 మిలియన్ టన్నులు ప్రభుత్వ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు, 2.47 మిలియన్ టన్నులు క్యాప్టివ్ పవర్ హౌస్‌లకు, 2.88 మిలియన్ టన్నులు సిమెంట్ కంపెనీలకు, 0.54 మిలియన్ టన్నులు భారజల కేంద్రాలకు, 0.36 మిలియన్ టన్నులు స్పాంజ్ ఐరన్ రంగానికి, 2.82 మిలియన్ టన్నులు ఇతర పరిశ్రమలకు సరఫరా చేయబడ్డాయి. సింగరేణి థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్‌టీపీపీ)లో 8,853.53 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగింది. బొగ్గు అమ్మకాల ద్వారా రూ.25,456.84 కోట్లు, విద్యుత్ అమ్మకాల ద్వారా రూ.4,557.37 కోట్లు, సౌర విద్యుత్‌తో కలిపి మొత్తం రూ.31,556.65 కోట్ల ఆదాయం సాధించబడింది. ఉత్పత్తి ఖర్చులు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించిన పన్నుల తర్వాత రూ.16,034.58 కోట్ల నికర లాభం సాధించింది.

సింగరేణి తెలంగాణకు గుండెకాయ, ఉపాధి అవకాశాలకు కొంగుబంగారం. 2014-15 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వానికి రూ.25,949.17 కోట్లు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.23,138.44 కోట్లు రాయల్టీ, పన్నుల రూపంలో చెల్లించింది. 2021-24 మధ్య ఒడిశా ప్రభుత్వానికి రూ.12.56 కోట్లు చెల్లించింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్), డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) కింద రూ.2,940.72 కోట్లు, మెడికల్ కాలేజీకి రూ.500 కోట్లు, రాజీవ్ గాంధీ అభయ హస్తం పథకం కింద యూపీఎస్సీ విద్యార్థులకు రూ.500 కోట్లు వెచ్చించింది.

ప్రభుత్వ పరిశ్రమలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఆదర్శం. సహజ సంపదలను వికేంద్రీకరించి, కార్మికులకు మెరుగైన జీతభత్యాలు, సామాజిక అభివృద్ధి, ధరల స్థిరీకరణ, పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయి. కానీ, కేంద్ర ప్రభుత్వం పరిశ్రమల ఉపసంహరణ పేరుతో వాటిని అమ్మడం లేదా మూసివేయడం వేగవంతం చేస్తోంది. సింగరేణి వంటి పరిశ్రమలు తల్లిలాంటివి, హోటల్‌లా కాదు!

సింగరేణి కార్మికులు ప్రతికూల వాతావరణంలో, గనులలో పనిచేస్తూ అనారోగ్యాలకు గురవుతున్నారు. వారికి, రిటైర్డ్ కార్మికులకు వైద్య సౌకర్యాలు అందించే ఒప్పందం ఉంది. "కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికేర్ స్కీం" (సీపీఆర్ఎంఎస్) కింద రిటైర్డ్ కార్మికులు రూ.40,000 చెల్లించి సభ్యత్వం పొందగా, సింగరేణి యాజమాన్యం రూ.18,000 వాటా కలిపి రూ.259 కోట్ల కార్పస్ ఫండ్‌ను టర్మ్ డిపాజిట్‌గా పొదుపు చేసింది. 2025 మే 26 నాటికి 80,000 మంది సభ్యులుండగా, ఈ ఫండ్ నుంచి రూ.19.05 కోట్ల వడ్డీ వచ్చింది. సీపీఆర్ఎంఎస్ కింద రిటైర్డ్ కార్మికులకు, వారి జీవిత భాగస్వాములకు ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ చికిత్సలతోపాటు రెఫరల్ హాస్పిటల్స్‌లో రూ.8,00,000 విలువైన వైద్య సేవలు అందాలి. కానీ, అధికారులకు రూ.25,00,000, ప్రతి 6 నెలలకు రూ.18,000 (సంవత్సరానికి రూ.36,000) నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమవుతాయి, అయితే కార్మికులు నెలకు ఒకసారి దూర ప్రయాణం చేసి మందులు తెచ్చుకోవాల్సి వస్తోంది.

సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ) వివరాల ప్రకారం, కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్‌తోపాటు గోదావరిఖని, భూపాలపల్లి, రామకృష్ణపూర్, మందమర్రి, మణుగూరు, ఇల్లందు ఏరియాల్లో 6 హాస్పిటల్స్, 21 డిస్పెన్సరీలు, 821 పడకలు, 180 డాక్టర్లు (57 స్పెషలిస్ట్‌లు, 123 మెడికల్ ఆఫీసర్లు) సేవలందిస్తున్నారు. ఈఎన్‌టీ సర్జన్, జనరల్ సర్జన్, రేడియాలజిస్ట్‌లు, 175 టెక్నికల్ స్టాఫ్, ఆప్తమాలజీ, ఎక్స్-రే పోస్ట్‌లు భర్తీ చేయాల్సి ఉంది. సంవత్సరానికి రూ.140 కోట్లు వైద్య అవసరాలకు, రూ.40 కోట్లు మందులకు ఖర్చు చేస్తున్నారు. 42,000 పర్మనెంట్, 25,000 కాంట్రాక్ట్ ఉద్యోగులు, 1,60,000 రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబాలకు వైద్య సేవలు అందిస్తున్నారు. కానీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రమాణాల ప్రకారం, 1,000 మందికి ఒక డాక్టర్ ఉండాలి. సింగరేణి కార్మికులు ప్రమాదకర వాతావరణంలో పనిచేస్తుండటం వల్ల మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు అవసరం. సింగరేణిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 51% వాటాతో నిర్వహణ బాధ్యతలు చేపడుతోంది. చైర్మన్, డైరెక్టర్లు, జనరల్ మేనేజర్ల నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటుంది. కాబట్టి, సింగరేణి హాస్పిటల్స్‌లో మందుల కొరత, రిటైర్డ్ కార్మికుల ఔట్‌పేషెంట్ ఇబ్బందులపై తెలంగాణ ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌లలోని రెఫరల్ హాస్పిటల్స్‌లో ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలి. డాక్టర్లు, సిబ్బంది, స్పెషలిస్ట్‌లను నియమించి, వైద్య సౌకర్యాలను మెరుగుపరచాలి. కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.



మేరుగు రాజయ్య
వాట్సాప్ నంబర్:
9441440791



# ఇది ఖాళీ కడుపు తొక్కిసలాట కాదు

కడుపు నిండిన తొక్కిసలాట! ఆఫ్రికా వంటి పేద దేశాల్లో, పాలస్తీనా లాంటి యుద్ధ రీతి ప్రాంతాల్లో ఆకలి కోసం తొక్కిసలాటలు, చావులు సంభవించినవి మనం విన్నాం. కానీ, భారతదేశంలో క్రీడలు, సినిమాలు, గుళ్లు, నదులు, టిక్‌టాక్ విన్యాసాలు, రోడ్లపై స్టంట్లుఇలాంటి వాటి కోసం చావులు చూస్తున్నాం. గెలుపు స్ఫూర్తినివ్వాలి, కానీ 20 ఏళ్లలోపు యువత ప్రాణాలు కోల్పోవాలా? క్రికెట్ స్టేడియం, గుడి, సినిమా హాల్, నదుల వద్ద, రోడ్లపై చిత్రవిచిత్రమైన మరణాలు! మనం ఏం చేస్తున్నాం? ఎటు పోతున్నాం?

ఈ మరణాలు దేశాన్ని కాపాడిన సైనికులవి కావు, ప్రపంచాన్ని జయించిన విశ్వవిజేతలవి కావు, నోబెల్ బహుమతి గ్రహీతలవీ కావు. అయినా, అతిశయమైన అభిమానంతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. కోట్ల రూపాయలు సంపాదించే క్రికెటర్లు బాధిత కుటుంబాలను పరామర్శించారా? 10 లక్షల రూపాయలు ఒక ప్రాణాన్ని తిరిగి తెచ్చిస్తాయా? అభిమానుల సందడిలో ఫ్లయింగ్ కిస్‌లతో సరదా తీర్చుకునే క్రికెటర్లు, సన్మానాలతో పేరు తెచ్చుకోవాలనుకునే ప్రభుత్వం, రాజకీయ లబ్ధి కోసం విపక్షాలు, రేటింగ్ కోసం మీడియాఈ మధ్యలో బలవుతున్నది పిచ్చి అభిమానం!

అభిమానానికి హదలు ఒక వ్యక్తి నైపుణ్యాన్ని మెచ్చుకోవచ్చు, కానీ అతిగా అభిమానించి, అన్నీ వదులుకొని ప్రాణాలు పణంగా పెట్టడం సమంజసమా? యువత తమ భవిష్యత్తును, తమ గురించి తపనపడే తల్లిదండ్రులను ఆరాధించాలి, కోహ్లీ అని అరిచి ప్రాణాలు కోల్పోవడం కాదు. కోహ్లీ ఒక్క అభిమానిని గుర్తుపట్టగలడా? 30 వేలు మంది జనం వస్తారని తెలిసినా, స్టేడియం వద్ద తగిన కట్టడి చేయని పోలీసులు, ప్రణాళికలో లోపించిన ఆర్‌సీబీ నిర్వాహకులుఒకరి తప్పును మరొకరిపై వేస్తూ పోతున్నాం. ఇక్కడ అందరిదీ తప్పు!

ఈ ఘటనలు మళ్లీ జరగవని హామీ ఇవ్వగలమా? నివారణ కాదు, నిర్మూలన కావాలి. ఒక 12 ఏళ్ల అమ్మాయి విలవిలలాడి చనిపోయింది. ఈ తొక్కిసలాటల వెనుక మానవ ప్రవృత్తిలో పెను మార్పులు, ఒక వ్యక్తికి వీరాభిమాన హైప్ ఇవ్వడం కారణం. అభిమానం హద్దుల్లో ఉండాలి. దేశాభివృద్ధి మారిందా? నిరుద్యోగం తగ్గిందా? మనం మారకపోతే, మన దేశం మారదు. యువతా, ఆలోచించండి! మీ భవిష్యత్తును, మీ తల్లిదండ్రులను గౌరవించండి. అధికార, విపక్ష రాజకీయాలు, మీడియా రేటింగ్ లాభాల కోసం యువత ప్రాణాలు బలవుతున్నాయి. ఈ విషాదం నుంచి పాఠం నేర్చుకుందాం. స్పష్టమైన భద్రతా చర్యలు, సమన్వయం, ప్రజల్లో చైతన్యంఇవి ఇకపై అవసరం. మార్పు మనలోనే మొదలవాలి!

ఉమాశేషారావు వైద్య
లెక్చరర్ ఇన్ పొలిటికల్ సైన్స్
కామారెడ్డి, 9440408080

## కవితామాధుర్యాలు

తీపిపదార్థాలు తింటుంటా
తియ్యనిపలుకులు తొనకుతుంటా
కమ్మనికవితలు కూరుస్తుంటా
కవనప్రేమికులను కుతూహలపరుస్తుంటా
బెల్లపుముక్కలు చప్పరిస్తుంటా
ఆనందమును చేకూర్చుతుంటా
చక్కెరరసము త్రాగుతుంటా
సంతసము కలిగిస్తుంటా
రసగుల్లాలు లాగిస్తుంటా
నవరసాలు చిందిస్తుంటా
మిఠాయిలు మెక్కుతుంటా
మధురానుభూతులు క్రక్కుతుంటా
జిలేబీలు ఆరగిస్తుంటా
తనువులు తృప్తిపరస్తుంటా
లడ్డులు కొరక్కుతింటుంటా
కాయాలను కుషీపరస్తుంటా
పూతరేకులు భక్షిస్తుంటా
మదులను ముచ్చటపరస్తుంటా
పాయసము పుచ్చుకుంటుంటా
పారవశ్యము పంచిపెడుతుంటా
కవితామాధుర్యాలు అందిస్తుంటా
సాహితీప్రియులను సంబరపరస్తుంటా
తియ్యనికవితలు సృష్టిస్తుంటా
పాఠకులహృదులు పులకరిస్తుంటా

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం



## కొత్త ప్రపంచం!

మళ్ళీ మళ్ళీ ఎన్నిసార్లైనా
ఇదేయిదే చెపుతాను!
సహకారగుణంతో ఉండు!

అలాగే మళ్ళీమళ్ళీ చెపుతాను
ఉన్నాడనుకుంటున్న దేవుడు
పంచభూతాలనేఇచ్చాడు!

తిండీ గుడ్డా నీడా తయారీ
వ్యవసాయం వాణిజ్యం
మనిషి నేర్చిన విద్యలు!

దైవప్రసాదం నిరహంకారం!
మానవవిద్యలు అహంకారం
అహంకారరాహిత్యమే దైవం!

నీ అంతరాత్మే దేవుడు
దుర్గుణాలతో నింపకు

సహకారమే సద్గుణం!

పరులసొమ్ము పాము వంటిది
ఇది పరిపూర్ణ సత్యం
ఆశిస్తే కాటు వేస్తుంది!

ఇప్పుడున్న ప్రపంచమంతా
ద్రోహసర్పం కాటుతో
విలవిలలాడిపోతోంది!

దురాశనువీడి చూడు
నీ జీవితం తేజోవంతం
'సబ్ కా వికాస్'నాడే సాధ్యం!

సొంత ఆస్తిని'కొంత' కాదు
'అంతా' వదిలేసుకో!
సమాజఆస్తిని ఎంతైనాపెంచు!

ఇంటికి హద్దులు-దేశానికి
సరిహద్దులు ఉండకూడదు!
కొత్తప్రపంచాన్ని సృష్టించు!

మనమంతా 'మనుషులం'
ఈ కాంక్ష తప్ప ఇతర
వివక్షలన్నీ వదులుకో!

ఒకరికొకరు సహకరిస్తూ
జీవించటం ఎలాగో
నీ మేధస్సు ఉపయోగించు!

ఒక్క ఇల్లు నీదనుకోకు
ఈ ప్రపంచమంతా నీదే!
సహకారమే సౌభాగ్యం!

తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# కర్షకుల మద్దతుపై ధ్యాసలేని 'కాళేశ్వరం' నిర్మాత



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాత, కేసీఆర్, తన మేధస్సుతో రూపొందించిన ఈ ఎత్తిపోతల పథకం కోసం రైతుల మద్దతును సమీకరించడంలో విఫలమయ్యారు. ఈ ప్రాజెక్టు రైతుల కోసమే నిర్మించబడినప్పటికీ, వారిని తన వెంట ఉంచుకోవడంలో ఆయన బద్దకించారు. తాను అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, ఎవరైనా తన వద్దకే రావాలనే ఆక్షేపణీయ వైఖరి, కాళేశ్వరం నీటిని కిందకు తీసుకొచ్చినా, రైతుల మనసు గెలవలేకపోయింది.

కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయంగా విమర్శించడం ప్రారంభించినప్పటి నుంచి, కేసీఆర్ స్వయంగా లబ్ధిదార రైతుల వద్దకు వెళ్లి నిజాలను వివరించాల్సింది. వారంలో ఒక జిల్లా చొప్పున, ముఖ్యంగా కొత్త ఆయకట్టు జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులతో సంభాషించాల్సింది. కానీ, ప్రజలను, రైతులను కలవడంపై ఆసక్తి లేకపోవడం, "రైతులకు నీళ్లు, డబ్బు ఇచ్చాం, ఇంకేం కావాలి?" అనే అతి విశ్వాసం, పొగరు రైతులతో దూరం పెంచింది. ఈ గ్యాప్‌ను కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా ఉపయోగించుకుంది, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చడంలోనూ, అధికారంలోకి వచ్చాక కూడా దీన్ని వాడుకుంటోంది.

కేసీఆర్ కనీసం కేటీఆర్, హరీశ్ రావులను కాళేశ్వరం నెట్‌వర్క్ జిల్లాల్లో పాదయాత్రలకు పంపి, రైతుల్లో చైతన్యం తీసుకురావాల్సింది. అలా చేసి ఉంటే, కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టును రాజకీయ ఆయుధంగా ఉపయోగించడం కష్టమయ్యేది. రైతులు కేసీఆర్ వెనుక ఉన్నారనే సంకేతం ఉంటే, కాంగ్రెస్ జాగ్రత్తగా వ్యవహరించేది. తెలంగాణ రాష్ట్ర సాధనలో అందరినీ కలుపుకొని సక్సెస్ అయిన కేసీఆర్, కాళేశ్వరం విషయంలో రైతుల మద్దతును కోల్పోయారు.


మేడిగడ్డ బ్యారేజీలోని పియర్ల బలహీనతకు నిశిత పర్యవేక్షణ లోపం, క్షేత్రస్థాయి తనిఖీలు లేకపోవడం, ఇంజినీర్లు, నిపుణులతో సంప్రదింపులు లేకపోవడం, కాంట్రాక్టర్లతో అతి సన్నిహితం కావడం కారణమయ్యాయి. ఈ లోపాలు పియర్లకు పగుళ్లతోపాటు బీఆర్ఎస్ పార్టీ కీర్తికి కూడా గీటురాయి వేశాయి. అవినీతి, పర్సంటేజీల ఆరోపణలు నీటిపారుదల శాఖలో ఎప్పటి నుంచో ఉన్న నిష్ఠుర సత్యం. కానీ, కాళేశ్వరం ప్రాజెక్టు రూ. లక్ష కోట్ల వ్యయంలో అవినీతి జరిగిందనే ఆరోపణలు అసంబద్ధం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ ఆనకట్టల నిర్మాణానికి రూ. 8-9 వేల కోట్లు ఖర్చైనప్పుడు, లక్ష కోట్ల అవినీతి ఎలా సాధ్యం? ఈ వాస్తవాలను రైతులకు వివరించడంలో బీఆర్ఎస్ విఫలమైంది.

కాళేశ్వరం వల్ల 20 లక్షల ఎకరాలు కొత్తగా సాగులోకి వచ్చాయి, కోటి ఎకరాలు స్థిరీకరణ జరిగింది. గతంలో రూ. 50 వేలు పలకని బీడు భూముల ధరలు ఇప్పుడు రూ. 20 లక్షల నుంచి కోటి దాకా ఎగబాకాయి. ఈ లబ్ధిని పొందిన 50 లక్షల మంది రైతుల మద్దతును బీఆర్ఎస్ సమీకరించాలి. కేసీఆర్ రైతుల వద్దకు వెళ్లి, "లక్ష కోట్ల అవినీతి జరిగి ఉంటే ఈ నీళ్లు, సిరులు మీ పొలాలకు ఎలా వచ్చాయి?" అని ప్రశ్నించాలి. రైతుల్లో ఈ ఆలోచన రేకెత్తిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఒళ్లు దగ్గర పెట్టుకుని, మేడిగడ్డ పియర్ల రిపేర్లు, ప్రాజెక్టు పూర్తి వినియోగాన్ని వేగవంతం చేసేది.

కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం వివాదాన్ని రాజకీయంగా వాడుకుంటూ, 1-2% మిగిలిన పనులను పూర్తి చేయకుండా కాలయాపన చేస్తోంది. గోదావరి 1000 టీఎంసీల నీటి వాటాను పొరుగు రాష్ట్రం 400 టీఎంసీలపై కన్నేస్తుంటే, బీఆర్ఎస్ ఈ అంశాన్ని ప్రజల్లో చర్చకు పెట్టాలి. బీఆర్ఎస్ కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రచారాన్ని ఎదుర్కోలేక, హ్యాట్రిక్ అధికారాన్ని కోల్పోయింది. ఇప్పటికైనా కేటీఆర్, హరీశ్ రావు, కవితలలో ఎవరో ఒకరు పాదయాత్ర చేపట్టి, రైతుల్లో చైతన్యం తీసుకురావాలి. కాళేశ్వరం ప్రాజెక్టులను కాపాడి, తెలంగాణ వ్యవసాయానికి జీవం పోయాలి. విచారణ కమిషన్‌ను ఎదుర్కొంటున్న కేసీఆర్‌కు బదులు, ప్రజా క్షేత్రంలో పాదయాత్రతో రైతుల మద్దతు కూడగట్టాలి.

ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌హైదరాబాద్, 9440850384

# జీవితమే సందేశంగా నిలిచిన బోయినపల్లి వెంకట రామారావు



సమాజ మార్పుకు కృషి చేసే వ్యక్తులు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారు. అలాంటి అసాధారణ వ్యక్తుల్లో ఒకరు బోయినపల్లి వెంకట రామారావు (1920%-%2014). స్వాతంత్ర్యోద్యమంలో సిద్దిపేట ప్రాంతం నుంచి ఉద్భవించిన ఈయన, జిజ్జంకి మండలంలోని తోటపల్లి గ్రామంలో రంగమ్మ, కొండల్ రావు దంపతులకు జన్మించారు. సాదాసీదా కుటుంబంలో పుట్టినప్పటికీ, ఆయన ఆలోచనలు ఉన్నతమైనవి. బాల్యంలోనే మహాత్మా గాంధీ సిద్ధాంతాలైన అహింస, సత్యం, స్వావలంబనలు ఆయనను ఆకర్షించాయి. 1945లో వరంగల్ కాజీపేట రైల్వే స్టేషన్‌లో గాంధీజీ సభలో పాల్గొన్న అనుభవం ఆయన జీవితంలో కీలకమైంది. ఈ సంఘటన ఆయనలో కొత్త శక్తిని నింపి, గాంధీజీని జీవన మార్గదర్శిగా స్వీకరించేలా చేసింది. ఈ గాఢమైన అనుబంధం వల్లే ఆయన 'అపర గాంధీ'గా పిలువబడ్డారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడమే కాక, స్వాతంత్ర్యానంతరం విద్యా విస్తరణ, సామాజిక సమానత్వం, సమరసతలను ప్రోత్సహించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. ఆయన జీవితం నిస్వార్థ సేవ, త్యాగం, ప్రజాస్వామ్య విలువలకు నిదర్శనంగా నిలిచింది.

తోటపల్లి గ్రామంలో బాల్యం గడిచిన రామారావు, అక్కడే ప్రాథమిక విద్యను పూర్తి చేసి, అసాధారణ పట్టుదలతో 1939లో మెట్రిక్యులేషన్ పాసయ్యారు, ఇది ఆనాటి గ్రామీణ ప్రాంతాల్లో అరుదైన సాధన. ఆయనకు ఒక కుమారుడు, ఆరుగురు కుమార్తెలతో పెద్ద కుటుంబం ఉన్నప్పటికీ, గాంధీయ సిద్ధాంతాలకు అనుగుణంగా సరళంగా, సత్యనిష్ఠతో జీవించారు. కుటుంబంలోనూ, సమాజంలోనూ సమానత్వ భావనను పాటించారు. పిల్లలకు విద్యతో పాటు నైతిక విలువలను నేర్పడంలో ఆయన శ్రద్ధ వహించారు. ఆయన కుటుంబ జీవితం గాంధీయ ఆదర్శాలకు అద్దం పట్టింది.

### వీరి రచనలు

రామారావు సాహిత్య సృజనలోనూ తన ముద్ర వేశారు. ఆయన రచనలు:
- కరీంనగర్ దేవాలయాల చరిత్ర (2006)
- కరీంనగర్ రచయితల పరిచయం
- గ్రంథాలయ సంస్థలు
- గాంధీ తత్త్వం
- బొవెరా గీతాలు
- నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలు (2005)

ఈ రచనలు ఆయన సామాజిక, సాహిత్య చైతన్యాన్ని, గాంధీయ భావజాలం పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తాయి.

రాజకీయ నేపథ్యం

స్వాతంత్ర్యోద్యమంలో చైతన్యం, ప్రజా సమస్యల పట్ల అవగాహన రామారావు రాజకీయ ప్రవేశానికి దారితీసింది. 1952లో ఎలగందుల నియోజకవర్గం నుంచి సోషలిస్టు అభ్యర్థిగా, 1957లో ఇందుర్తి నుంచి ప్రజా సోషలిస్టు పార్టీ తరపున పోటీ చేశారు. ఈ ఎన్నికలు ఆయనను శాసనసభకు చేర్చకపోయినా, ప్రజల మద్దతును గెలుచుకున్న నాయకుడిగా, విలువల కోసం పోరాడే కార్యకర్తగా గుర్తింపు తెచ్చాయి. ఆయన రాజకీయ ఆలోచనలు సామ్యవాద పునాదులపై రూపొందాయి, సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా పనిచేశారు.

### గ్రంథాలయ ఉద్యమంలో

విద్యాప్రేమిగా, జ్ఞాన దాతగా రామారావు 19 ఏళ్ల వయసులోనే తన ఇంటిలో గ్రంథాలయం స్థాపించారు. 1939లో స్థాపించిన "ఆంధ్ర విజ్ఞాన వర్ధిని" గ్రంథాలయం యువతలో చైతన్యాన్ని నింపింది. "శాంతి యువసేన" సంస్థ ద్వారా వందలాది పుస్తకాలను ఉచితంగా పంచి, చదువు పట్ల ఆసక్తిని పెంచారు. ఆయన ఆధ్వర్యంలో 100కు పైగా గ్రంథాలయాలు ఏర్పాటయ్యాయి. 1953లో "జిల్లా సారస్వత సమితి" ద్వారా ప్రారంభించిన "సంచార గ్రంథాలయం" గ్రామీణ ప్రాంతాలకు పుస్తకాలను చేర్చింది. 30 ఏళ్లపాటు కరీంనగర్ జిల్లా గ్రంథాలయ పాలకమండలి సభ్యుడిగా, 11 ఏళ్లు చైర్మన్‌గా సేవలందించారు, విద్యా ఉద్యమాన్ని బలోపేతం చేశారు.

### ఇతర సంఘాల నిర్వహణ

ఆర్య సమాజ భావజాలం ఆయనను ప్రభావితం చేసింది. 1942 క్విట్ ఇండియా ఉద్యమం, 1947%-%48లో రజాకర్ల వ్యతిరేక ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణ స్వయం ప్రతిపత్తి కోసం కొండా లక్ష్మణ బాపూజీతో కలిసి ఢిల్లీలో నిరాహార దీక్ష చేశారు. "సారస్వత జ్యోతి", "మిత్రమండలి" వంటి సాహిత్య వేదికలను స్థాపించి మేధో చర్చలను ప్రోత్సహించారు. 1981లో స్థాపించిన "ఖాదీ నవనిర్మాణ సమితి" దేశీయ వస్త్రోద్యమాన్ని ప్రోత్సహించింది. మద్యపాన వ్యతిరేక ఉద్యమంలో 1949లో ఎన్టీఆర్ ప్రభుత్వం మద్య నిషేధం విధించినప్పుడు కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభకు వ్యవస్థాపక సభ్యుడిగా భాషా ప్రచారానికి కృషి చేశారు.

స్వాతంత్ర్యోద్యమంలో జైలు శిక్షలు అనుభవిస్తూ, జాతీయ జెండాను గ్రామాల్లో ఎగరవేసి ప్రజల్లో చైతన్యాన్ని నింపారు. 1935-36లో సిరిసిల్లలో ఆంధ్ర మహాసభలో స్వచ్ఛంద దళనేతగా పనిచేశారు. 1940, 1948లో వితంతు పునర్వివాహాలు, 1945లో హరిజన దేవాలయ ప్రవేశ హక్కు కోసం పోరాడారు. సినారె సహకారంతో రచయితల సంఘాలకు భవనాలు కేటాయించారు. గిడ్డంగుల దాడుల సమయంలో ప్రజలకు బియ్యం పంపిణీ చేశారు.

### ఇతర విశేషాలు

1942 క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకైన పాత్ర, జమ్మికుంట రైల్వే లైన్ తొలగింపు కుట్ర కేసులో ఆయనపై నమోదైన ఆరోపణలు ఆయన రాడికల్ ఉద్యమ శైలిని తెలియజేస్తాయి. హిందీ, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం ఆయనకు వివిధ వర్గాలతో సంబంధాలు నెలకొల్పడంలో సహాయపడింది. బాల భతోత్, పన్నుల నిరాకరణ, భూదానోద్యమాల్లో నాయకత్వం వహించారు. భారత ప్రభుత్వ స్వాతంత్ర సమరయోధుల కమిటీకి రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలందించారు. ఇందిరా గాంధీ చేతుల మీదుగా "స్వాతంత్ర సమర మేధావి పత్రం" అందుకున్నారు. సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ పత్రికకు విలేఖరిగా నిష్పక్షపాతంగా పనిచేశారు.

### వీరిపై వచ్చిన ప్రముఖుల వ్యాసాలు

- "సమాజ హితమే బొవెరా బతుకు బాట" - సంగనభట్ల రామకృష్ణయ్య
- "ఉద్యమాలకు మారుపేరు బోవేరా" - డా. చేకొని రవికుమార్
- "విశ్వబంధు బోయినపల్లి వెంకట రామారావు" - ఎ. పండరి నాథ్ (2009)

### బిరుదులు, పురస్కారాలు

- "తెలంగాణ గాంధీ","తోటపల్లి గాంధీ","కరీంనగర్ గాంధీ","అపర గాంధీ"
- "ఉపన్యాస కేసరి", "గ్రంథాలయ విభూషణ", "తెలుగు భాషా మిత్ర", "విశ్వ బంధు", "హరిజన బంధు"
- "భారతీయ పురస్కార్", "తెలుగు బోవేరా"
- 2006లో కాకతీయ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్

2014 ఆగస్టు 9న క్విట్ ఇండియా వేడుకల్లో పాల్గొన్న రామారావు, రైలు ప్రయాణంలో జారి గాయపడి, తుంటి ఎముకలు విరిగి 2014 అక్టోబర్ 27న మరణించారు. ఆయన జ్ఞాపకార్థం "బొవేరా కవితా పురస్కారం" ప్రతి జూన్ 17న కవిత్వ రంగంలో అగ్రగాములకు అందజేయబడుతోంది. 2018లో జయరాజు, 2022లో వరంగల్ శ్రీనివాస్, బిల్లా మహేందర్, మౌనశ్రీ మల్లిక్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

డా. ఐ. చిదానందం
తెలుగు అధ్యాపకులు
వెల్దండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ
చరవాణి: 8801444335

# సంక్షేమ పథకాలను దివ్యాంగులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలి


- జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్



**గద్వాల నడిగడ్డ, జూన్ 6 (జనం సాక్షి) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను దివ్యాంగులు పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశం హాల్ నందు మహిళలు,శిశు, వయోవృద్ధులు,దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో అలిమ్కో సంస్థ ద్వారా జిల్లాలోని 93 మంది దివ్యాంగులకు రూ.21.27 లక్షలతో 114 పరికరాలను గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి దివ్యాంగులు అభివృద్ధి చెందడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంమని తెలిపారు.దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం ఎప్పుడూ వినడానికి, పరిష్కరించడానికి సిద్ధంగా ఉంటుందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వ మద్దతుతో ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో జిల్లాలోని గట్టు మండలంలో గత సెప్టెంబర్ 28న నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో అర్హులైన దివ్యాంగులను గుర్తించి, ఇప్పుడు వారికి అవసరమైన అత్యాధునిక పరికరాలను అందజేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయని,అందులో భాగంగా ప్రతి దివ్యాంగుడు యు డి ఐ డి కార్డ్ పొందడం ద్వారా దేశంలో ఎక్కడైనా ఆయా సదుపాయాలు పొందగలరని అన్నారు.ప్రభుత్వం ద్వారా రూ.4000 పింఛన్, ఉద్యోగాల్లో 4% రిజర్వేషన్,ఆర్థిక సహాయ సబ్సిడీలు వంటి అనేక పథకాలు అమలులో ఉన్నాయని వివరించారు.ట్రైసైకిళ్లు 28, బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లు 35,వీల్ చైర్లు 7,వాకింగ్ స్టిక్స్ 8,క్రచెస్ 4,బీటీఈ డిజిటల్ హెయిరింగ్ ఎయిడ్స్ 16, టీఎల్ యం కిట్లు 12,సుగమ్య కేన్ 2 ,స్క్రీన్ రీడర్‌తో కూడిన స్మార్ట్‌ఫోన్‌లు 2 పంపిణీ మొత్తం 114 పరికరాలు చేయడం జరిగిందని తెలిపారు. మీరు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలాని సూచించారు.గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని తెలిపారు.కేంద్ర ప్రభుత్వ సహకారంతో అలిమ్కో సంస్థ ద్వారా ట్రైసైకిళ్లు,బ్యాటరీ ట్రైసైకిళ్లు,వీల్ చైర్లు, అవసరమైన ఇతర పరికరాలను పంపిణీ చేస్తునట్లు తెలిపారు.దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. జిల్లాలో 93 మంది దివ్యాంగులకు రూ. 21.27 లక్షల విలువైన 114 పరికరాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. దివ్యాంగులకు అందించిన పరికరాలను సమర్థవంతంగా ఉపయోగించాలని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు అందించేందుకు ప్రభుత్వంతో కలిసి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ,నర్సింగ రావు,జిల్లా సంక్షేమ అధికారి సునంద,ఆల్మికో ప్రతినిధి సునీత దాస్, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌ఫాం ఫలాలతో రైతులకు ఆర్థికాభివృద్ధి

- కాంగ్రెస్ పాలనలో ఆకాశం వైపు చూస్తున్న రైతులు
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



**ముత్తారం, జూన్ 6 (జనంసాక్షి) :** ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన ప్రతి ఆలోచన రైతుల బాగు కోసమేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామంలో గత బీఆర్ఎస్ సర్కార్‌లో ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన నాంసాని సమ్మయ్య అనే రైతు సాగు చేసిన ఆయిల్ ఫామ్ తొలి పంట దిగుబడిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలోచన చేశారని ఆయన గుర్తు చేశారు. మొట్టమొదటగా 24గంటల విద్యుత్, రెండో విడతగా నీళ్లు ఇచ్చిన కేసీఆర్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పెట్టుబడి సాయం అందించారని ఆయన తెలిపారు. ఒకే పంటకు పరిమితమైన రైతులు సరైన దిగుబడి రాక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, పంట సాగు విధానంలో మార్పు వస్తే బాగుంటుందనే గొప్పగా ఆలోచన చేశారన్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో మొట్ట మొదటిసారి ఆయిల్ ఫాం సాగుకు ప్రోత్సాహం అందించారని ఆయన గుర్తు చేశారు. జిల్లాలోని ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌కు చెందిన నాంసాని సమ్మయ్య ముందుకు వచ్చి ఆయిల్ ఫాం పంట సాగు చేశారని, మూడేళ్ల తర్వాత పంట చేతికి వచ్చిందన్నారు. ఈ పంట 35 ఏండ్ల వరకు దిగుబడి ఇస్తూనే ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని అన్నారు.కేసీఆర్ ఆలోచనలు ఎంత గొప్పగా ఉంటాయో...ఈ రాష్ట్రాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలని ఆలోచన చేసిందో అర్థం అవుతుందన్నారు. అయితే ఈనాడు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో రైతులు మళ్లీ ఆకాశం వైపు చూసే పరిస్థితులు నెలకొన్నాయని, కరెంటు నీళ్లు అందడం లేదని, కనీసం పెట్టుబడి సాయం కూడా ఇవ్వకపోవడం అనేక విధాలుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అప్పులు చేసి సాగు చేసిన పంటను అమ్ముకోవడానికి నానా తంటాలు పడాల్సి వస్తుందని, కనీసం పంట కొనేవాళ్లు కరువయ్యారని ఆయన అన్నారు. కేసీఆర్ ప్రతి ఆలోచన రైతులకు మేలు చేశారని,అలాగే తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు ఆయన కృషి చేసారని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలుఅత్తే చంద్రమౌళి, జక్కుల ముత్తయ్య,బిఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ సుధాటి రవీందర్ రావు, పిఏసిఎస్ మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి,సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు నూనె కుమార్, మాజీ సర్పంచ్ ఇల్లందుల అశోక్ గౌడ్,నాయకులు కూరాకుల ఓదెలు,దాసరి రవి, భూపెల్లి మొగిలి,చిగురు విద్యాసాగర్,ఓడే డ్ గ్రామశాఖ అధ్యక్షుడు రమేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# పోరాడితేనే చట్టాలు సాధించుకుంటాం

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా పిడికిలి బిగిద్దాం
- ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రయ్య



శంషాబాద్, జూన్ 6 (జనంసాక్షి) : ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశం శంషాబాద్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యాతథిగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. చంద్రయ్య సమావేశంలో పాల్గొన్నారు. సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ స్వాతంత్రం రాకముందు సాధించుకున్న చట్టాలను నేటి నరేంద్ర మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా ఆ చట్టాలను నిర్వీర్యం చేసే కుట్రకు తెరలేపిందన్నారు. కార్మిక కోడ్ లను తెచ్చి చట్టాలన్నిటిని వాటి పరిధిలోకి మార్చడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. స్వాతంత్రం రాకముందు సాధించుకున్న చట్టాలను సైతం ఈ ప్రభుత్వం మార్చే కుట్ర చేస్తుంది. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు తక్కువ వేతనాలతో పనిచేయించుకుంటూ యాజమాన్యాలు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారు. వాటిపైన అధికారులు దృష్టి కేంద్రీకరించి యాజమాన్యాల మీద క్రిమినల్ కేసులు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులు హమాలీ కార్మికులు ఆటో రిక్షా, లారీ డ్రైవర్లు లాంటి ఎందరో కార్మికుల బ్రతుకులకు జీవిత రక్షణ లేక కార్మికుల బ్రతుకులు ఆగమైపోతున్నాయి. ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చీమ కట్టినట్టు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ఏఐటియుసి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మల్లేష్, సకురు నాయక్ స్వామి, శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి, మహదేవ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై ప్రమాదవశాత్తు కారు దగ్ధం



**శేరిలింగంపల్లి, జూన్ 6 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజక వర్గం మాదాపూర్ డివిజన్ పరిధి దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి వద్ద శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు ఓ కారుకు మంటలు అంటుకొని దగ్ధమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. మాదాపూర్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... ఎపి 09 సిఎ 1878 నెంబర్ గల కారు ఇనార్బిట్ మాల్ వైపు నుండి జూబ్లీహిల్స్ వైపు బయలుదేరి వెళుతుండగా మార్గమధ్యంలో మాదాపూర్ డివిజన్ దుర్గం చెరువు పరిధి కేబుల్ బ్రిడ్జి వద్ద సాయంత్రం 4 గంటల 15 నిమిషాల సమయంలో సదరు కారు నుండి అకస్మాత్తుగా మంటలు రావడంతో వెంటనే చేరుకున్న డ్రైవర్ కార్ డోర్ తెరుచుకుని బయటికి పరిగెత్తగా వేగంగా విస్తరించిన మంటలు కారు ఇంజన్ భాగాన్ని, వెనుక భాగాన్ని పూర్తిగా దగ్ధం చేశాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం విద్యుత్ సంబంధిత సమస్యతోనే కారులో మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. కారు వివరాలను సేకరించగా అది మియాపూర్ ప్రాంతానికి చెందిన పి శ్రీరామ్ రెడ్డి అనే వ్యక్తికి సంబంధించినదిగా పోలీసులు ధృవీకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# భూకబ్జాదారులపై కేసులు పెట్టండి



**కుత్బుల్లాపూర్, జూన్ 6 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలోని సర్వేనెంబర్ 326, 307 కబ్జాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేయాలని కోరుతూ రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా స్తంభించిన కబ్జాలు వారం రోజుల నుండి తిరిగి మొదలయ్యాయి అన్నారు. పదుల సంఖ్యలో నిర్మించిన రూములలో కేవలం నామమాత్రంగా ఒకటి రెండు రూములను కూల్చివేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు కబ్జాలను ఆపకపోతే తమ సిపిఐ ఆధ్వర్యంలో నిరుపేద ప్రజలకు గుడిసెలను వేయించడానికి సమాయత్తమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథరావు, నాయకులు నరసింహారెడ్డి, రవి, సుంకిరెడ్డి, సామిల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, జూన్ 6 (జనంసాక్షి) :** పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హిందూ సంఘటన్ ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి గణపతి మహా గణపతి పోస్టర్ ను మరియు కేవిఎం వెంకట్ ఆధ్వర్యంలో "మొలక బాలల మాసపత్రికను ఆవిష్కరించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మానవాళి మనుగడకు మొక్కలు జీవనాధారం అన్నారు.అనంతరం పెద్దేముల్ మండలం మంసాన్ పల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి నిఖిత జాతీయ స్థాయిలో బాక్సింగ్ లో రాణిస్తున్న శుభ సందర్భంగా శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు తదితరులు ఉన్నారు.

# పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**బొంరాస్‌పేట, జూన్ 6 (జనం సాక్షి) :** మండలంలో చేపడుతున్న అభివృద్ధి,నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మండలంలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్ల పనులను అదేవిధంగా వివిధ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా బుర్రి తాండ నుండి బొంరాస్పేట వరకు వయా మెట్లకుంట ద్వారా నిర్మించే రోడ్డు, టేకుల గడ్డ తాండ నుండి దారూరు మండలం గురుదొట్ల గ్రామం వరకు, సలిందాపూర్ జెడ్పి రోడ్డు వయా మాలకుంట నుండి ముద్దాయి పేట్ వరకు కలెక్టర్ పరిశీలించారు. జాతీయ రహదారి నుండి చౌదర్ పల్లి రోడ్డు, కొత్తూరు నుండి దేవనూర్, బొంరాస్ పేట్ మండల కేంద్రానికి రోడ్డు మార్గమధ్యలో నిర్మిస్తున్న కల్వర్టు పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. అదేవిధంగా బురాన్ పూర్ లో నిర్మించే ఇంటిగ్రేటెడ్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులను పురోగతిని కలెక్టర్ పరిశీలించారు.మండలంలో చేపట్టే పనులను నాణ్యవంతంగా చేపట్టే విధంగా అధికారుల పర్యవేక్షణతో పాటు వేగవంతంగా అభివృద్ధి పనులను చేపట్టే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.జిల్లా కలెక్టర్ పర్యటన భాగంగా బురాన్ పూర్, బొంరాస్పేట్ పాఠశాలను సందర్శించిన పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. బురాన్‌పూర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడుతూ... బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరూ పాఠశాలలో చేర్చే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు.వివిధ అభివృద్ధి పనుల తనిఖీల్లో భాగంగా జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, పంచాయతి రాజ్ ఇఇ సత్యనారాయణ రెడ్డి సత్య నారాయణ రెడ్డి, డిఈఓ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# గోవుల, పశువుల అక్రమ రవాణపై ప్రత్యేక నిఘా

- నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు
- చెక్‌పోస్ట్‌లను పకడ్బందీగా నిర్వహించాలి
- చిరాగ్‌పల్లి స్టేషన్, మాడ్గి చెక్‌పోస్ట్‌లను ఆకస్మిక తనిఖీ
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 6 (జనం సాక్షి) :** బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల,పశువుల అక్రమ రవాణ జరగకుండా జిల్లా సరిహద్దులో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. శుక్రవారం జహీరాబాద్ నియోజకవర్గంలోని మాడ్గి చెక్ పోస్ట్ ను, చిరాక్ పల్లి పోలీస్ స్టేషన్ ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ సిబ్బందితో మాట్లాడుతూ.. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ, గోవుల, పశువుల అక్రమ రవాణ జరగకుండా చూడాలని అన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, నైట్ టైమ్ చెక్ పోస్ట్ నందు విధులు నిర్వహించే సిబ్బంది, లైట్ బాటన్, రెఫ్లెక్షన్ జాకెట్ ధరించాలని సూచించారు. అత్యవసర సమయంలో కంట్రోల్ కు సమాచారం అందించాలని అన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమయించి పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే చట్టరీత్య కఠిన చర్యలు తప్పవు అన్నారు. అనంతరం చిరాగ్ పల్లి పోలీసు స్టేషన్ ను సందర్శించి, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. స్టేషన్ రికార్డ్ లను తనిఖీ చేస్తూ.. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డ్ లను ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేస్తూ ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు పరిమిత లిమిట్లో ఉండాలని, నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి భాదితులకు అండగా నిలవాలని సూచించారు. సిబ్బంది అధికారులు స్టేషన్ కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలని, హిస్టరీ షీటర్స్, సస్పెక్ట్స్ మరియు పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, నైట్ బీట్, పెట్రోల్లింగ్ అధికారులు వీధి నిర్వాహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మన చుట్టూ జరుగుతున్న ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్స్, బెట్టింగ్ యాప్స్, రోడ్డు ప్రమాదాల గురించి కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రామ్స్ ద్వారా జిల్లా ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, యస్.హెచ్.ఓ కు సూచించారు. ఎస్పీ వెంట జహీరాబాద్ డియస్పీ, సైదా నాయక్, టౌన్ ఇన్స్పెక్టర్ శివలింగం, రూరల్ ఇన్స్పెక్టర్ హనుమంతు, తదితరులు ఉన్నారు.

# సమస్యల పరిష్కార వేదికలుగా రెవెన్యూ సదస్సులు

- జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



**తాండూరు, జూన్ 6 (జనంసాక్షి) :** రెవెన్యూ సంబంధిత భూ సమస్యల పరిష్కారానికి భూభారతి రెవెన్యూ సదస్సులు వేదికలుగా నిలువాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు.తాండూర్ మండలం అల్లాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులను అదనపు కలెక్టర్ సందర్శించారు. అర్జీదారుల సమస్యలను స్వయంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని ఆన్లైన్ లో నమోదు చేస్తున్నారా అని అధికారులను ఆరా తీశారు. వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు అందించాలని, సంబంధిత రిజిస్టర్లలో వివరాలు రాయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్‌డెస్క్ లను, రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ, పక్కాగా రికార్డులను పొందుపర్చాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. జూన్ 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని, భూ సమస్యలున్న ప్రజలు ఈ సదస్సులకు హాజరై దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. సదస్సులలో ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని, సానుకూలంగా ఉన్న సమస్యలను సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ఒకవేళ సమస్యను పరిష్కరించేందుకు నిబంధనలు అంగీకరించని పక్షంలో దరఖాస్తుదారుడికి ఆ విషయాన్ని స్పష్టంగా అర్థమయ్యే రీతిలో తెలియజేయాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తుదారులను పదేపదే తిప్పుకోకూడదని, సదస్సులో అర్జీలు అందించేందుకు వచ్చే వారితో సున్నితంగా వ్యవహరించాలని రెవెన్యూ బృందాలకు తెలిపారు.. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ తారా సింగ్ ,సిబంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్‌ను ఆపేసే దాకా పోరాడుతాం




**గద్వాల్ రూరల్, జూన్ 6 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఆపరేషన్ కగార్ ను నిలిపివేసి,మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వామపక్ష,అఖిలపక్ష పార్టీలు ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో పాతబస్టాండ్ సమీపంలో నిరసన ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యభారతంలోని మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలనీ మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మధ్యభారతంలోని కర్రెగుట్ట అడవులు ఆదివాసులు, గిరిజనులను నివసించే ప్రదేశం అని అంతేకాకుండా ఆ అడవులలో ఉన్న సంపాదన దోచుకోవడానికి కేంద్ర ప్రభుత్వంలోనీ నరేంద్ర మోదీ అక్కడ చేపట్టిన యుద్ధమే ఆపరేషన్ కగార్ అని అన్నారు. ఈ మధ్య భారతంలోని కర్రె గుట్టలలోనీ ఆదివాసులను చంపాలనే ఉద్దేశంతో నరేంద్ర మోడీ వారికి మావోయిస్టులు అనే పేరు పెట్టి వారిని అక్కడ నుంచి తరిమికొట్టి ఆ కర్రగుట్ట అడవులలో ఉన్న ఖనిజ సంపదను దోచుకొని తన కార్పొరేట్ కంపెనీ మిత్రులయిన ఆదాని, అంబానీలకు దోచిపెట్టాలని ఉద్దేశంతో అమాయక ప్రజలైనటువంటి ఆదివాసీలను చంపడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.నరేంద్ర మోడీ యొక్క మిత్రులైనటువంటి ఆదానీ,అంబానీల యొక్క ఆస్తి పెంచడం కోసం కార్పొరేట్ కంపెనీలతో చేయి కలిపి ఆమాయకమైన ఆదివాసీలను మావోయిస్టులతో పాటు కాల్చి చంపడం ఏమిటని మండిపడ్డారు. కావున వెంటనే ఆపరేషన్ కగార్ ను కేంద్ర ప్రభుత్వం ఆపి,మావోయిస్టులు కోరినట్లు వారితో శాంతి చర్చలు జరపాలని వామపక్ష,అఖిలపక్ష,ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు,ఆంజనేయులు, వెంకటస్వామి, కుర్వ పల్లయ్య,జి గోపాల్, గోపాలరావు, సుభన్, ఫయాజ్, కార్తీక్, బిఆర్ఎస్ వాల్మీకి, సీపీఐ ఆశన్న, ఏఐటీయూసీ నాయకులు రంగన్న, సిఐటియు నాయకుడు నరసింహులు, ఏఐఎస్ఎఫ్ ప్రవీణ్, ధర్మాన, తిమ్మప్ప, మస్తాన్, చిన్న,రవి తదితర నాయకులు పాల్గొన్నారు.

# అమ్మాయిలను వేధిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు

- షి టీమ్ పోలీసులు

**మక్తల్, జూన్ 6 (జనంసాక్షి) :** అమ్మాయిలను వేధిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని షి టీమ్ పోలీసులు అన్నారు. శుక్రవారం ఉట్కూరు మండలంలోని పులిమామిడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులకు పలు సామాజిక అంశాలు అయినా ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు, సెల్ ఫోన్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు, పోటీ పరీక్షల గురించి, లీడర్షిప్ లక్షణాలు తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షి టీమ్ పోలీసులు బాలరాజు, చెన్నయ్యలు మాట్లాడుతూ కళాశాలలో, తమ ఊర్లలో ఎవరైనా అమ్మాయిలను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కాలేజీల్లో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వల్ల విద్యార్థులు భయంతో సూసైడ్ చేసుకునే అవకాశాలుంటాయి కాబట్టి అలాంటి వాటికి దూరంగా ఉండాలని, చాలా మంది విద్యార్థులు చదువు మధ్యలో ఆపేయడం జరుగుతుంది. ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడితే పేట షీ టీం సెల్ నంబర్ 8712670398 కి సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని గంజాయి, డ్రగ్స్‌కి బానిసలై తమ లక్ష్యాలను నెరవేర్చుకోక ఇతర చెడు వ్యసనాలకు అలవాటు పడటం జరుగుతుంది. కావున అలాంటి వాటికి దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ కనబరిచి తమ నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నతంగా ఎదగాలని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే ప్రతిరోజు ఆటలు ఆడాలని, ఆటలు ఆడడం వల్ల ఆరోగ్యంగా ఉండడం జరుగుతుందని తెలిపారు. ఆటలు ఆడడం వల్ల లీడర్షిప్ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు లీడర్షిప్ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ పోలీసులు బాలరాజు, చెన్నయ్య, జ్యోతి, కవిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# రాజీ మార్గమే రాజ మార్గం

- లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి
- సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 6 (జనం సాక్షి) :** రాజీ మార్గమే రాజ మార్గం అని నారాయణపేట సీనియర్ సివిల్ జడ్జి వింధ్యా నాయక్ అన్నారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ఉద్దేశించి శుక్రవారం పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు.సమావేశంలో ఆమెమాట్లాడుతూ..రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుం దని తెలిపారు.తదుపరి నారాయణపేట జిల్లాలోని మొత్తం 14 పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్లో ఉన్న, ఇదివరకు ఇచ్చిన 6500 కేసులను టార్గెట్ దృష్టిలో పెట్టుకొని ఎన్ని కేసులను రాజీ చేస్తారోనని ఆరాదీశారు.ఇచ్చిన టార్గెట్ ను కేసులని రాజీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని ఈ లోక్ అదాలత్ లో త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.త్వరగా పెండింగ్లో ఉన్న కేసులని ఈ లోక్ అదాలత్ చర్యలు తీసుకొని కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని టీములు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ లోక్ అదాలత్‌ను కక్షిదారులు ఉపయోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు యధావిధిగా కొన సాగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏజెండా లోని అంశాలను క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు సివిల్ కేసులు, సైబర్ క్రైమ్స్,కేసులను, ఎన్ ఐ ఆక్ట్ పెండింగ్ లో ఉన్నాయా చర్చించారు పెండింగ్లో ఉన్న ప్రతి ఒక్క కేసు ఈ లోకదాలథ్ లో రాజీ చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో పోలీస్ అధికారులు, లైసెన్ ఆఫీసర్ కృష్ణయ్య, కోర్ట్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ షాపులలో తనిఖీలు

**రేవల్లి, జూన్ 6 (జనంసాక్షి) :** గోపాల్ పేట, ఏదుల మండలాలలో వ్యవసాయ శాఖ అధికారిని కరుణశ్రీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గోపాల్ పేట్ మండలంలోని ఏదుట్ల గ్రామంలో గల రెడ్డి ఫెర్టిలైజర్ షాపు, ఏదుల మండల కేంద్రంలోని ఎస్వీరెడ్డి, రైతు ఆగ్రో సేవా కేంద్రాలలో మండల వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో తనిఖీ చేయడం జరిగింది. డీలర్స్ అందరూ కూడా లైసెన్స్ మరియు విత్తన రిజిస్టర్ మెయింటేన్ చేయాలి అని సూచించారు. ధరల పట్టికను ప్రదర్శించాలి. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలి అని చెప్పడం జరిగింది. రైతులకు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రసీదులు ఖచ్చితం గా ఇవ్వాలని సూచించడం జరిగింది. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి కరుణశ్రీ, గోపాల్ పేట్ ఎస్ఐ నరేష్ కుమార్ పాల్గొన్నారు.



# పేదలకు సన్నబియ్యం వరం

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 6 (జనం సాక్షి) :** పేదలకు సన్న బియ్యం వరం అని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. సంగారెడ్డి పట్టణం లోని శాంతి నగర్ షాపు నం. 28 ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తుకాన్ని, బియాన్ని, రికార్డులను, స్టాకును,కొత్తగా రేషన్ కార్డు వచ్చిన వారి లిస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సన్నబియ్యం పేదలకు వరం అన్నారు.జూన్ 30 వరకు బియ్యం పంపిణీ చేస్తామన్నారు. వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.వేలి ముద్ర లో సాంకేతిక సమస్యలు వస్తె సాంకేతిక నిపుణులు బృందం పరిష్కరిస్తుందన్నారు. 3 నెలల కోసం రేషన్ ఇస్తునందున ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ తనికి లో అదనపు కలెక్టర్ మాధురి,సివిల్ సప్లై మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు

- టీజీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



**కొండాపూర్, జూన్ 6 (జనం సాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల అందిస్తామని టీజిఐఐసి చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ మండలంలోని అనంతసాగర్ లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపికైన 35 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ను నిర్మల జగ్గారెడ్డి అందజేశారు. అనంతరం ఇంటి నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా టీజీఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి మాట్లాడుతూ. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఆర్థికంగా లోటు ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుందన్నారు. ఇల్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారుల ఖాతాలోనే ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందనీ చెప్పారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వై. ప్రభు, సిడిసి చైర్మన్ గడీల రాంరెడ్డి, హౌసింగ్ పీడీ తిరుపతిరావు డి ఈ మాధవరెడ్డి, ఎంపీడీవో రత్నవని, హౌసింగ్ ఏయ్ సౌజన్య, కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి, అమీనోద్దీన్, అనిల్ కుమార్, జైపాల్, పురుషోత్తం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# జనంసాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసు వెంటనే ఎత్తివేయాలి

**గద్వాల్ రూరల్, జూన్ 6 (జనంసాక్షి) :** అలంపూర్ నియోజకవర్గం రాజోలి మండలం పెద్ద దన్వాడ గ్రామంలో పచ్చని పోలాలను విధ్వంసం చేస్తూ కాలుష్యాన్ని వెదజల్లుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు తిరగబడిన పోరాటంలో చెలరేగిన హింసకు బాధ్యుడిగా జనంసాక్షి పత్రిక సంపాదకుడు ఎం ఎం రెహమాన్ పై కేసు పెట్టడాన్ని బాధ్యతా యుతమైన పత్రిక ఎడిటర్ పై అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని యాజమాన్యం ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపించి ఎడిటర్ ఎం ఎం రెహమాన్ పై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని జిల్లా ఐడిఓసి కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావుకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల్ జిల్లా జర్నలిస్టులు హరిప్రసాద్ గౌడ్, నల్లన్న, వెంకటేష్ గౌడ్, మల్లికార్జున్ గౌడ్, ముకుందరావు, నెమలి కంటి విజయ్,సురేష్, లోకేష్,తీర్థ చారి, ఉప్పేరు రాఘవ గౌడ్, బలరాం,కాశపోగు జాన్,రాజు, తిరుమలేష్,సుదర్శన్ గౌడ్,శ్రీను, కాశపోగు ఆనంద్ విలేకరులు తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి మీద వీడియోసాంగ్‌ను రిలీజ్ చేసిన జిల్లా ఎస్పీ



**నాగర్‌కర్నూల్ ఆర్సీ, జూన్ 6 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా శుక్రవారం నాడుఎస్పీ ఆఫీసులో లింగాల మండలం అప్పయ్య పల్లి గ్రామ వాసి వేముల శివరాం సాగర్ మరియు ప్రొడ్యూసర్ మహేష్ రాసిన గంజాయి మరియు మాదక ద్రవ్యాల వీడియో సాంగ్ ని నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ రిలీజ్ చేయడం జరిగింది. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, గంజాయి మీద ఎలాంటి సమాచారం మీకు తెలిసిన జిల్లా పోలీసులకు లేదా మీ యొక్క పోలీస్ స్టేషన్లకు తెలియజేయాల్సిందిగా చెప్పారు. మీకు ఎలాంటి సమాచారం తెలిసిన జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్ 8712657709 కి కాల్ చేయగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ వీడియో సాంగ్ లో యాక్టింగ్ చేసిన యాక్టర్స్ మరియు లిరిక్ రైటర్ ప్రొడ్యూసర్ కో ఆక్టర్స్ అందరూ హాజరు కావడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా అడిషనల్ ఎస్పీ సిహెచ్ రామేశ్వర్, నాగర్ కర్నూల్ డిఎస్పి శ్రీనివాస్, అచ్చంపేట డిఎస్పి శ్రీనివాస్, డిసిఆర్బి డిఎస్పి సత్యనారాయణ , కొల్లాపూర్ సిఐ మహేష్, సిసిఎస్ సిఐ శంకర్ , నాగర్ కర్నూల్ ఎస్సై గోవర్ధన్ మరియు దాదాపుగా 30 మంది పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- ఆర్డీఓ రాంచందర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 6 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆర్డీఓ రాంచందర్ కోరారు.శుక్రవారంనారాయణపేట మండలం పెరపళ్ళ,జాజాపూర్ గ్రామాల్లో జరిగిన ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం లో భాగంగా నిర్వహించిన గ్రామ సభలకు ఆర్డీఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థు లకు నాణ్యమైన విద్యను అందించాలని అలాగే ప్రభుత్వం అందించే ఉచిత సేవలను విద్యార్థుల తల్లి దండ్రులకు స్పష్టంగా తెలియ జేసి,గ్రామం లోని విద్యార్థు లందరు మన ప్రభుత్వ బడిలోనే చదువుకునేలా ప్రోత్సాహించాలని కోరారు,ఈ సందర్భంగా ఉపాధ్యాయుల చే ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనంత కృష్ణ, ఉన్నత పాఠశాలప్రధానోపాధ్యాయులు పంచాయితీ కార్యదర్శులు,ఉపాద్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గనులు భూగర్భ శాఖ జీరో అనుమతి పద్ధతిని వినియోగించుకోవాలి

- స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 6 (జనం సాక్షి) :** జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖలు చేపట్టిన నిర్మాణాలకు బిల్డింగ్ స్టోన్, రోడ్ మెటల్ (కంకర రాయి) గ్రావెల్ (మొర్రం) కొనుగోలు చేయడం కోసం గనులు,భూగర్భ శాఖ ప్రవేశపెట్టిన జీరో పర్మిట్ సిస్టం ను వినియోగించుకోవాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. నారాయణపేట జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో శుక్రవారం అదనపు కలెక్టర్ అధ్యక్షతన జిల్లా అధికారుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.గనుల భూగర్భ శాఖ జీరో పర్మిట్ సిస్టం ద్వారా ప్రభుత్వానికి చెల్లించే రెవెన్యూ లీకేజీని అరికట్టవచ్చని, అలాగే ప్రభుత్వ పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు ఖనిజాల కొనుగోలు సులభతరం అవుతుందని ఆయన తెలిపారు. జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ నిర్మాణాలలో ఉపయోగించే ఇసుక తెలంగాణా మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి బల్క్ ఆర్డర్ల ద్వారా ఇసుక కొనుగోలు చేయవలసిందిగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని అదనపు కలెక్టర్ చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మన నారాయణపేట జిల్లాలో ప్రభుత్వ ఇంజనీర్ శాఖలు చేపట్టిన నిర్మాణాలకు ఇసుక తెలంగాణా మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో గనులు మరియు భూగర్భ శాఖ సహాయ సంచాలకులు సంజయ్ కుమార్, డిఎస్పీ నల్లపు లింగయ్య, పీ.ఆర్. ఈఈ హిర్యా నాయక్, హౌసింగ్ పీ.డీ. శంకర్ నాయక్,ఇరిగేషన్ ఈఈ బ్రహ్మానందం, మిషన్ భగీరథ ఈఈ రంగారావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, నారాయణపేట జిల్లాకు చెందిన వివిధ ఇంజనీరింగ్ శాఖల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రోగులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నాం

**వనపర్తి బ్యూరో, జూన్ 6 (జనంసాక్షి) :** వనపర్తి జనరల్ ఆసుపత్రిలో రోగులకు అందించే భోజన నాణ్యత విషయంలో డైట్ ప్రకారం పక్కాగా అమలు చేస్తున్నామని, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు అన్నారు. శుక్రవారం జిల్లా జనరల్ ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాల్లోని వంట గదులను ఆర్ఎంఓ డాక్టర్ శివప్రసాద్ తో కలిసి తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, వంట గదిలోనే వండిన ఆహారాన్ని భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల హైదరాబాదులోని ఎర్రగడ్డ ఆసుపత్రిలో ఫుడ్ పాయిజన్ జరిగిందని, దీంతో అన్ని ఆసుపత్రిలో కూడా అలాగే జరుగుతుందనుకోవడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో గతం కంటే ఎంతో మెరుగైన ఫలితాలు సాధిస్తూ రోగులకు నాణ్యవంతమైన భోజనం అందిస్తున్నామని, మెనూ ప్రకారమే డైటీషియన్ ఆమోదంతో భోజనం అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు వైద్యులు భోజనం చేసిన తర్వాతే రోగులకు వడ్డించడం జరుగుతుందని, వంటగదిలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయడం, క్వాలిటీ రైస్ వాడటం, తాజా కూరగాయలనే వాడటం, ప్రతి రోగికి గుడ్డు, అరటిపండు అందించడం కూడా జరుగుతుందన్నారు. డయాబెటిక్ రోగులకు సైతం చపాతీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఎమ్మెల్యే మెగారెడ్డి నిత్యం ఆసుపత్రి పై పర్యవేక్షిస్తూనే ఉన్నారని, ఉద్దేశపూర్వకంగా తప్పుడు వార్త కథనాలు ప్రచారం చేయడం వల్ల సమాజానికి కూడా చేటు కలిగిస్తుందని అన్నారు.



# సమగ్ర వ్యవసాయ విధానం ద్వారా అధిక లాభాలు

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- అమీనాబాద్ లో భూభారతి రెవెన్యూ సదస్సు పరిశీలన



**చెన్నారావుపేట, జూన్ 6(జనం సాక్షి):** సమగ్ర వ్యవసాయ విధానం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం మామునూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్ర కార్యక్రమాన్ని మండలంలోని అమీనాబాద్ గ్రామంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. వరంగల్ జిల్లాలో నర్సంపేట డివిజన్ లో ఉన్న రైతులు వరి పంటను ఒక నెల ఆలస్యంగా వేస్తున్నారని ముందుగా వేయాలని సూచించారు. ముఖ్యంగా నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వరిని తొందరగా విత్తడం వలన అధిక దిగుబడి సాధించవచ్చని తెగుళు ,, చీడ పీడల ప్రభావంను తగ్గించవచ్చన్నారు. అలాగే ముందుగా వరి కోయవచ్చని వివరించారు. అలాగే సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని అలాగే రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ, చేపల పెంపకం వంటి అనుబంధ రంగాలను కూడా చేయాలని సమగ్ర వ్యవసాయ విధానంను అనుసరించాల్సిన అవసరాన్ని వివరించారు. రైతుల ఆదాయాన్ని పెంచడమే కాక వ్యవసాయాన్ని స్థిరీకరిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో 1.8 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యంను సేకరించినట్లు తెలిపారు. చిన్న తరహా వ్యవసాయ యంత్రాల వాడకం ద్వారా పెట్టుబడి తగ్గించి దిగుబడి పెంచుకోవచ్చని వివరించారు. రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు అనే కార్యక్రమంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ లోని శాస్త్రవేత్తల సలహాలను క్రమం తప్పకుండా పాటించడం ద్వారా అధిక దిగుబడిని సాధించవచ్చని రైతులకు వివరించారు. వికసిత్ కృషి సంకల్ప్ జిల్లా నోడల్ ఆఫీసర్ డా. రాజన్న ప్రోగ్రాం కోఆర్డినేటర్ కేవికే మాట్లాడుతూ ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలు, కార్యాచరణ అంశాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులలో శాస్త్రీయ అవగాహన పెంపొందించి మెరుగైన వ్యవసాయ పద్ధతులు అమలు చేయడం లక్ష్యమని చెప్పారు. అలాగే డా. తమ్మీ రాజు పశు పోషణ, టీకాలు, పరి శుభ్రమైన పాల ఉత్పత్తి గురించి వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారిని అనురాధ ఖరీఫ్ సీజన్ లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, పచ్చి రొట్ట పంటలను సాగు చేయడం నేలలో భూసారం పెరుగుతుందని అదేవిధంగా అధిక దిగుబడి రకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖజాయింట్ డైరెక్టర్ డా. బాలకృష్ణ మాట్లాడుతూ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ క్రింద ఎవరైనా లోన్ తీసుకొని పశువుల పెంపకం చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఏడిఏ దామోదర్ రెడ్డి, శాస్త్రవేత్తలు డా. రాజు, శతీష్ చంద్ర, తహసిల్దార్ ఫణికుమార్, మండల వ్యవసాయ అధికారి గోపాల్ రెడ్డి, రైతులు, పాల్గొన్నారు.

**భూ భారతి రెవెన్యూ సదస్సును పరిశీలించిన కలెక్టర్...**

మండలంలోని అమినాబాద్ గ్రామంలో కొనసాగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సును జిల్లా కలెక్టర్ సత్య శారద సందర్శించి పరిశీలించారు. రైతులు అందించిన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించి రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. రైతులకు సులభతరమైన విస్తృత సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. స్వీకరించిన దరఖాస్తులను రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధి కారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 20 వరకు జిల్లాలో వర్ధన్నపేట మినహా అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ధరఖాస్తు కోసం వచ్చే వారికి కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా వారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. రెండు బృందాలుగా రెవెన్యూ సిబ్బందిని నియమించి క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫణి కుమార్, నాయబ్ తహసీల్దార్ రజిని, గిర్ధావర్లు మహమ్మద్ రషీద్, మమత, జూనియర్ అసిస్టెంట్ మహమ్మద్ అంజద్ ఖాన్, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో,జూన్ 6 (జనం సాక్షి) :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌరసరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అంతటా వరి కొనుగోలు చివరి దశకు చేరుకున్నదని, మిగిలిన ధాన్యాన్ని నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల వల్ల కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురైనప్పటికీ,అధికారుల సమిష్టి కృషితో సజావుగా కొనుగోలు కొనసాగిందని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని కూడా రైతుల నుంచి మద్దతు ధరకు సేకరిస్తున్నామని,ఒక్క గింజ మిగలకుండా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీసీఎస్ఓ కిరణ్ కుమార్, మేనేజర్ సుధాకర్,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాసర ట్రిబుల్ ఐటీలో 'ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్స్'పై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

- వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్



**బాసర, జూన్ 6 (జనంసాక్షి) :** ఆర్జీయూకేటీ, బాసర క్యాంపస్‌లో ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో 'ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్స్' అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ హాజరై ప్రారంభోత్సవ సభలో ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ కమ్యూనికేషన్ నైపుణ్యాలు బోధనా ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలకమని, ఫ్యాకల్టీ తమ ప్రొఫెషనల్ అభివృద్ధికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం బోధనలో నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడేలా ఉంటుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రధాన వక్తలుగా డా. లకుమా దేవి, విజయ్ కుమార్ అప్పింగర్ , ప్రభాకర్ రావు , వసంత్ బాబు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. కమ్యూనికేషన్ వ్యవహారికత, తరగతిలో అధ్యాపకుల వ్యక్తీకరణ శైలి, విద్యార్థులతో పరస్పర చర్య వంటి విషయాలను వారు వివరించారు. అన్ని విభాగాల అధ్యాపకులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి భూభారతి

- భూపాలపల్లి అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



**భూపాలపల్లి, జూన్ 6 (జనం సాక్షి):** భూ సమస్యల పరిష్కారానికి భూభారతి తీసుకొచ్చామని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. భూపాలపల్లి మండలం ఎస్ ఎం కొత్తపల్లి, చిట్యాల మండలం దూతపల్లి గ్రామాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్జీదారుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని ఆన్లైన్, రిజిష్టర్ లో నమోదు చేస్తున్నారా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులను రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్‌డెస్క్ లను, రిజిస్టర్లను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ, పక్కాగా రికార్డులను పొందుపర్చాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. జూన్ 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని, భూ సమస్యలున్న ప్రజలు ఈ సదస్సులకు హాజరై దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు. సదస్సులలో ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని, సానుకూలంగా ఉన్న సమస్యలను సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుల సమస్య పరిష్కారంలో కార్యాలయాల చుట్టూ త్రిప్పుకోవద్దని, సదస్సులకు అర్జీలు అందించేందుకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ జరపాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా చూడాలన్నారు. అర్హులైన వారికి పూర్తి న్యాయం జరిగేలా సానుకూల దృక్పథంతో పని చేయాలని సూచించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భూపాలపల్లి, చిట్యాల తహసీల్దార్లు శ్రీనివాసులు, ఇమాం పాషా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు కృషి చేయాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, జూన్ 06(జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచుటకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల యందు పాఠశాల విద్యాశాఖ ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ తో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ బోధనను క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి, అలాగే ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన తీరును క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తూ విద్యార్థుల నమోదును పెంచాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.పాణిని, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు అర్షం రాజు, గ్యాదరి రమాదేవి, గుళ్ళపెల్లి సాంబయ్య, వయోజన విద్య జిల్లా కోఆర్డినేటర్ వేణుగోపాల్, స్థానిక మండల విద్యాశాఖ అధికారి వజ్జ తిరుపతి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినోద్ కుమార్, ఝాన్సీ, ఉమాదేవి మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల భారంపై కదిలిన జర్నలిస్టులు

- డీఈఓ హామీతో ఊరట..



**మహబూబాబాద్ బ్యూరో,జూన్ 06 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పాత్రికేయుల పిల్లలకు ఫీజులలో రాయితీ కల్పించి ఆదుకోవాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే, హెచ్-143) సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సంఘం జిల్లా కమిటీ సభ్యులు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) డాక్టర్ ఎ రవీందర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ... సమాజంలో నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పథకాల ప్రచారానికి వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి పిల్లల చదువులకు అధిక ఫీజులు భారంగా మారుతున్నాయని, ఈ విషయాన్ని మానవతా దృక్పథంతో అర్థం చేసుకొని జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులలో రాయితీ ఇచ్చేలా విద్యాశాఖ చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల విజ్ఞప్తిని సావధానంగా విన్న డీఈఓ, వారి పట్ల సానుకూలంగా స్పందించారు. ఈ విషయంపై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో త్వరలోనే చర్చించి, పాత్రికేయుల పిల్లలకు ఫీజు రాయితీల విషయంలో నిబంధనలకు అనుగుణంగా తగిన న్యాయం జరిగేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. డీఈఓను కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే (హెచ్-143) జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, కో కన్వీనర్ గౌస్ పాషా, సీనియర్ పాత్రికేయులు రాచగొల్ల సత్యం, మహబూబాబాద్ అర్బన్ అధ్యక్షుడు హనుమండ్ల రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, అమ్మటి వెంకన్న, కోశాధికారి తోకల రామ చంద్రు, తప్పెట్ల రాజు, గుంటి శ్రీధర్,చక్రదర్, కుమార్, తక్కెలపల్లి శ్రీనివాస్, మాదాసు మహేష్, మాలోత్ సీతారాం నాయక్, ఇండ్ల మహేష్, సోషల్ మీడియా ఇన్చార్జ్ తేజావత్ శ్రీను, గిరిజన పాత్రికేయుల నాయకుడు లావుడియా మనోహర్ చౌహన్ మరియు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# రైతుల ఖాతాల్లో రూ.345 కోట్ల జమ

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి జూన్ 6 (జనంసాక్షి) :** జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 321 కేంద్రాలు ద్వారా 29 వేల 645 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 98 వేల 307 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 345 కోట్ల 13 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కరీంనగర్‌లోని 68 మిల్లులకు, పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 22 మిల్లులకు తరలించడం జరుగుతుందని, మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు 10 నుండి 20 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని, రైతు పండించిన ధాన్యం నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత యాసంగి 2023-24 సీజన్లో 1 లక్షా 55 వేల 67 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, యాసంగి 2024-25 సీజన్లో లక్షా 98 వేల 307 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, గతంతో పోలిస్తే ఈ సీజన్లో 78శాతం అంటే 53 వేల మెట్రిక్ టన్నుల వరిధాన్యం రైతుల నుండి కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా ముగించడం జరిగిందని తెలిపారు.

## రైతుల సమస్యలు శాశ్వత పరిష్కారం

- జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**బచ్చన్నపేట జూన్ 6 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి కార్యక్రమంతో రైతుల భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. శుక్రవారం భూభారతి రెవెన్యూ సదస్సు ల నిర్వహణ తీరును పరిశీలించేందుకు మండలంలోని కొన్నె గ్రామంలో హై స్కూల్ ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడారు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులు పూర్తి చేసేటప్పుడు తమ సమస్యలను వివరించి చెప్పినప్పుడే పరిష్కారం లభిస్తుంది అన్నారు. దరఖాస్తు వ్రాసేటప్పుడు తగిన ఆధార పత్రాలను అధికారులకు చూపించాలని రైతులకు తెలియజేశారు. రెవెన్యూ అధికారులు కూడా రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా నిర్వహించాలని, రైతుల సమస్యలను పూర్తి వివరాలతో రికార్డులలో నమోదు చేయాలని తెలిపారు. సదస్సుకు వచ్చే ప్రతి ఒక్కరి వద్ద దరఖాస్తు తీసుకోవాలని సూచించారు. ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు తప్పనిసరిగా విధులలో ఉండాలని అవసరమైతే సాయంత్రం 6 గంటల వరకు ఉండి రైతు సమస్యలను పరిష్కరించాలన్నారు. దరఖాస్తు చేయడం కోసం వచ్చే వారికి హెల్ప్ డెస్క్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని రైతులకు తెలియజేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలన్నదే ప్రభుత్వ చేయమని అన్నారు. ఈ సదస్సులో ఆర్డిఓ గోపి రామ్, డిప్యూటీ ఎమ్మార్వో ఫణి కుమార్. ఆర్ ఐ మునివర్. కార్యదర్శి రాజశేఖర్. రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు

## గృహలక్ష్మి లబ్ధిదారులను ఇందిరమ్మ ఇండ్ల పథకంలో చేర్చాలి

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి డిమాండ్



**పరకాల, జూన్ 6 (జనం సాక్షి):** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గృహలక్ష్మి పథకంలో నియోజకవర్గంలో ఎంపికైన లబ్ధిదారులను తీసేసి కాంగ్రెస్ పార్టీ అనుచరులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం ఆ పార్టీ దుశ్చర్యలకు నిదర్శనమని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సీఎం కేసీఆర్ చొరవతో పరకాల నియోజకవర్గంలో గృహలక్ష్మీ పథకానికి 3000మంది లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. నియోజకవర్గంలో గ్రామ గ్రామానికి అధికారులు తిరిగి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేశారనీ,జిల్లా కలెక్టర్ల చేతులమీదుగా పంపిణీ చేసిన మంజూరు పత్రాలు లబ్ధిదారులకు అందచేసిన పత్రాలు ఇప్పుడు చెల్లవా అని ప్రశ్నించారు. గృహలక్ష్మి పథకానికి ఎంపికైన లబ్ధిదారులు సొంతింటి నిర్మాణాన్ని చేపట్టి సగం పనులు పూర్తి చేసుకున్నారని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలవీకానీ హామీలను, మోసపూరిత మాటలను నమ్మి ప్రజలు మోసపోయి ఆ పార్టీకి ఓట్లు వేయడంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గృహలక్ష్మి నిధులు ఆపేసిందనీ విమర్శించారు. తమకు న్యాయం చేయాలని ఎన్ని సార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్న పట్టించుకోకపోవడమే కాకుండా నిధులు ఇవ్వలేదనీ,లబ్ధిదారులతో కల్సి పలుమార్లు జిల్లా కలెక్టర్లకు, ప్రభుత్వానికి విన్నపం చేశామన్నారు. గృహలక్ష్మి లబ్ధిదారులను ఇందిరమ్మ ఇండ్ల పథకంలో చేర్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు పటిష్టమైన చర్యలు


- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 5 (జనంసాక్షి) :** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లోని ఈవిఎం గోదాంను ప్రత్యేక ఉపపాలనాధికారి డి.చంద్రకళ, ఎన్నికల తహశిల్దార్ శ్రీనివాస్, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఈవిఎం గోదాంలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు, ఇతర ఎన్నికల సంబంధిత సామాగ్రిని భద్రతపరిచి నిరంతరం పరిరక్షించడం జరుగుతుందని, త్రైమాసిక పరిశీలనలో భాగంగా అధికారులు, పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించామని తెలిపారు. సి.సి. కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించామని, భద్రతా సిబ్బంది పర్యవేక్షణలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు.

## తొందరపడి రైతులు విత్తనాలు విత్తవద్దు

- ములుగు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్



**ములుగు ప్రతినిధి, జూన్ 06(జనంసాక్షి) :** ములుగు జిల్లా రైతు సోదరులు వర్షపాతం 65 నుంచి 75 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసిన తర్వాత మాత్రమే విత్తనాలు విత్తుకోవాల్సిందిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన కోరారు. జిల్లాలో కొంతమంది రైతులు అకాల వర్షాలకు తొందరపడి వర్షపాతం సరిగా నమోదు కాకముందే ముందస్తుగా విత్తనాలు విత్తుతున్నట్టు తమ శాఖ దృష్టికి వచ్చినదని, దయచేసి రైతులు ఎవరు కూడా తొందరపడి విత్తనాలు విత్తి తదుపరి వర్షపాతం రాక, పొలం విత్తనాలు బుక్కి పోయే అవకాశం ఉందన్నారు. సుమారు 65 నుంచి 75 ఎం ఎం వర్షపాతం నమోదైన తరువాత మాత్రమే రైతుకు విత్తనాలు విత్తుకోవాల్సిందిగా రైతులకు ఆయన ఓ ప్రకటనలో కోరారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
07 జూన్ 2025

# నీటి లీకేజీలతో తాగునీరు కలుషితం

- నీటి వృధా అరికట్టి భవిష్యత్ తరాలకు అందించాలి
- కలుషిత నీరు తాగడం వల్ల అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు






**మణుగూరు, జూన్ 6 (జనంసాక్షి) :** మణుగూరు మండల కేంద్రంలో అశోక్ నగర్ ప్రధాన రహదారి పక్కన రహదారి విస్తరణలో భాగంగా మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలి ఒకే ఏరియాలో రెండు మూడు చోట్ల లీకుల ఏర్పడి నీరు వృధాగా పోతుంది.. కొత్త పైప్ లైన్ వేసినప్పటికీ అదే పరిస్థితి గత పది,15 రోజులుగా తాగు నీరు సక్రమంగా రాక పోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లీకుల ఉన్న ప్రాంతంలో బురద నీటిలో పందులు , పశువులు సంచరించి ఆ బురద నీరు ప్రధాన పైపుల గుండా నీరు సప్లై లేని సమయంలో నీరు వెళ్లడంతో అదే నీటిని కాలనీ వాసులు తాగి దద్దుర్లు జలుబు జ్వరాల బారిన పడుతున్నారు. సిబ్బంది మరమ్మత్తుల పేరుతో రెండు మూడు కాలయాపన చేస్తున్నారు. దీనిని మానిటరింగ్ చేసే ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి

### నీటి వృధా...

పట్టణం, గ్రామ పంచాయతీలలో పైప్ లైన్ ద్వారా సరఫరా చేస్తున్న మంచి నీరు పలుచోట్ల మద్యలో లీకేజీ వల్ల నీరు వృధాగా పోతుంది. మనకున్న నీటి నిల్వలు బట్టి బోర్ల ద్వారా నీటిని ట్యాంక్ లో నింపుతారు. ఆ నీరు మార్గమధ్యలో లీకేజీ కావటం,పగిలి పోవటం కొన్ని చోట్ల ట్యాప్ లేకపోవడంతో వివిధ ప్రాంతాలకు చేరాల్సిన మంచి నీరు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నీటి వృధా ఎక్కువగా జరుగుతోంది. పైపు లైన్ పగిలన చోట సక్రమంగా బిగించక పోవడంతో లీకేజీ ఏర్పడి పగలు రాత్రి తేడా లేకుండా గంటల తరబడి పలుచోట్ల నీరు వృథా గా పోతుంది. పైపు లైన్ తక్కువ లోతులో ఏర్పాటు చేయడం వల్ల వర్ష కాలంలో బారి వాహనాలు వెళ్లడం తో అవి పగిలి నీటి వృధా ఎక్కువుగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పైప్ లైన్ లీక్ సరిచేసి పరిశుద్ధమైన జలాలను అందించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని పలువురు వేడుకుంటున్నారు.

దీనిపై – ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరుంధతిని వివరణ కోరగా వారు ఈ విధంగా తెలిపారు. మణుగూరు రోడ్డు పక్కన విస్తరణలో భాగంగా పైప్ లైన్ తొలగించారు. వేరే లైన్ వేయటం జరిగింది. కొన్ని ఏరియాలలో పైపుల లీక్ లు అయినట్లు తెలిసింది. ఎప్పుడైనా పైప్ లైన్ లీక్ పునరుద్దరణ సమయంలో నీటి సప్లై ఆపి రిపేరు చేయవలసి ఉంటుందని అన్నారు.ఒకేసారి ప్రెషర్ వచ్చినప్పుడు చిన్న చిన్న లీకులనేవి జరిగినా ఇప్పుడు ఏమి కాదని ఆ నీటిని త్రాగు నీటి కోసం వాడిన ఇబ్బంది ఉండదని బదులు ఇచ్చారు .పెద్ద లైన్ రిపేర్ సెక్షన్ పెట్టాలంటే నీరు సప్లై ఆగిపోతుందని అన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, జూన్ 6 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో ని ప్రభుత్వ పాఠశాలకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వంటపాత్రల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో గల దాదాపు 256 ప్రభుత్వ పాఠశాలకు తాండూరు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వంట పాత్రలను ఏజెన్సీ సభ్యులకు పంపిణీ శారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు పూర్తి స్థాయిలో నమ్మకం ఏర్పడే విధంగా ముఖ్యమంత్రి నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని అన్నారు.రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే పాఠ్యపుస్తకాల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఇప్పటికే పాఠశాలకు ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని,దీనితో పాటు నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో దాదాపు 256 పాఠశాలకు వంట పాత్రలను పంపిణీ చేయడం కూడా హర్షించదగ్గ విషయమని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు, అదికారులు, ఉపాద్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

- లబ్ధిదారులు ఇండ్లను త్వరగా పూర్తి చేసుకోవాలి
- ఇందిరమ్మ ఇండ్లల్లో అనర్హులకు జాబితాలో చోటు లేదు

**పి.ఏ.పల్లి/గుడిపల్లి, జూన్ 6 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇండ్లను త్వరగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం గుడిపల్లి మండలం కేశంనేనిపల్లి తండాలో ఇందిరమ్మ లబ్దిదారుల ఇండ్ల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు.లబ్ధిదారులు తప్పకుండా ప్రతి ఒక్కరు ఇండ్లను నిర్మించుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ నాణ్యతతో కూడిన గృహాలను నిర్మించుకోవాలని సూచించారు.అనంతరం గనిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులను పరిశీలించారు.భూ సమస్యల దరఖాస్తులను వెంటనే పరిష్కరిస్తామని అన్నారు.ఆమె వెంట దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి,నల్లగొండ హౌసింగ్ పిడి రాజ్ కుమార్,గుడిపల్లి తహసిల్దార్ మధు హాసిని,ఎంపీడీవో పద్మ,హౌసింగ్ ఏఈ శివాజీ,పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్,రమావత్ రామచంద్రు, రైతులు,గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 6 (జనంసాక్షి) :** వేములవాడ అర్బన్ మండలంలోని చింతల్ తానా లో శు క్రవారం ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతికన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేములవాడ నియోజకవర్గంలో మంజూరి అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని నిరుపేదలు, గూడు లేనివారు ఆత్మగౌరవంతో బతకాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించిందన్నారు.గత ప్రభుత్వం పది సంవత్సరాల పాలనలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణం చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్లుగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చెసి నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు.మంజూరైన లబ్ధిదారులు సొంత ఇంటి కల నెరవేరబోతున్నందుకు సంతోషంగా ఇంటి నిర్మాణాలు చేపట్టారన్నారు.ఇందిరమ్మ ఇల్లు పథకం పేదోడికి గొప్ప వరం లాంటిదనీ ఇల్లు లేని వారికి ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. లబ్ధిదారులు అందరు త్వరగా ఇంటి నిర్మాణం చేపట్టి స్వంత ఇంటి కల సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. లబ్ధిదారులు మాట్లాడుతూ..గతంలో ఇందిరమ్మ కాలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యాయని, గత పది సంవత్సరాల్లో గత ప్రభుత్వం డబులు బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదన్నారు. మళ్లీ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో నేడు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు.ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంతో సొంత ఇల్లు ఉందన్న సంతృప్తి కలుగుతోందన్నారు.

# ఆలయ భూములకు సర్వే చేయట్లేదని రైతు సదస్సును అడ్డుకున్న గ్రామస్తులు



**గుర్రంపోడు, జూన్ 6 (జనంసాక్షి) :** గుర్రంపోడు మండలం కొప్పోల్ లో రైతు సదస్సును శు క్రవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ గ్రామంలోని దేవాలయ భూములకు సర్వే చేసి హద్దు రాళ్ళు పాతమని ఎన్నిసార్లు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్న పట్టించుకోవట్లేదని, ఆలయ భూములను కబ్జా చేసిన వ్యక్తులకు అధికారులు సహకరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.మార్చి 21న జరగాల్సిన ఆలయ భూముల సర్వే అర్థంతరంగా నిలిపి వేశారన్నారు.పై అధికారుల ఒత్తిడితోనా లేక కబ్జాదారులకు అధికారులు సహకరిస్తున్నారా? అని నిలదీశారు. స్పందించిన దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి సోమవారం నోటీసులు జారీ చేసి వారంలో ఆలయ భూముల సర్వే మొదలు పెడతామని చరవాని ద్వారా హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అయితగోని పరమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ తిరుగుడు లింగారెడ్డి, అయితగోని కృష్ణ గౌడ్,గ్రామ యువకులు పోల లక్ష్మీనారాయణ,కొత్త నాగరాజు, తేలుకుంట్ల రవి, పందుల రమేష్,కొత్ర రమేష్, మామిడి నరేష్,ఎడ్ల నరేష్, పోలేపల్లి నగేష్,బొమ్మ నాగరాజు, ఆవుల కుమార్,ఆవుల మహేష్,మారపాక రామకృష్ణ, కన్నెబోయిన శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తూతూ మంత్రంగా ఉపాధి హామీ ప్రజా వేదిక



**నిజాంసాగర్, జూన్ 6 (జనంసాక్షి) :** మహాత్మా గాంధీ ఉపాధి హామీ పనుల 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నాడు ప్రతి సంవత్సరం లాగే తూతూ మంత్రంగా కొనసాగింది ఈ కార్యక్రమం మండల స్పెషల్ ఆఫీసర్ ప్రమీల అధ్యక్షతన నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగినటువంటి 3.4 %ఎతీ% పనుల పైన 22 - 5-25 నుండి 5-6-25 వరకు గ్రామాలలో తనిఖీ నిర్వహించడం జరిగింది. ప్రతి గ్రామాల్లో ఉపాధి హామీ ఆడిట్ సిబ్బంది తనిఖీ చేయగా చాలా అక్రమాలు వెలుగు చూసినట్లు ఆడిట్ సభ్యులు నివేదికను సమర్పించారు. కొన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు హాజరు కాని వారికి బిల్లును మంజూరు చేసినట్లు తనకిలో వెళ్లడయ్యాయి. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మెట్లు ఇష్ట రీతిగా పేమెంట్లు చేశారు. కొన్ని గ్రామాల్లో తమ కుటుంబ సభ్యుల ఖాతాల్లో డబ్బులను జమ చేసినట్లు వెల్లడించారు. పల్లె ప్రకృతి వనం మరియు నర్సరీలలో మొక్కలను నాటినట్లు చూపించగా అక్కడ పరిశీలిస్తే సగానికి పైగా మొక్కలు లేవని వివరించారు. ఈ కార్యక్రమంలో పిట్లం ఏఎంసీ చైర్మన్ చికోటి మనోజ్ కుమార్, అడిషనల్ డిఆర్డిఓ వామన్ రావు ,ఎంపీడీవో గంగాధర్, ఎస్ఆర్పి సాంబశివరావు, ఏపీవో శివకుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ రాంబాబు ఆశయాలను కొనసాగిద్దాం




**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూన్ 6 (జనం సాక్షి) :** విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు దివంగత కీర్తిశేషులు డాక్టర్ రాంబాబు ఆశయాలను కొనసాగిద్దామని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత అధ్యక్షులు భోజన పల్లి నరసింహమూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్ లో శు క్రవారం సాయంత్రం డాక్టర్ రాంబాబు శ్రద్ధాంజలి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అనతి కాలంలోనే నారాయణపేట జిల్లాలో హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఎన్నో కార్యక్రమాలను తీసుకువచ్చాడని కొనియాడారు. హిందూ ధార్మిక కార్యక్రమాలను చురుకుగా నిర్వహిస్తూ నారాయణపేట జిల్లాలో హిందుత్వాన్ని ప్రతి గడపకు చాటి చెప్పారన్నారు. ఆయన చివరి వరకు కూడా హిందూ ధర్మం కోసం పనిచేశారని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడదామన్నారు. డాక్టర్ రాంబాబు సతీమణి సురేఖ రాంబాబు మాట్లాడుతూ తన భర్త ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని సభా వేదిక నుంచి కోరారు. విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి పరాయితం లక్ష్మీనారాయణ, ఏమి రెడ్డి శ్రీనివాసరెడ్డి, కన్న శివకుమార్, పగడాకుల బాలస్వామి, డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి, మ్యాడమ్ ప్రభాకర్, కుంటి ఎల్లప్ప, విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ నాయకులు కార్యకర్తలు, మాతృ భూమి సంస్థ నిర్వహకులు పాల్గొన్నారు.

# యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- మాజీ మంత్రి డా. చర్లకోల లక్ష్మారెడ్డి



**ఉర్కొండ, జూన్ 6 (జనం సాక్షి) :** యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని , క్రీడలతో మానసిక ఉల్లాసం ఉత్సాహం కలుగుతుందని మాజీ మంత్రి డాక్టర్ చెర్లకోల లక్ష్మారెడ్డి తెలిపారు.నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలంలోని ఊరుకొండ పేట గ్రామంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొనీ మొదటి బహుమతి పదివేల రూపాయలు మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్ సమకూర్చగా, రెండవ బహుమతి 5000 రూపాయలు బిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు కొండగిరి సమకూర్చగా విజేతలకు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర,జిల్లా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు, ఆర్గనైజర్స్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ పొందేలా బడిబాట నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- జూన్ 6 నుండి 19 వరకు బడిబాట..



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, జూన్ 6 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల జిల్లా వ్యాప్తంగా జూన్ 6 నుండి 19 వరకు జరుగుతున్న బడిబాట కార్యక్రమంలో పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంపొందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని,జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి బాల,బాలికలను తప్పనిసరిగా పాఠశాలల్లో ఎనరోల్ అయ్యే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో బడిబాట కార్యక్రమం నిర్వహణపై కలెక్టర్ రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, అంగన్వాడి ఆయా ఏఎన్ఎం వివోఏలు కలిసి ఒక టీమ్ గా ఏర్పడి ప్రతి ఇంటిని సందర్శించి పిల్లలంతా తప్పనిసరిగా పాఠశాలల్లో విద్యార్థులుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బాలికల ఎనరొల్మెంట్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో క్వాలిఫైడ్ నూతన ఉపాధ్యాయుల ద్వారా అందిస్తున్న మెరుగైన నాణ్యమైన విద్యా బోధన, వసతులు ఉచిత పుస్తకాలు యూనిఫామ్ మధ్యాహ్న భోజనం వివిధ పోటీ పరీక్షలు జేఈఈ నీట్ ఎంట్రన్స్ పరీక్ష కోచింగ్ డిజిటల్ క్లాస్ రూమ్ తరగతులు, విశాలమైన ప్లే గ్రౌండ్ మొదలగు వివరాలు తల్లిదండ్రులకు వివరించాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాల బాలికలు ఎక్కడ డ్రాప్ ఔట్ కాకుండా చూడాలని,మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు సైతం బడిబాట కార్యక్రమంలో పాల్గొంటూ బాలికలు ఎక్కడ విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని, తల్లిదండ్రులకు విద్య పట్ల ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు.పదవ తరగతి ముగిసిన తర్వాత కూడా ఇంటర్ చదివేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి మండల సూపర్వైజర్ వారి పరిధిలో గల బాలికలపై శ్రద్ధ వహిస్తూ వారు చదువు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలలో వార్డు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడ బాల కార్మికులను గుర్తించి వారిని పాఠశాలలో నమోదు చేయాలన్నారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న పరిశ్రమలు, హెూటల్స్, ఇట్టుక బట్టిలను తనిఖీ చేసి ఎవరైనా బాల కార్మికులు కనిపిస్తే వారిని వెంటనే పాఠశాలల్లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు.వలస కూలీల పిల్లలు సైతం పాఠశాలలో నమోదయ్యేలా జాగ్రత్త వహించాలన్నారు.జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ కూలీల కింద నమోదై జాబ్ కార్డ్ కలిగిన ప్రతి కుటుంబంలో పిల్లలు చదువుకుంటున్నారో లేదో పరిశీలించాలని, పిల్లలు చదువుకొని పక్షంలో వెంటనే వారిని ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులుగా నమోదు చేయాలన్నారు.ఈ సమావేశంలో డిఆర్డిఓ శేషాద్రి, జిల్లా వైద్య అధికారి రజిత,విద్యాశాఖ అధికారులు,ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీ వెల్ఫేర్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్‌లో వృద్ధ దంపతుల హత్య కలకలం



**రాజేంద్రనగర్, జూన్ 6 (జనం సాక్షి) :** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధ దంపతుల హత్య కలకలం రేపింది. శుక్రవారం రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ తెలిపిన ప్రకారం జన చైతన్య పేస్2 లో సొంత ఇంటిలోకి గత 40 రోజుల కిందట దంపతులైన షేక్ అబ్దుల్లా(70) అతని భార్య రిజ్వాన(65) లు అపార్ట్మెంట్లోకి వచ్చారు. వీరికి అమెరికాలో 2 పిల్లలు నన్ను ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం సాయంత్రం వృద్ధ దంపతులకు ఫిజియోథెరపీ చేసేందుకు ఇద్దరు వ్యక్తులు వచ్చామని వాచ్మేన్ తో మాట్లాడి వెళ్లారు. అందులో ఒకరు మాస్క్ ధరించి టోపీ తో వాచ్మేన్ తో మాట్లాడారు. మరో వ్యక్తి బుర్కా ధరించి వెళ్ళాడు. 40 నిమిషాల తర్వాత ఒక వ్యక్తి కిందికి రాగా మరో 30 నిమిషంలో తర్వాత మరో వ్యక్తి కిందికి వచ్చాడని నిందితులు వారి వెంట తెచ్చుకున్న వదునైన కత్తితో అబ్దుల్లా పై ఏడు కత్తిపోట్లు రిజ్వానా పై 3 కత్తిపోట్లతో హత మార్చారు. వృద్ధ దంపతుల హత్యపై దోస్తీంతో సమగ్ర విచారణ జరిపిస్తున్నారు బంగారం డబ్బు కోసం హత్య చేశారా? లేక వృద్ధ దంపతుల కుటుంబ సభ్యుల ప్రోత్సహంతో చేశారు అనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నామని నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డిసిపి వెల్లడించారు.




## బంగారం ధరలు స్థిరంగా..



స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గ చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.ఇటీవల తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్న బంగారం ధరల్లో మార్పులొస్తున్నాయి. అయితే నిన్నటి మార్కెట్ ధరలతో పోలిస్తే ఈ రోజు రేట్లు స్థిరంగా ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో శుక్రవారం రోజున గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం.హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో ఒక తులం బంగారం ధరలు రూ.91,300 (22 క్యారె ట్స్), రూ.99,600 (24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. నిన్నటి ధరలతో పోలిస్తే ఈ రోజు 10 గ్రాముల బంగారం ధరలో ఎలాంటి మార్పులు లేవు. చెన్నైలో శుక్రవారం 10 గ్రాముల 22 క్యారెట్లు, 24 క్యారెట్ల బంగారం ధరలు వరుసగా రూ.91,300, రూ.99,600గా ఉన్నాయి. దేశ రాజధాని నగరం దిల్లీలో బంగారం ధరలో నిన్నటితో పోలిస్తే ఎలాంటి మార్పులేదు. ఈ రోజు 10 గ్రాముల 22 క్యారెట్స్ పసిడి ధర రూ.91,450గా ఉంటే.. 24 క్యారెట్ల ధర రూ.99,750గా ఉంది.వెండి ధరలు:బంగారం ధరల మాదిరిగానే శుక్రవారం వెండి ధరల్లో మార్పులు వచ్చాయి. కేజీ వెండిపై ఏకంగా రూ.3,000 పెరిగింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 91,300 | ₹ 99,600 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,18,000

## ఆర్బీఐ ప్రకటనతో స్టాక్ మార్కెట్ రయ్..రయ్..

**జనంసాక్షి:**దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) రెపో రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో భారత ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు భారీ ర్యాలీని చవిచూశాయి.ఇంట్రాడేలో 82,299.89 పాయింట్ల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్ 746.95 పాయింట్లు (0.92 శాతం) పెరిగి 82,189 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 కూడా 252.15 పాయింట్లు లేదా 1.02 శాతం లాభపడి 25,003.05 వద్ద ముగిసింది. విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 1.28 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ సూచీలు 0.92 శాతం పెరిగాయి.ఆర్బీఐ ఎంపీసీ 50 బేసిస్ పాయింట్ల రేట్ల కోతను ప్రకటించి, అంతర్జాతీయ వృద్ధి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని 'న్యూట్రల్' నుంచి 'న్యూట్రల్'కు మారుస్తూ రెపో రేటు కోతను ప్రకటించింది. అయితే వ్యవస్థలో లిక్విడిటీని పెంచేందుకు ఆర్బీఐ ఎంపీసీ నాలుగు విడతల్లో నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)లో 100 బేసిస్ పాయింట్ల కోత విధించింది. అయితే పాలసీ ప్రసంగం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్బీఐ గవర్నర్ మాట్లాడుతూ భవిష్యత్తులో రేట్లను తగ్గించే అవకాశాలు చాలా తక్కువని అన్నారు. ఎంపీసీ సభ్యులందరూ రేట్ల వైఖరితో ఏకీభవించారని ఆయన స్పష్టం చేశారు.ప్రతిపాదిత గోల్డ్ లోన్ నిబంధనలను సడలించవచ్చని ఆర్బీఐ చెప్పడంతో ముత్తూట్ ఫైనాన్స్, మణప్పురం ఫైనాన్స్ వంటి గోల్డ్ ఫైనాన్షియర్ల షేర్లు శుక్రవారం పెరిగాయి. ముత్తూట్ ఫైనాన్స్ 6.6 శాతం, మణప్పురం ఫైనాన్స్ 3 శాతం పెరిగాయి.ఈ ప్రకటనతో నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 1.5 శాతం లాభంతో 56,650 వద్ద ఆల్ టైమ్ గరిష్టాన్ని తాకింది. రంగాలవారీగా చూస్తే రేట్ సెన్సిటివ్ రంగాలు దూసుకుపోతున్నాయి. నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ దాదాపు 5 శాతం, నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 1.5 శాతం, నిఫ్టీ ఆటో ఇండెక్స్ 1.4 శాతం పెరిగాయి.

**ఆర్‌బీఐ ఒక్క నిర్ణయం.. హోమ్‌లోన్ ఈఎంఐ తగ్గింపు**

భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) రెపో రేటు 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో గృహ, వాహన, వ్యక్తిగత, కార్పొరేట్ రుణాలపై వడ్డీ రేట్లు దిగిరానున్నాయి.దీంతో ఈఎంఐల భారం తగ్గనుంది. గత ఐదేళ్లుగా ఆర్‌బీఐ రెపో రేటును స్థిరంగా ఉంచింది. 2025 ఫిబ్రవరిలో చాలాకాలం తర్వాత 25 పాయింట్లు తగ్గించింది. తర్వాత



మరోసారి ఏప్రిల్‌లో మరో 25 పాయింట్లు కోత విధించింది. తాజాగా శుక్రవారం 50 బేసిస్ పాయింట్లు కట్ చేసింది. దాంతో ప్రధానంగా అధిక కాలం ఈఎంఐలు కొనసాగే గృహ రుణ గ్రహీతలకు ఇది బంపర్ అవకాశమనే చెప్పొచ్చు. అటు మందగమనంతో ఆశగా ఎదుచుచూస్తున్న రియల్ ఎస్టేట్ రంగానికి కూడా తాజా తగ్గింపు తగిన బూస్ట్ ఇస్తుందని పరిశ్రమ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

**గృహ రుణంపై ఊరట ఎంతంటే..?**

ఒక వ్యక్తి తాజా రెపో రేటు కోతకు ముందు 8.5 శాతం వడ్డీ రేటుతో 20 ఏళ్ల కాలానికి రూ.25 లక్షల ఇంటి రుణం తీసుకున్నారనుకుందాం. అతనికి ప్రస్తుతం రూ.21,696 చొప్పున నెలవారీ వాయిదా (ఈఎంఐ) పడుతుంది. ఆర్‌బీఐ అర శాతం రేటు కోత నేరుగా బ్యాంకులు వర్తింపజేస్తే.. గృహ రుణంపై వడ్డీ రేటు 8 శాతానికి తగ్గుతుంది. దీని ప్రకారం ఈఎంఐ రూ.20,911కు దిగొస్తుంది. అంటే నెలకు రూ.785 తగ్గినట్లు లెక్క. మిగతా రుణ వ్యవధిలో ఇతరత్రా ఎలాంటి మార్పులు జరగకుండా ఉంటే, దీర్ఘకాలంలో రుణ గ్రహీతకు రూ.1,88,299 మిగులుతుంది. ఒకవేళ అదే ఈఎంఐ మొత్తాన్ని కొనసాగిస్తే.. రుణ కాల వ్యవధి 10 నెలలు తగ్గుతుంది.రెపో రేటు అంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే రుణాలపై వసూలు వేసే వడ్డీ రేటు. రెపో రేటు పూర్తి రూపం రీపర్చేజ్ అగ్రిమెంట్ లేదా రీపర్చేజింగ్ ఆప్షన్.



బ్యాంకులు అర్హత కలిగిన సెక్యూరిటీలను అమ్మడం ద్వారా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రుణాలు పొందే అవకాశం ఉంటుంది. మార్కెట్‌లో డబ్బు ప్రవాహాన్ని నియంత్రించడానికి, పెంచడానికి కేంద్ర బ్యాంకు రెపో రేటును ఉపయోగిస్తుంది. ద్రవ్యోల్బణం మార్కెట్‌పై ప్రభావం చూపినప్పుడు ఆర్‌బీఐ రెపో రేటును పెంచుతుంది.

**ఎంసీఎల్ఆర్ రుణాలపై ప్రభావం ఇలా..**


ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయంతో ఎంసీఎల్ఆర్‌తో ముడిపడి ఉన్న రుణాలపై ప్రభావం వెంటనే కనిపించదు. ఎంసీఎల్ఆర్ అనేది గృహ రుణాలు, వ్యక్తిగత రుణాలు, ఇతర రుణాలపై వడ్డీ రేట్లను నిర్ణయించడానికి బ్యాంకులు ఉపయోగించే బెంచ్‌మార్క్ వడ్డీ రేటు. రెపో రేటు మాదిరిగా కాకుండా బ్యాంకులకు నిధుల వ్యయం, నిర్వహణ ఖర్చులు.. వంటి వాటిపై ఆధారపడి ఎంసీఎల్ఆర్‌లో మార్పులు ఉంటాయి. రేట్ల కోత ప్రభావం ఎంసీఎల్ఆర్‌లో పూర్తిగా ప్రతిబింబించడానికి కనీసం రెండు త్రైమాసికాలు పట్టవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. బ్యాంకులు తమ వ్యయాలను సర్దుబాటు చేయడానికి, రేట్ల తగ్గింపు ప్రయోజనాలను రుణగ్రహీతలకు బదిలీ చేయడానికి కొంత సమయం వేచిచూడాల్సి ఉంటుంది. ఫలితంగా ఎంసీఎల్ఆర్ లింక్డ్ లోన్లు తీసుకున్నవారు తమ ఈఎంఐలు తగ్గాలంటే మరికొంత కాలం ఆగాలి.

**డిపాజిట్లకు సవాల్..**

వడ్డీరేట్ల తగ్గింపు డిపాజిట్ల పరంగా బ్యాంకులకు సవాలుగా మారుతుంది. రుణ రేట్లు తగ్గుతాయని భావిస్తున్నప్పటికీ డిపాజిట్లపై అందించే వడ్డీ రేట్లను కూడా బ్యాంకులు నిర్వహించాల్సి ఉంటుంది. డిపాజిట్ రేట్లను వెంటనే తగ్గించడం వల్ల బ్యాంకులు డిపాజిటర్లను ఆకర్షించడం, వారిని నిలుపుకోవడం కష్టతరం అవుతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. వినియోగదారులు తమ పొదుపుపై మంచి రాబడిని కోరుకునే ఇతర మార్గాలను ఎంచుకుంటారని విశ్లేషిస్తున్నారు.

## ఫ్లిప్‌కార్ట్ ఇక నేరుగా అప్పులిస్తుంది..

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌కి రిజర్వ్ బ్యాంక్ నుంచి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) లైసెన్సు లభించింది.ఈ ఏడాది మార్చిలో ఆర్‌బీఐ దీన్ని మంజూరు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫ్లిప్‌కార్ట్ దీన్ని ధ్రువీకరించినప్పటికీ, ఇతర వివరాలను వెల్లడించలేదు.ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్సు లభించడంతో ఇకపై కస్టమర్లకు ఫ్లిప్‌కార్ట్ నేరుగా రుణాలు అందించేందుకు వీలు లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్‌లో అమెరికన్ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్‌కి ప్రస్తుతం 80 శాతం వాటాలు ఉన్నాయి. త్వరలో ఐపీవోకి వచ్చే యోచనలో ఉన్న ఫ్లిప్‌కార్ట్ తమ హోల్డింగ్ కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని సింగపూర్ నుంచి భారత్‌కు మార్చే యోచనలో ఉన్నట్లు వెల్లడించింది.ఈ ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్సు ఫ్లిప్‌కార్ట్‌కు ఆర్థిక సేవల రంగంలో కొత్త అవకాశాలను తెరుస్తుంది. ముఖ్యంగా డిజిటల్ రుణాలు, క్రెడిట్ ఉత్పత్తులు, కస్టమర్ ఆర్థిక అవసరాలను తీర్చేందుకు సౌలభ్యం కల్పిస్తుంది. భారత్‌లో ఈ-కామర్స్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో, ఈ లైసెన్సు ఫ్లిప్‌కార్ట్‌కు పోటీలో ముందంజలో ఉండటానికి, వినియోగదారులకు సమగ్ర సేవలను అందించడానికి సహాయపడుతుంది.



## 3 శాతం క్షీణించిన మే నెల ప్రయాణికుల వాహన అమ్మకాలు

భారత్-పాక్ వివాదం కారణంగా అనేక రాష్ట్రాల్లో వినియోగదారులు కొనుగోళ్లను ఆలస్యం చేయడం, ఎంట్రీ-లెవల్ మోడళ్లకు డిమాండ్ మరింత తగ్గడంతో గత మే నెలలో ప్యాసింజర్ వెహికల్ రిటైల్ అమ్మకాలు 3 శాతం తగ్గాయని డీలర్ల సంస్థ శుక్రవారం తెలిపింది.2024, మేలో 3,11,908 యూనిట్లతో పోలిస్తే గత నెలలో రిజిస్ట్రేషన్లు 3,02,214 యూనిట్లుగా ఉన్నాయి. జమ్మూ కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లలో యుద్ధ సంబంధిత ఆందోళనలు, సరిహద్దు ఉద్రిక్తతలు పెరగడం వలన కొనుగోలుదారులు కొనుగోళ్లను ఆలస్యం చేసి ఉండొచ్చని పరిశ్రమ వర్గాల అభిప్రాయం. ద్విచక్ర వాహన రిటైల్ అమ్మకాలు మే నెలలో 7 శాతం పెరిగి 16,52,637 యూనిట్లకు చేరుకున్నాయి. గత సంవత్సరం ఇదే కాలంలో ఈ అమ్మకాలు 15,40,077 యూనిట్లు.

## ముదురుతున్న విభేదాలు

**- ట్రంప్-మస్క్ మధ్య పెరుగుతున్న దూరం**
**- ఒక్క రోజులో భారీగా పడిన టెస్లా షేరు**

న్యూయార్క్:ఎలాన్ మస్క్ సారథ్యం వహిస్తున్న టెస్లా షేరు విలువ కుప్పకూలింది. గురువారం ఒక్కరోజే 14 శాతం పడిపోయి 150 బిలియన్ డాలర్లకు పైగా మార్కెట్ విలువను తుడిచిపెట్టుకుపోయింది.వరుసగా నాలుగు ట్రేడింగ్ సెషన్ల నుంచి ఈ షేరు భారీగా క్షీణించింది. ఈ కంపెనీకి సీఈఓగా ఉన్న ఎలాన్ మస్క్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య బహిరంగ విభేదాలే ఇలా టెస్లా షేరు విలువ పడిపోవడానికి ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత భారీగా పెరిగిన షేరు ధర ఇద్దరి మధ్య వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని వస్తున్న వరుస కథనాలకు భారీగా కుప్పకూలుతోంది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 1 ట్రిలియన్ డాలర్ల దిగువకు పడిపోయి 916 బిలియన్ డాలర్ల వద్దకు చేరింది.



**ప్రభుత్వ కాంట్రాక్టులు రద్దు చేస్తాం..**

ఇటీవల బహిరంగంగా మస్క్, ట్రంప్ మధ్య విభేదాలు చెలరేగుతున్నాయి. మస్క్ వ్యాపారాలకు సంబంధించిన ప్రభుత్వ కాంట్రాక్టులను రద్దు చేస్తామని అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ప్రభుత్వ వ్యయ బిల్లుపై మస్క్ చేసిన విమర్శలకు సమాధానంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మస్క్‌ను ఎదుర్కోవడం కష్టంగా మారిందని, ఆయన అతిగా స్పందిస్తున్నారని ట్రంప్ ఆరోపించారు.

ఈవీ క్రెడిట్లు లేకపోవడంపై అసంతృప్తి:ఓవల్ ఆఫీస్ నుంచి ట్రంప్ మాట్లాడుతూ.. 'ఎలాన్‌కు నాకు మంచి అనుబంధం ఉంది. ఇకపై కలిసి పని చేస్తామో లేదో తెలియదు. (ఇటీవల డోజ్ నుంచి మస్క్ వైదొలిగారు) ట్రంప్ ఇటీవలి చర్యలకు నేను ఆశ్చర్యపోయాను' అంటూ కొత్త బిల్లులో ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) క్రెడిట్లు లేకపోవడంపై మస్క్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు.

**భవిష్యత్తు ఎన్నికల్లో సవాళ్లు:**

ట్రంప్ మీడియాతో మాట్లాడు తుండగా మస్క్ వెంటనే ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో స్పందించారు. తాను లేకుంటే ట్రంప్ ఎన్నికల్లో ఓడిపోయే వారని, డెమ్స్ సభను నియంత్రించేవారని, సెనేట్‌లో రిపబ్లికన్లు 51-49తో గెలిచేవారని పేర్కొన్నారు. మస్క్ ఇటీవల బలమైన రాజకీయ వైఖరిని తీసుకున్నారు. కొత్త బడ్జెట్ బిల్లు అసహ్యంగా ఉందని, దానికి మద్దతిచ్చే ప్రజాప్రతినిధులు భవిష్యత్ ఎన్నికల్లో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు.

## భారత్‌లో ఓపెన్‌ఏఐ అకాడమీ




**కేంద్ర ఐటీ శాఖలో భాగమైన ఇండియాఏఐ మిషన్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం**

న్యూఢిల్లీ: చాట్‌జీపీటీ మాతృసంస్థ ఓపెన్‌ఏఐ, కేంద్ర ఐటీ శాఖలో భాగమైన ఇండియాఏఐ మిషన్ కలిసి భారత్‌లో ఓపెన్‌ఏఐ అకాడమీని ప్రారంభించాయి. ఇందుకు ఎంవోయూ కుదుర్చుకున్నాయి. దేశీయంగా వేగంగా వృద్ధి చెందుతున్న డెవలపర్ల కమ్యూనిటీ, డిజిటల్ మౌలిక సదుపాయాలు, స్టార్టప్‌లు.. ఆవిష్కర్తల నెట్‌వర్క్‌కు ఏఐపరంగా కావాల్సిన విద్యావనరులు, సాధనాలు దీనితో అందుబాటులోకి వస్తాయని ఓపెన్‌ఏఐ తెలిపింది.విద్య, టెక్నాలజీ అందరికీ అందుబాటులో ఉండాలనే ఉమ్మడి లక్ష్య సాధన దిశగా ఇది కీలక ముందడుగని ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ అకాడమీ లో డిజిటల్, ఇన్-పర్సన్ లెర్నింగ్ విధానంలో ఇంగ్లీష్, హిందీలో కంటెంట్ అందుబాటులో ఉంటుంది. త విద్యార్థులు, డెవలపర్లు, విద్యావేత్తలు, సివిల్ సర్వెంట్లు, చిన్న స్థాయి వ్యాపారవర్గాలు మొదలైన వారందరికీ ఏఐ నైపుణ్యాల్లో శిక్షణనిచ్చేందుకు ఇది ఉపయోగపడనుంది. ఇండియాఏఐ మిషన్ ఆమోదించిన 50 ఫెలోస్/స్టార్టప్‌లకు 1,00,000 డాలర్ల వరకు విలువ చేసే ఏపీఐ క్రెడిట్స్ లభిస్తాయి.

## నేను దొంగను కాను.. జస్ట్ పారిపోయానంతే..

2016 నుంచీ బ్రిటన్‌లో నివసిస్తున్నారు. మాల్యాను భారత్‌కు రప్పించడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న విషయం విదితమే. తాను తీసుకున్న రుణాలకు అనేక రెట్లు బ్యాంకులు తన నుంచి వసూలు చేశాయని.. అందుకు సంబంధించిన అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని కోరుతూ ఆయన ఇటీవల కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఆర్‌సిబి విజయంతో మాల్యాచేసిన పోస్ట్‌పై వివాదంచెలరేగింది. ఆయన దొంగ అంటూ వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చి ఎగవేతలను కట్టేయాలని సూచించారు. ఈ క్రమంలో మాల్యా స్పందించారు. ముందస్తు ప్రణాళికలో భాగంగానే 2016లో నేను భారత్ నుంచి విదేశాలకు వెళ్లాను. కొన్ని కారణాల వల్ల తిరిగి రాలేకపోయాను. ఈ దొంగతనం అనే విషయం ఎక్కడి నుంచి వచ్చింది. భారత్‌లో న్యాయమైన విచారణ, గౌరవప్రదమైన జీవితం ఉంటుందని హామీ ఇస్తే దేశానికి తిరిగి వచ్చే విషయం గురించి ఆలోచించేవాడిని.. కానీ ఆ విధంగా ఉండదని నాకు తెలుసని మాల్యా అన్నారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ పునర్నిర్మాణ ప్రణాళికతో తాను అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీని సంప్రదించి.. తాను సమస్యల్లో ఉన్నట్లు ఆయనకు చెప్పానని మాల్యా అన్నారు. ఈ ఆర్థిక మాంద్యంలో పని చేయలేనని.. అందుకుగాను కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ విమానాల సంఖ్యను తగ్గించాలని, ఉద్యోగులను తొలగించాలని భావిస్తున్నట్లు- తెలిపానన్నారు. అయితే ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవద్దని, బ్యాంకుల నుంచి మద్దతు లభిస్తుందని ప్రణబ్ ముఖర్జీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం పలు ఆర్థిక ఇబ్బందుల వల్ల తాను దేశాన్ని వీడాల్సి వచ్చిందని తెలిపారు.

## విదేశాల్లో చదువుకు ఇవి ఉండాల్సిందే..



చాలా మంది భారతీయ విద్యార్థులు తమ ఉన్నత విద్యను కొనసాగించడానికి విదేశీ విశ్వవిద్యాలయంలో చేరాలని కలలు కంటారు. దాని కోసం చదువులో ఎక్కువగానే కష్టపడతారు.అయితే, ఈ విదేశీ విద్యకు సంబంధించిన ప్రాసెసింగ్‌లో పాస్‌పోర్ట్, వీసాతో పాటు అనేక ఆర్థిక పత్రాలు అవసరమవుతాయి. విద్యార్థులు రాబోయే విద్యా ప్రయాణానికి సిద్ధమవుతున్నప్పుడు, చివరి నిమిషంలో వచ్చే ఇబ్బందులను నివారించడానికి అవసరమైన అన్ని ఆర్థిక పత్రాలు సిద్ధం చేసుకోవడం చాలా అవసరం. వివిధ దేశాలకు దరఖాస్తు ప్రక్రియ మారుతూ ఉంటుంది. కాబట్టి, విద్యార్థి వీసా అవసరాలు, నిధుల రుజువుగా అవసరమైన పత్రాల జాబితా కూడా మారుతూ ఉంటాయి. విద్యార్థులు ఏ పత్రాలను తీసుకెళ్లాలి అనే దానిపై సరైన మార్గదర్శకత్వం చాలా కీలకం. విదేశీ విద్యా ప్రయాణంలో మీకు తప్పనిసరిగా అవసరమయ్యే కొన్ని ముఖ్యమైన ఆర్థిక పత్రాల జాబితాను ఇక్కడ తెలుసుకుందాం.విశ్వవిద్యాలయాలు, వీసా కాన్సులేట్ కోసం మీ/స్పాన్సర్‌ల బ్యాంక్ ఖాతా స్టేట్‌మెంట్‌లను సమర్పించవలసి ఉంటుంది. విద్యార్థి వీసా కోసం కూడా బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను చూపించాలి. స్టేట్‌మెంట్‌లు ప్రత్యేకంగా అవసరమైన వ్యక్తికి చెందినవి అయి ఉండాలి. ఉదాహరణకు, ఒక విశ్వవిద్యాలయం..తల్లిదండ్రులు/సంరక్షకుడు లేదా జీవిత భాగస్వామి హామీని అంగీకరిస్తే, ఆ స్టేట్‌మెంట్ ఆ వ్యక్తి పొదుపు ఖాతా నుంచి ఉండాలి. స్వీడన్ వంటి కొన్ని దేశాలు విద్యార్థి ఖాతాలో నిధులు ఉండాలని నిర్దేశిస్తాయి. తదనుగుణంగా, విద్యార్థి వాటిని చూసుకోవాల్సి ఉంటుంది. వీటికి కరెంట్ అకౌంట్ స్టేట్‌మెంట్స్‌ను అంగీకరించరు. కాబట్టి, వాటిని సమర్పించే ముందే ఖాతా రకాన్ని నిర్ధారించుకోవడం మంచిది. అయితే, ఆర్థిక సామర్థ్యాన్ని నిరూపించడానికి బ్యాంకు లెటర్‌హెడ్‌పై సంతకం, స్టాంపింగ్‌తో ఒరిజినల్ స్టేట్‌మెంట్ ఉండాలి. స్టేట్‌మెంట్ చేతితో రాసి ఉండకూడదు. విశ్వవిద్యాలయాలు/వీసా కాన్సులేట్‌లు సాధారణంగా 6 నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను అడుగుతాయి. ఇది దేశాలను బట్టి మారవచ్చు.విద్యార్థులు రుణానికి రుజువుగా లోన్ ఆమోద లేఖను కూడా అందించాలి. మీరు రుణం కోసం దరఖాస్తు చేసుకున్న బ్యాంకు నుంచి దీన్ని పొందడం సులభమే. ఈ లేఖ విద్యార్థికి విదేశాలలో అతని ఉన్నత విద్య కోసం నిర్దిష్ట మొత్తాన్ని రుణం ఇవ్వడానికి బ్యాంకు ఆమోదాన్ని తెలియజేస్తుంది. ముఖ్యంగా, ఈ లేఖ బ్యాంకు లెటర్‌హెడ్‌పై సంతకం, స్టాంపింగ్‌తో ఉండాలి. లేఖలో రుణ మొత్తం, విద్యార్థి పేరు ఉండాలి. పేర్కొన్న సమయంలో రుణ మొత్తాన్ని చెల్లిస్తామని హామీ ఇవ్వాలి. ఉదాహరణకు, ఎంత రుణాన్ని మంజూరు చేస్తారో ఆ వివరాలను అక్కడ తెలపాలి. చెల్లింపు మినహా అన్ని నిబంధనలు, షరతులు పూర్తయ్యాయని పేర్కొనాలి. ఇంకా, విద్యార్థి..విజయవంతంగా స్కాలర్‌షిప్ పొందినట్లయితే, అతను తన ఆర్థిక సామర్థ్యానికి రుజువుగా స్కాలర్‌షిప్ లెటర్‌ను జతచేయాలి. స్కాలర్‌షిప్ మంజూరు చేసే విశ్వవిద్యాలయం/సంస్థ ఈ లేఖను అందిస్తాయి. విద్యార్థి ప్రభుత్వ గ్రాంట్‌ను పొందినట్లయితే దాని కాపీని కూడా జతచేయాలి.అఫిడవిట్ అంటే ఆర్థిక పత్రం కాదు. విద్యార్థికి అందజేస్తున్న ఆర్థిక సహాయానికి ధ్రువీకరణ. యూఎస్, ఆస్ట్రేలియాలోని విశ్వవిద్యాలయాలు ఈ పత్రాన్ని ఆర్థిక రుజువుతో పాటు అడుగుతాయి. స్పాన్సర్‌షిప్‌కు సంబంధించిన అఫిడవిట్..రూ.10, 20 విలువ కలిగిన స్టాంప్ పేపర్‌పై నోటరీ చేసిన పత్రం. దీన్ని విద్యార్థి తల్లిదండ్రులు, జీవిత భాగస్వామి, దగ్గర బంధువులు మీ విద్యకు స్పాన్సర్(సహాయం) చేస్తారని, ఫీజులు, జీవన వ్యయాలను చెల్లిస్తారని పేర్కొనాలి. ఈ హామి అఫిడవిట్..ఆదాయ రుజువు, బ్యాంకు లెటర్లతో అనుబంధంగా ఉంటుంది. అయితే, కొన్ని యూరోపియన్ విశ్వవిద్యాలయాలు స్పాన్సర్‌షిప్‌ల పట్ల చాలా భిన్నంగా ఉన్నాయి. కొన్ని దేశాలు అందరి హామి పత్రాలను అంగీకరించవు. ఉదాహరణకు, విద్యార్థి ఫ్రాన్స్‌లోని విశ్వవిద్యాలయాలకు దరఖాస్తు చేసుకుంటే, అతని దగ్గర బంధువు అదే దేశంలో ఉండి ఆ విద్యార్థి ఖర్చులను భరించడానికి సిద్ధంగా ఉంటే అతనికి 'స్పాన్సర్‌షిప్ లెటర్' అందించవచ్చు.ఇది లోన్ అప్రూవల్ లెటర్ కంటే కొంచెం భిన్నంగా ఉంటుంది. యూఎస్‌లోని విశ్వవిద్యాలయాలు అడ్మిషన్ సమయంలో వీటిని అడుగుతాయి. ఇది లేకుండా వారు -20లను జారీ చేయరు. ఈ పత్రాన్ని బ్యాంకులు అందిస్తాయి. ఇది, విద్యార్థి విదేశీ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందితే బ్యాంకు రుణం అందించడానికి సిద్ధంగా ఉంటుందని సూచిస్తుంది. ఈ పత్రంలో రుణం మంజూరు చేయడానికి బ్యాంకు సంసిద్ధత, రుణ అర్హత మొత్తాన్ని..బ్యాంకు లెటర్‌హెడ్‌పై పొందుపరచి సంతకం, స్టాంపింగ్ చేయాలి.విద్యార్థి..ఆస్తిని హామిగా ఉంచి విద్యా రుణం పొందినట్లయితే ఆ ఆస్తికి సంబంధించిన మూల్యాంకన(విలువ గణన) నివేదికను, రుణ అప్రూవల్ లెటర్‌తో పాటు సమర్పించవలసి ఉంటుంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మొదలైన దేశాలు విద్యార్థి లోన్ అప్రూవల్ లెటర్‌తో పాటు ఆస్తి మూల్యాంకన నివేదికను జతచేయడం తప్పనిసరి. ఈ నివేదికను బ్యాంకు లేదా సంబంధిత ఆర్థిక సంస్థ అందిస్తుంది. ఈ నివేదికలో ఆస్తి పరిమాణం, ఇతర స్పెసిఫికేషన్లు, దానికి సంబంధించిన ఇమేజ్‌లు వంటి వివరాలు ఉంటాయి.కొన్ని దేశాలకు 'సీఏ' సర్టిఫికేట్ కూడా అవసరం. విద్యార్థి/స్పాన్సర్ కలిగి ఉన్న వాస్తవ ఆస్తులు/అప్పులను తెలుపుతూ సీఏ సర్టిఫికేట్ ఇవ్వాలి.

# భారత్‌లో మొదటి జాతీయ పేపర్ ఎక్స్‌పో ప్రారంభం

**ఈ పేప్‌ఎక్స్‌పో 2025 హైటెక్స్‌లో ఈనెల 8వ తేదీ వరకు..**



**హైదరాబాద్, జూన్ 6 (జనంసాక్షి) :** పేపర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారతదేశంలో మొదటి జాతీయ పేపర్ ఎక్స్‌పో పేప్‌ఎక్స్‌పో 2025ను హైటెక్స్‌లో ప్రగతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ పరుచూరి నరేంద్ర ప్రారంభించారు. ఈ ఎక్స్‌పోకు ఎంఎస్‌ఎంఈ సహకారం ఉంది. ఈ ఎక్స్‌పో మూడు రోజులు జరగనుంది. ఈనెల 8వ తేదీ వరకు ఉంటుంది. ఈ సందర్భంగా పాపిరస్ ఎక్స్‌పో ఎల్‌ఎల్‌పీ సీఈఓ నిర్మల్ కుహాద్ మాట్లాడుతూ ఇది ఒక ప్రత్యేక ప్రదర్శన అన్నారు. మొదటిసారి నిర్వహిస్తున్న ఒక వేదిక ఇదన్నారు. మేము స్థాపించిన పేపర్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గర్వంగా నిర్వహిస్తున్నామన్నారు. పేపర్ వినియోగం ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ఫౌండేషన్ స్థాపించామని చెప్పారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం ఒకటన్నారు. వ్యక్తిగత పేపర్ వినియోగం అతి తక్కువ స్థాయిలో ఉందన్నారు. పేపర్ వినియోగం వనరుల నాశనానికి (అటవీ నష్టం) దోహదం చేస్తుందన్న అపోహను తొలగించడమే ఈ ఎగ్జిబిషన్ ముఖ్య ఉద్దేశాలలో ఒకటన్నారు. భారతదేశంలో తయారవుతున్న, వినియోగిస్తున్న పేపర్‌లో సుమారు 80 శాతం రీసైకిల్ చేయబడిన వనరుల నుంచే వస్తుందన్నారు. అందువల్ల ఇది దేశంలోనే అత్యంత పర్యావరణహిత పరిశ్రమలలో ఒకటిగా నిలిచిందని చెప్పారు. ఈ వేదిక ద్వారా పర్యావరణ మార్పులను తెలియజేస్తూ అభివృద్ధిలో పేపర్ పాత్రను ప్రపంచానికి చూపించాలన్నదే మా ఆశయం అన్నారు. కార్యక్రమంలో ఎమామి పేపర్ మిల్స్ సీఎంఓ సౌమ్యాజిత్ ముఖర్జీ, ఐపీపీటీఏ జనరల్ సెక్రటరీ ఎంకే గోయల్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ (హైదరాబాద్) డిప్యూటీ డైరెక్టర్ నటరాజ్, పాపిరస్ ఎక్స్‌పో ఎల్‌ఎల్‌పీ అధ్యక్షుడు బీఆర్ రావు, పాపిరస్ ఎక్స్‌పో ఎల్‌ఎల్‌పీ డైరెక్టర్ అర్వింద్ శర్మ ప్రసంగించారు. ఐపీపీటీఏ జనరల్ సెక్రటరీ ఎంకే గోయల్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్, హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ నటరాజ్, ప్రాంప్ట్ ప్యాకేజింగ్ డైరెక్టర్ సోహన్ లాల్ డయామా, త్రీ ఎం పేపర్ బోర్డ్స్ లిమిటెడ్ ఎండీ రుషభ్ షా, జానీ సేల్స్ డైరెక్టర్ అబియాలీ జానీ పాల్గొన్నారు.





# కాంగ్రెస్ పాలనలో ఉత్పత్తి, జీవన ప్రమాణాలు పెరిగాయి

- కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదన్నారు. మేం మిగులు విద్యుత్తు లక్ష్యంగా ముందుకు పోతున్నాం
- విద్యుత్ డిమాండ్ పెరిగింది
- తెలంగాణ రైసింగ్ ను కుట్ర దారులు ఆపలేరు
- ప్రజా పాలనలో 90 లక్షల కుటుంబాలకు సంక్షేమ పథకాలు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**జడ్చర్ల, జూన్ 6 (జనం సాక్షి):** "కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదు" అని ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ నేతలు ప్రచారం చేశారు. కానీ, మేం నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయడమే కాక, మిగులు విద్యుత్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో రూ. 108 కోట్ల వ్యయంతో 16, 33/11 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం, నవాబుపేటలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం మాట్లాడారు.

ఇందిరమ్మ ప్రభుత్వంలో తెలంగాణలో ఉత్పత్తి, ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగైనట్లు ఆయన తెలిపారు. మార్చి 2023లో టీఆర్‌ఎస్ పాలనలో విద్యుత్ డిమాండ్ 15,497 మెగావాట్లుగా ఉండగా, మార్చి 2025 నాటికి కాంగ్రెస్ పాలనలో పీక్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరింది. 2,000 మెగావాట్ల డిమాండ్ పెరిగినప్పటికీ, రెప్పపాటు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసినట్లు వివరించారు. 2035 నాటికి విద్యుత్ డిమాండ్ 33,775 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేసి, దానికి తగ్గట్టుగా ఉత్పత్తి, సరఫరా ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు.

సమృద్ధ విద్యుత్ సరఫరా కారణంగా ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు తెలంగాణకు ఆకర్షితులవుతున్నారని, వారికి అవసరమైన విద్యుత్‌ను అందిస్తామని, ప్రపంచంతో పోటీపడతామని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. "తెలంగాణ రైసింగ్‌ను కుట్రదారులు ఆపలేరు. ప్రజా ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సాధ్యమవుతాయి" అని పేర్కొన్నారు. రాష్ట్రంలో 90 లక్షల కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఈ సంక్షేమాన్ని చూడలేని కొందరు సోషల్ మీడియా ద్వారా అడ్డుపడే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. "ప్రజలకు మేలు జరగకూడదని, గత పాలకులు దోపిడీ చేసినట్లే చేయాలని కొందరు భావిస్తున్నారు.

కానీ, మా పాలన ప్రజల కోసమే" అని ధైర్యంగా చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆయన వివరించారు. ఒక ఇంట్లో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఒక్కొక్కరికి 6 కేజీల సన్న బియ్యం (దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పథకం లేదు), ఉపాధి కోసం పని, విద్యార్థులకు 40% డైట్ చార్జీల పెంపు, ఉన్నత చదువులకు ఫీజు రియంబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, ప్రభుత్వ ఉద్యోగాలు రానివారికి రాజీవ్ యువ వికాసం కింద స్వయం ఉపాధి, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా కింద రూ.12,000, భూమిలేని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12,000, ఇల్లు లేనివారికి రూ.5 లక్షలు, వృద్ధులు, వితంతువులకు నెలవారీ పెన్షన్లు అందిస్తున్నట్లు తెలిపారు.

గత ఎన్నికల ముందు పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ఉద్దండపూర్ రిజర్వాయర్ కింద భూమి కోల్పోయిన రైతులకు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చామని, ఆ మేరకు రూ.70 కోట్లు విడుదల చేసినట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. "మాట ఇచ్చిన పని చేసే పార్టీ కాంగ్రెస్" అని అన్నారు. జూరాల నుంచి శ్రీశైలం వరకు చేపట్టిన ప్రాజెక్టులు కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమయ్యాయని, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పాలమూరు ప్రాజెక్టు కింద ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ నేతలు "కాంగ్రెస్ ప్రజలను కష్టపెడుతుంది" అని కన్నీరు కారుస్తున్నారని, కానీ ఈ ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తుందని ధీమాగా చెప్పారు.

సభలో ఎమ్మెల్యేలు జనంపల్లి అనిరుద్ రెడ్డి, వాకిటి శ్రీహరి, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి, పర్ణిక రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎస్పీ జానకి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ పర్యావరణహిత గని పురస్కారం అందుకున్న ఓసిపి-1



**గోదావరిఖని(రామగిరి), జనంసాక్షి :**

2024-25 సంవత్సరానికి గాను రామగుండం-3 ఏరియాలోని ఓసిపి-1 ఉపరితల గని సింగరేణి సంస్థలో ఉత్తమ పర్యావరణహిత (ఎకో ఫ్రెండ్లీ) గని పురస్కారానికి ఎంపికైంది. ఈ పురస్కారాన్ని గురువారం కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలలో డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ,డైరెక్టర్ (ప్లానింగ్,ప్రాజెక్ట్స్ అండ్ పా) కొప్పుల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా గని తరఫున ఓసిపి-1 పర్యావరణ అధికారి కె.కిషన్ అందుకున్నారు. దీనిని పురస్కరించుకొని జి.యం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇట్టి పురస్కారాన్ని ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, ఏరియా పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి,కె.కిషన్ రామగుండం-3,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావుకు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జి.యం మాట్లాడుతూ ఓసిపి-1 ఉత్తమ పర్యావరణహిత (ఎకో ఫ్రెండ్లీ) గని పురస్కారం సాధించినందుకు అధికారులకు, ఉద్యోగులకు,కార్మిక సంఘాల నాయకులకు,కాంట్రాక్ట్ ఉద్యోగులకు,ఈ పురస్కారం సాధించడంలో ప్రత్యక్షంగా,పరోక్షంగా భాగస్వాములైన ప్రతీ ఒక్కరికి అభినందనలు,శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎ ఇంచార్జ్ ఎస్వోటుజియం బి.వి.సత్యనారాయణ, మేనేజర్ రమేష్, అధికారి కోల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# అరుదైన శస్త్ర చికిత్స ఆరు కిలోల కణతి తొలగింపు

- శస్త్ర చికిత్స నిర్వహించిన డా"రజనీకాంత్, డా"అపూర్వ, డా"ప్రీతి
- అభినందించిన ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ కాశీనాథ్





**ముధోల్, జూన్ 6 (జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా పైసా డివిజన్ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స చేసి అందరిని అబ్బురపరిచారు ముధోల్ మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన చిన్నమ్మ (58) అనే మహిళ తీవ్రమైన కడుపునొప్పితో అస్వస్థ గురై ఆ మహిళ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ బైంసా ఏరియా ఆసుపత్రిలో చేరారు. అనంతరం డాక్టర్లు ఆమెను పరిశీలించగా కడుపులో ఆరు కిలోల కణతి ఉందని వైద్య పరీక్షల ద్వారా గుర్తించారని అట్టి మహిళకు శ్వాస తీసుకోవడంలో తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ కుటుంబ సభ్యులు ఆ మహిళను మూడు రోజుల క్రితం భైంసా ఏరియా ఆసుపత్రిలో ఇన్ పేషెంట్గా చేర్పించారు సదరు మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వైద్యాధికారుల బృందం బాధితమైన కడుపులో నుంచి ఆరు కిలోల బరువున్న కణతిని గుర్తించి తొలగించారు సుమారు రెండు గంటల పాటు నిర్వహించారని వైద్యాధికారుల బృందం డాక్టర్ రజనీకాంత్ డాక్టర్ అపూర్వ డాక్టర్ ప్రీతి తెలిపారు. ఈ శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు బాధిత మహిళ త్వరలోనే కోలుకొని ఆరోగ్యంగా డిశ్చార్జ్ అవుతుందని వైజాగ్ బృందం తెలిపారు. అరుదైన శత చికిత్స నిర్వహించిన వైద్య బృందానికి ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ కాశీనాథ్ వారిని అభినందించారు.

# భూ సమస్యలపై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి






**జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**

**రాయికల్ జూన్6( జనం సాక్షి):** రాయికల్ మండలం వీరా పూర్ ధావన్ పల్లి మరియు మల్లాపూర్ మండల్ సాతారం గ్రామాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను సందర్శించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించిన. జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ...రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తి చేసే పరిష్కరించాలని అధికారులకు సూచించారు వచ్చిన దరఖాస్తులలో విచారణ పూర్తయిన వాటిని వెంటనే ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు వాటి పూర్తి వివరాలు తీసుకోవాలని, భూ భారతి చట్ట ప్రకారం వాటి పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మెట్పల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్ శ్రీనివాస్ రాయికల్ తహసిల్దార్ నాగార్జున. మల్లాపూర్ తహసిల్దార్ రమేష్. మరియు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలను ఆధునికరించాలి

**హైదరాబాద్, జూన్ 6 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కార్పొరేషన్ డివిజన్ వార్డు తహసిల్ పౌర సరఫరాల మొదలగు ప్రాథమిక పరిపాలన కార్యాలయాలు చాలావరకు అధ్వాన్న స్థితిలో ఉన్నవి ఈ భవనాలను శుభ్ర పరచక పోవడం వలన అత్యంత భయంకర దృశ్యం గా కనిపిస్తుంటాయి సున్నము రంగులు వేసినట్టు కనిపించడం లేదు కిటికీలు తలుపులు మరీ దారుణంగా ఉంటున్నవి మలమూత్ర శాలలు అధ్వాన స్థితిలో ఉన్నవి కొన్ని కార్యాలయాలు పై అంతస్తులో ఉండడం వలన స్త్రీలు వయోధికులు మెట్ల మార్గం నుండి పోవడం గగనంగా మారుతున్నది కార్యాలయాల ఫర్నిచర్ ఇక్ష్వాకుల కాలం నాటివి ఇంకా ఉపయోగిస్తున్నారు ఫైల్స్ భద్రపరచడానికి సరియైన వ్యవస్థ లేదు కంప్యూటర్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు ఉపయోగించే కేబుల్స్ కరెంటు వైర్లు వేలాడుతుంటాయి ప్రభుత్వాలకు ప్రజలకు ప్రధాన వారదులైన ఈ కేంద్రాల ఆలనా పాలన పట్టించుకోకపోవడం శోచనీయమైన విషయం హైదరాబాద్ అంటే హైటెక్ సిటీ ఫైనాన్స్ డిస్ట్రిక్ట్ భవనాలను చూపించి మురిసిపోతూ అంతర్జాతీయ స్థాయికి ఎదిగినాదని ప్రపంచ పటంలో పెట్టినామని జబ్బులు చర్చుకుంటున్నాము ప్రభుత్వాలు ఏదైనా పథకం ప్రారంభించాలన్న ఈ కార్యాలయాల ద్వారానే ప్రజలలోకి వెళుతుంటవి నగర ప్రజలకు జనన మరణ రేషన్ కార్డు కుల ఆదాయం పత్రాలు మొదలగు ప్రాథమిక వసతులు ఈ కార్యాలయాల ద్వారానే పొందవలసి ఉంటుంది గత ప్రభుత్వం రాష్ట్ర సచివాలయాన్ని జిల్లాలో కలెక్టర్ సమీకృత భవన సముదాయాలను అత్యాధునికముగా నిర్మించినారు కానీ నగరంలోని మౌలిక కేంద్రాలపైన దృష్టి పెట్టలేదు ఈరోజులలో ప్రతి మనిషి మనుగడకు అవసరమయ్యే ప్రాథమిక పత్రాలు అందిస్తున్న కార్యాలయాలను అత్యాధునిక సాంకేతిక వసతులతో విశాల భవనాలుగా తీర్చిదిద్ది ఇక్కడ లభించే సేవలను ఆకర్షవంతముగా సంతోషంగా పొందుటకు వీలు కల్పించాలి మంత్రులు సంబంధిత అధికారులు పథకాల రచనలకు అమలు కోసం సమావేశాలు సమీక్షలు ఈ కార్యాలయాలలోనే నిర్వహించినప్పుడే వీటికి తగిన ప్రాచుర్యత లభించి ప్రజలకు ప్రభుత్వానికి అత్యంత మేలు దాయకముగా ఉంటుంది

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే



**అల్వాల్, జూన్ 6(జనంసాక్షి):**

మల్కాజ్గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి లబ్ధిదారుల చేతికి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మచ్చబొల్లారం డివిజన్‌కు చెందిన స్వప్న రెడ్డికి రూ.8,500, నరేందర్‌కు రూ.60,000, లక్ష్మయ్యకు రూ.60,000, సుక్సేనకు రూ.25,000 చొప్పున ఆర్థిక సాయం లభించింది. అల్వాల్ డివిజన్‌కు చెందిన మల్లేష్, అనితకు చెరో రూ.60,000, వెంకటాపురం డివిజన్‌కు చెందిన విగ్నేశ్వర్‌కు రూ.60,000 మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, పవన్, ప్రశాంత్ రెడ్డి, రేవంత్ రెడ్డి, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

# టెక్స్టైల్ పార్క్ పవర్ లూమ్ కార్మికులకు రావలసిన యారన్ సబ్సిడీ వెంటనే అందించాలి

- కార్మికులకు నిరంతరం ఉపాధితో పాటు మెరుగైన వేతనాలు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలి
- సిఐటియు పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ



**తంగళ్ళపల్లి జూన్ 06(జనం సాక్షి) :**

తంగళ్ళపల్లి మండలం టెక్స్టైల్ పార్క్ లో పనిచేసే పవర్లూమ్ కార్మికులకు రావలసిన పది శాతం యారన్ సబ్సిడీ, నిరంతరం ఉపాధి, మెరుగైన వేతనం అందించాలని టెక్స్టైల్ పార్క్ పవర్ లూమ్ వర్కర్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో చేనేత జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ రావుకు వినతి పత్రం అందించారు. సిఐటియు పవర్లూమ్ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మాట్లాడుతూ 2023 బతుకమ్మ చీరల బ్లౌజ్ ఫీసు వస్త్రానికి సంబంధించి టెక్స్టైల్ పార్కులోని కార్మికులకు యారన్ సబ్సిడీ డబ్బులు అందించాలని అన్నారు. సిరిసిల్లలో కార్మికులకు రెండు విడుతలుగా బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు. కానీ టెక్స్టైల్ పార్క్ కార్మికులకు ఇప్పటివరకు సబ్సిడీ అందలేదని వెల్లడించారు. యాజమానులు కార్మికుల పట్ల అశ్రద్ధ వహించడం వల్ల యారన్ సబ్సిడీ అందడం లేదని ఇప్పటికైనా యాజమానులు కార్మికులకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించాలని అన్నారు. టెక్స్టైల్ పార్క్ అనేది కార్మికులకు నిరంతరం ఉపాధి, మెరుగైన వేతనం అందించేందుకు నిర్మించబడిందని పేర్కొన్నారు. రాను రాను టెక్స్టైల్ పార్క్ లో పరిశ్రమలు మూతపడి కార్మికులకు ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యారన్ సబ్సిడీలో కూలి తగ్గించి ఇవ్వకుండా గతంలో ఇచ్చిన విధంగా ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. లేదంటే కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టెక్స్టైల్ పార్క్ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కూచన్న శంకర్ మామిడాల శ్రీనివాస్ రాచర్ల వేణు పులి రమేష్ కందికట్ల శ్రీనివాస్ వెంకటేష్ కార్మికులు పాల్గొన్నారు.

# ఆసుపత్రులలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం-2010 నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

**ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ రూరల్,జూన్ 6(జనం సాక్షి) :** ప్రభుత్వ,ప్రైవేటు ఆసుపత్రులలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం-2010 నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్(రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్)చట్టం- 2010,మహిళా శిశు రక్షణ చట్టాల అమలు పర్యవేక్షణ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మహిళా శిశు రక్షణ చట్టాల అమలులో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. ఆస్పత్రులలో రోగుల నుండి అధిక చార్జీలు వసూలు చేయకూడదని,ప్రతి ఆసుపత్రిలో రేట్ చార్జును రిసెప్షన్ వద్ద స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. ప్రతి ఆస్పత్రిలో కనీస ప్రమాణాలు పాటించాలని, బయో మెడికల్ వేస్ట్‌ని సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు వైద్య సంస్థలు స్కానింగ్ సెంటర్లు, డయాగ్నొస్టిక్ ల్యాబ్‌లు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం కింద నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. పిసిఅండ్‌పిఎన్‌డిటి చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ లింగ నిర్ధారణకు పాల్పడే వారిపై దృష్టి సారిస్తూ ప్రత్యేక నిఘా పెట్టానని సూచించారు. సంబంధిత చర్యలకు పాల్పడే వారిపై ఫిర్యాదులు చేసేందుకు ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 73374 48722ను సంప్రదించాలని సూచించారు. అనంతరం పిసిఅండ్ పిఎన్‌డిటి చట్టం,అమ్మ రక్ష పోస్టర్లను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్ సింగ్, వైద్యులు సునీల్ రాథోడ్, సురేష్ ,సరోజ, ప్రైవేట్ వైద్య సంస్థల ప్రతినిధులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, ల్యాబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



# "కీర్తి మెడికల్స్ 25వ బ్రాంచ్‌ను" కరీంనగర్‌లో ప్రారంభం

**కరీంనగర్ బ్యూరో, జూన్ 06 (జనంసాక్షి) :**

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సక్సెస్ సాధించిన కీర్తి మెడికల్స్ తమ 25వ బ్రాంచ్ ను కరీంనగర్‌లో శుక్రవారం రోజు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్, సూడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ఐఎమ్ఎ ప్రెసిడెంట్ డాక్టర్ ఎనమల నరేష్ లు ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం కీర్తి మెడికల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తిరుపతి రెడ్డి అతిథులకు పుష్ప గుచ్ఛం తో స్వాగతం పలికి వారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ... కరీంనగర్ ప్రజలకు కీర్తి మెడికల్స్ 24 గంటలు సర్వీస్ అందుబాటులో ఉంటుందని, 30 వేల రకాల మెడిసిన్స్ కీర్తి మెడికల్స్‌లో ఉన్నాయని, ప్రముఖ కంపెనీల మెడిసిన్స్ హోల్సేల్ ధరలలో అందుబాటులో ఉండడం సంతోషకారమన్నారు. జనరల్ మెడిసిన్స్, బేబీ కేర్, సర్జికల్ కు సంబందించిన మెడిసిన్స్ లు అన్ని కీర్తి మెడికల్స్‌లో లభిస్తాయన్నారు. ఇలాంటి అద్భుతమైన అవకాశాన్ని కరీంనగర్ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కీర్తి మెడికల్స్ మేనేజ్మెంట్, సిబ్బంది, నగర వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో జరిగిన
# డివిజన్ల పునర్విభజన ప్రక్రియ పై అభ్యంతరాలు

- బిఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసిన బిఆర్ఎస్ పార్టీ నేతలు



**కరీంనగర్ బ్యూరో, జూన్ 06 (జనంసాక్షి) :**

కరీంనగర్ నగరపాలక సంస్థలో ప్రకటించిన డివిజన్ల పునర్విభజన ప్రక్రియ పై అభ్యంతరాలు, తెలుపుతూ బిఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరి శంకర్ ఆధ్వర్యంలో కలెక్టర్ పమేల సత్పతిని కలిసి వినతిపత్రం అందజేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొత్తగా కలిసిన గ్రామ పంచాయతీలను కలుపుకొని ఏర్పడిన నగరంలోని డివిజన్ల పునర్విభజన లోపభుయిష్టంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉందని కలెక్టర్ కు విన్నవిస్తూ... మున్సిపల్ రెవిన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరులో లోపాలను వివరించారు. సంబంధిత ప్లానింగ్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించకుండా విభజనను భౌగోళిక నైసర్గిక స్వరూపంలో కాకుండా ఇంటి నెంబర్ల వారీగా కాగితాలపై విభజన ప్రక్రియ కొనసాగించారన్నారు. స్థానిక ప్రజల జీవన విధానాలపై ఎలాంటి అవగాహన లేకుండా ప్రజలు ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా విభజించడం కరీంనగర్ అస్తిత్వాన్ని విచ్ఛిన్నం చేసేదిగా ఉందన్నారు.

మౌలిక సదుపాయాల నిర్వహణ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, విద్యుదీపాల ఏర్పాటు, అభివృద్ధి పనుల తారతమ్యాలు తలెత్తి ప్రజలకు తరచూ ఇబ్బందులు ఉంటాయని విన్నవించారు. నగర పాలక సంస్థ ప్రకటించిన 66 డివిజన్లలో తెలిపిన ఇంటి నెంబర్లకు సంబంధించిన ఓటర్ల సంఖ్య పూర్తిగా అసంబద్ధంగా ఉందని ఆసలైన ఓటర్ల సంఖ్య సుమారు 3,35,592గా లెక్కలు చూపారన్నారు. డివిజన్ వైజ్‌గా చూపించిన ఓటర్ లిస్టులో చాలా తేడాలు ఉన్నాయని, ప్రతి డివిజన్లో ఐదువేల ఓటర్లు ఉండే విధంగా చూపించినారని కానీ కొన్ని డివిజన్లో 2000 నుండి 3000 మాత్రమే ఉన్నాయని, మరికొన్ని డివిజన్లో 7000 నుండి 8000 ఉన్నాయని ఇవి ఏవి పట్టించుకోకుండా మున్సిపల్ రెవెన్యూ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు వారి ఇష్టానుసారంగా డిలిమిటేషన్ ప్రక్రియ చేసినారు. ఇట్టి డీలిమిటేషన్ పై వెంటనే విచారణ జరిపించి తప్పుడు సమాచారంతో కరీంనగర్ నగరంలో ఉన్న ప్రజలను, నాయకులను ఆందోళనకు గురిచేసిన అధికారులపై చర్య తీసుకోవాలని తెలిపారు. సంబంధిత డివిజన్ల విభజన ప్రక్రియ చేపట్టడానికి ప్రభుత్వం నిబంధనల ప్రకారం 100 పీట్ల రోడ్డుకు ఇరువైపులా ఒకే డివిజన్ ఉండడం సరికాదని అయినా చాలా డివిజన్లో 100 ఫీట్ల రోడ్డుకు ఇరువైపులా ఒకే డివిజన్ వచ్చేలా అధికారులు ప్రక్రియ నిర్వహించారని ఇది నియమావళికి పూర్తిగా విరుద్ధమని కలెక్టర్ కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ ఇన్చార్జిలు, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మా నాన్నకు టెస్ట్ క్రికెట్ అంటేనే ఇష్టం

### రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్: తండ్రి నిరాశ



రోహిత్ శర్మ ఇంగ్లండ్ పర్యటనకు ముందు అనూహ్యంగా టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించడం అభిమానులతో పాటు క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ తర్వాత ఫామ్‌లో లేకపోయినప్పటికీ, రోహిత్ టెస్ట్ క్రికెట్‌ను కొనసాగించాలని భావించాడు. బీసీసీఐ సూచనల మేరకు రంజీ ట్రోఫీలోనూ ఆడాడు. అయినప్పటికీ, అతను సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ నిర్ణయం అభిమానులతో పాటు అతని తండ్రిని కూడా బాధపెట్టింది.

ముంబయిలో ఛతేశ్వర్ పుజారా భార్య పూజ రాసిన 'ది డైరీ ఆఫ్ క్రికెటర్స్ వైఫ్' పుస్తక ఆవిష్కరణ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ, తన తండ్రికి టెస్ట్ క్రికెట్‌పై ఉన్న ఇష్టాన్ని వెల్లడించాడు. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని తండ్రి మొదట అంగీకరించలేదని తెలిపాడు. "మా నాన్న ఒక ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేసేవారు. మా కోసం ఆయన ఎన్నో త్యాగాలు చేశారు. ఆయనకు టెస్ట్ క్రికెట్ అంటే అమితమైన ఇష్టం. నేను వన్డేలో 264 పరుగులు చేసినప్పుడు ఆయన నుంచి పెద్దగా ప్రశంసలు రాలేదు. కానీ టెస్ట్ క్రికెట్‌లో 30, 40, 50 పరుగులు చేసినప్పుడు ఆయన ఆ రన్స్ గురించి నాతో గంటల తరబడి మాట్లాడేవారు. టెస్ట్ క్రికెట్‌పై ఆయనకున్న ప్రేమ ఇందుకు నిదర్శనం. నా రిటైర్మెంట్ నిర్ణయం ఆయనకు మొదట నచ్చలేదు, కానీ తర్వాత ఆయన నా నిర్ణయాన్ని అర్థం చేసుకున్నారు," అని రోహిత్ వివరించాడు.



## బుమ్రా లేకపోయినా ధీమాగా భారత జట్టు

- బుమ్రా ఆడేది మూడు టెస్టులే
- బలమైన బౌలింగ్ లైనప్

గత రెండు నెలలుగా ఐపీఎల్–2025 హడావుడిలో ఆటగాళ్లు, కోచ్‌లు, అభిమానులు మునిగిపోయారు. ఐపీఎల్ ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి అంతర్జాతీయ క్రికెట్‌పైకి మళ్లింది. భారత జట్టు తదుపరి మ్యాచ్‌ల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సీజన్‌ను టెస్ట్ క్రికెట్‌తో ప్రారంభించనున్న టీమ్ ఇండియా, ఇంగ్లండ్ పర్యటనకు సిద్ధమవుతోంది. అక్కడ ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ వంటి సీనియర్ ఆటగాళ్ల రిటైర్మెంట్ తర్వాత, యువ ప్రతిభావంతులపై జట్టు ఆధారపడుతోంది. అయితే, స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా లభ్యత విషయంలోనే అసలు సమస్య తలెత్తింది. అతడు ఎన్ని మ్యాచ్‌లు ఆడతాడనేది స్పష్టంగా తెలియడం లేదు.

జట్టు ఎంపిక సమయంలో సెలెక్టర్లు బుమ్రా కేవలం మూడు టెస్టులు మాత్రమే ఆడతాడని స్పష్టం చేశారు, కానీ ఏ మూడు మ్యాచ్‌లనేది వెల్లడించలేదు. అయినప్పటికీ, హెడ్ కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ శుబ్‌మన్ గిల్ బుమ్రా లేకపోయినా జట్టు బలంగా ఉందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. బుమ్రా స్థానాన్ని భర్తీ చేయడం కష్టమైనా, జట్టు బౌలింగ్ యూనిట్‌లో నాణ్యత ఉందని వారు చెబుతున్నారు. దీంతో, బుమ్రా లేకుండానూ ప్రత్యర్థిని ఆలౌట్ చేసే సామర్థ్యం భారత బౌలర్లకు ఉందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇంగ్లండ్ సిరీస్ కోసం ఎంపికైన భారత జట్టులో బుమ్రా తప్ప, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్‌దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి బౌలర్లుగా ఉన్నారు. వీరిలో జడేజా, సుందర్, శార్దూల్, నితీష్ ఆల్‌రౌండర్లు, మిగిలినవారు స్పెషలిస్ట్ బౌలర్లు. సిరాజ్, జడేజా, శార్దూల్‌లకు ఇంగ్లండ్‌లో ఆడిన అనుభవం ఉంది.

సిరాజ్, శార్దూల్ ఇంగ్లీష్ పిచ్‌లపై అద్భుతంగా బౌలింగ్ చేసిన సందర్భాలు ఉన్నాయి. స్వింగ్, పేస్‌కు అనుకూలమైన ఇంగ్లీష్ పిచ్‌లపై అర్ష్‌దీప్, ఆకాశ్‌దీప్‌లు కూడా రాణించే అవకాశం ఉంది. ఇంగ్లండ్‌లో వేసవి కొనసాగుతుండటంతో, జడేజా, కుల్దీప్‌ల స్పిన్ బౌలింగ్ ప్రత్యర్థిని కట్టడి చేసే అవకాశం కనిపిస్తోంది. వైవిధ్యమైన బౌలర్లతో కూడిన ఈ జట్టు బలంగా ఉందని, బుమ్రా లేకపోయినా గంభీర్, గిల్ ధైర్యంగా ఉన్నారని నెటిజన్లు చర్చిస్తున్నారు.



## రిటైర్మెంట్ ప్రకటించిన పీయూష్ చావ్లా

భారత సీనియర్ లెగ్ స్పిన్నర్ పీయూష్ చావ్లా (36) శుక్రవారం అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించాడు. కుటుంబం, ఐపీఎల్ ఫ్రాంఛైజీలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపాడు. 2007 టీ20 వరల్డ్ కప్, 2011 వన్డే వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన చావ్లా, 3 టెస్టులు, 25 వన్డేలు, 7 టీ20లు ఆడాడు. వన్డేల్లో 4/23 అతని అత్యుత్తమ గణాంకాలు. అంతర్జాతీయ క్రికెట్‌లో అవకాశాలు తక్కువ వచ్చినా, దేశవాళీ, ఫ్రాంఛైజీ క్రికెట్‌లో తన ప్రతిభ చాటాడు. 446 ఫస్ట్ క్లాస్ వికెట్లు, 319 టీ20 వికెట్లు సాధించాడు. ఉత్తరప్రదేశ్ తరపున దేశవాళీ క్రికెట్ ఆడిన అతను, ఐపీఎల్‌లో వివిధ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 2012, 2014లో కోల్కతా నైట్ రైడర్స్‌తో ఐపీఎల్ టైటిళ్లు గెలిచాడు.

## హైకోర్టును ఆశ్రయించిన కర్ణాటక క్రికెట్ సంఘం

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద బుధవారం జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందడం దేశవ్యాప్తంగా షాక్‌కు గురి చేసింది. ఈ ఘటనపై నెటిజన్లు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఆర్‌సీబీ, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ , ఈవెంట్ మేనేజర్లపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తమపై దాఖలైన కేసును సవాల్ చేస్తూ కర్ణాటక కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. కర్ణాటక అధ్యక్షుడు రఘురామ్ భట్, కార్యదర్శి ఎ. శంకర్, కోశాధికారి ఈఎస్ జయరాం సంయుక్తంగా రిట్ పిటిషన్ దాఖలు చేసి, కేసును కొట్టివేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ రోజు మధ్యాహ్నం విచారణ జరగనున్నట్లు సమాచారం

## ఐపీఎల్ ముగిసినా ఆగని ఊచకోత

### 31 బంతుల్లో సూర్యకుమార్.. 42 పరుగులు



ఐపీఎల్–2025 ముగియడంతో ఆటగాళ్లంతా తదుపరి సిరీస్‌ల మీద దృష్టి సారిస్తున్నారు. కొందరు ఇంటర్నేషనల్ మ్యాచులతో బిజీ అయిపోతే.. మరికొందరు దేశవాళీ టోర్నీల కోసం సన్నద్ధం అవుతున్నారు. భారత టీ20 జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్ కూడా ఫుల్ బిజీ అయిపోయాడు. టీ20 ముంబై లీగ్–2025లో ట్రయంఫ్ నైట్స్ తరఫున రెచ్చిపోయి బ్యాటింగ్ చేస్తున్నాడు సూర్య భాయ్. క్యాష్ రిచ్ లీగ్ ఫామ్‌నే కొనసాగిస్తూ బౌలర్లను ఊచకోత కోస్తున్నాడు. ముంబై సౌత్ సెంట్రల్ మరాఠా రాయల్స్‌తో గురువారం జరిగిన పోరులో 31 బంతుల్లో 42 పరుగులు ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు మిస్టర్ 360. ఇందులో 2 బౌండరీలు, 3 భారీ సిక్సులు ఉన్నాయి. ఐపీఎల్‌లో ఎక్కడ ముగించాడో టీ20 ముంబై లీగ్‌లో అక్కడే ఊపందుకున్నాడు సూర్యకుమార్ యాదవ్. వరుసగా సునామీ ఇన్నింగ్స్‌లతో చెలరేగిపోతున్నాడు. మొత్తంగా గత 18 టీ20 ఇన్నింగ్స్‌లు చూసుకుంటే.. 29 (26), 48 (28), 27 నాటౌట్ (9), 67 (43), 28 (26), 40 (28), 26 (15), 68 నాటౌట్ (30), 40 నాటౌట్ (19), 54 (28), 48 నాటౌట్ (23), 35 (24), 73 నాటౌట్ (43), 57(39), 33(20), 44(26), 50 నాటౌట్ (27), 42(31).. ఇవీ స్కై బాదిన స్కోర్లు. దీన్ని బట్టే అతడు ఎంతటి భీకర ఫామ్‌లో ఉన్నాడో అర్థం చేసుకోవచ్చు. ఇది చూసిన నెటిజన్స్.. భారత టీ20 జట్టుకు ఇది సూపర్ న్యూస్ అని అంటున్నారు. పొట్టి ఫార్మాట్‌లో కెప్టెనే ఈ స్థాయిలో రాణిస్తే ఇక జట్టుకు తిరుగుండదని చెబుతున్నారు. సూర్య.. నీ బ్యాటింగ్‌కు సలామ్ అని కామెంట్స్ చేస్తున్నారు.

## రోహిత్ బాటలో గిల్..



ఐపీఎల్–2025 ముగియడంతో ఇప్పుడు అంతా టీమిండియా మ్యాచుల కోసం ఎదురు చూస్తున్నారు. భారత ఆటగాళ్లు బరిలోకి దిగి రెచ్చిపోయి ఆడుతుంటే చూడాలని అనుకుంటున్నారు. అయితే వాళ్ల కోరిక నెరవేరాలంటే జూన్ 20 వరకు ఆగక తప్పదు. ఎందుకంటే ఆ తేదీ నుంచే భారత్–ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్ షురూ అవుతుంది. 5 మ్యాచుల ఈ ప్రతిష్ఠాత్మక సిరీస్ కోసం లండన్ ఫ్లైట్ ఎక్కేసింది టీమిండియా. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ నయా సైకిల్ ఇదే సిరీస్‌తో మొదలవనుండటంతో సత్తా చాటాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో మెన్ ఇన్ బ్లూ కొత్త సారథి శుబ్‌మన్ గిల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ బాటలో తాను నడవాలని అనుకుంటున్నట్లు చెప్పాడు. ఇంకా గిల్ ఏమన్నాడంటే..

ప్రతి ప్లేయర్ అతడి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకునేలా చేయడమే తన పని అని గిల్ అన్నాడు. ఆటగాళ్లు న్యాచురల్ గేమ్‌తో అదరగొట్టేలా ప్రోత్సహిస్తానని చెప్పాడు. జట్టు సభ్యుల్లో భయాన్ని పోగొడతానని.. ఈ విషయంలో రోహిత్ శర్మను అనుసరిస్తానని గిల్ తెలిపాడు. హిట్‌మ్యాన్‌లాగే టీమ్ మెంబర్స్‌తో కలివిడిగా ఉంటూ సత్సంబంధాలు నెరుపుతానని చెప్పుకొచ్చాడు. ఇంగ్లండ్ అనే కాదు.. టీమిండియా ఆడే ప్రతి సిరీస్, ప్రతి పర్యటనలో ఒత్తిడి అధికంగా ఉంటుందని గిల్ స్పష్టం చేశాడు.

వాళ్లు లేకపోయినా..

'ప్రతి టూర్‌లో ఒత్తిడి అనేది తప్పకుండా ఉంటుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టీమిండియాకు ఎన్నో మ్యాచుల్లో ప్రాతినిధ్యం వహించారు. జట్టు బ్యాటింగ్‌కు మూలస్తంభంగా ఉంటూ వచ్చిన వీళ్లను భర్తీ చేయడం అంత సులువేం కాదు. వాళ్లు లేకపోయినా జట్టుపై అంతే స్థాయిలో ఒత్తిడి ఉంటుందని మాత్రం చెప్పగలను. ఇలాంటి ఒత్తిడి సమయాల్లో ఆడటం మాకు అలవాటు అయింది. విజయం కోసం ఏం చేయాలో మాకు తెలుసు' అని గిల్ చెప్పుకొచ్చాడు. అనుభవం వస్తున్న కొద్దీ సహచర ఆటగాళ్లను ఎలా కలుపుకొని పోవాలి, వాళ్లలో అభద్రతా భావాన్ని ఎలా పోగొట్టాలి.. అనే విషయాలు అర్థమయ్యాయని వివరించాడు. ఆటగాళ్లలో భయం పోతేనే 100 శాతం ఎఫర్ట్ పెట్టగలరని గిల్ వ్యాఖ్యానించాడు.

### కోహ్లీని అరెస్ట్ చేయాలంటూ హ్యాష్‌ట్యాగ్

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద బుధవారం జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతిచెందడం యావత్ జాతిని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ దుర్ఘటనపై నెటిజన్లు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఈ తొక్కిసలాట ఘటన ఆర్‌సీబీ మెడకు చుట్టుకుంటోంది. ఇప్పటికే ఈ ఘటనపై ఆర్‌సీబీ, కర్ణాకట క్రికెట్ సంఘం, ఈవెంట్ మేనేజర్లపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో ఆర్‌సీబీ జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ పేరు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. తొక్కిసలాటకు భాద్యుడిగా కోహ్లీని అరెస్ట్ చేయాలని సోషల్ మీడియాలో నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు #ArrestKohliని నెటిజన్లు విపరీతంగా ట్రెండ్ చేస్తున్నారు.

ఐపీఎల్–2025 ఫైనల్‌లో ఆర్సీబీ చేతుల్లో పంజాబ్ ఓడిన తర్వాత ఆర్జే మహ్వష్ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టింది. చాహల్ ఆటతీరు, అతడి సంకల్పం, గేమ్ మీద అతడికి ఉన్న దృక్పథం, గాయాలబెడద లాంటివి ఈ పోస్ట్‌లో ప్రస్తావించిందామె. 'ఆర్సీబీతో ఫైనల్ ఫైట్‌లో పంజాబ్ చివరి వరకు చాలా బలంగా పోరాడింది. చాహల్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాలి. ఈ టోర్నమెంట్‌లో ఆడిన రెండో మ్యాచ్‌లోనే చాహల్ పక్కటెముకలకు గాయమైంది. అనంతరం అతడి బౌలింగ్ చేసే వేలికి కూడా దెబ్బ తగిలింది. ఇక్కడితో అయిపోలేదు. ఆ తర్వాత మరో గాయం బారిన పడ్డాడు. ఇలా మూడు గాయాలతో సీజన్ మొత్తం ఆడుతూ వచ్చాడు. ఎక్కడా వెనుకంజ వేయకుండా నొప్పిని పంటి కింద భరిస్తూనే కొనసాగాడు. అతడు నిజమైన పోరాట యోధుడు' అని మహ్వష్ ఆ పోస్ట్‌లో రాసుకొచ్చింది.

## మహిళలకు సువర్ణావకాశం

- డ్రోన్ ఈవీ వెహికల్ మెకానిజంలో ఉచిత శిక్షణ
- 9 నుండి దరఖాస్తులు స్వీకరణ
- జిల్లా మహిళా ప్రాంగనాధికారిణి డాక్టర్ వేల్పుల విజేత



**ఖమ్మం (జనంసాక్షి) :** స్థానిక మహిళా ప్రాంగణంలో ఐటిఐ పూర్తి చేసిన మహిళా అభ్యర్ధులకు డ్రోన్ ట్రైనింగ్, ఈవీ వెహికల్ మెకానిజంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మహిళా ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత తెలిపారు. ఆసక్తి కల ఐటిఐ పూర్తి చేసిన మహిళ అభ్యర్థులు తమ దరఖాస్తు ఫారాలను ఈ నెల 9 నుండి 12 వ తేదీ లోగా మహిళా ప్రాంగణం కార్యాలయం, టేకుల పల్లి, ఖమ్మం నందు సమర్పించాలని కోరారు. అప్లికేషన్ తో పాటు విద్యార్హత– ఐటిఐ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్ కార్డు, మూడు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోస్ జతపరచాలని ఆమె సూచించారు. జిల్లా కలెక్టర్ అనుమతితో, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటిఐ, ఖమ్మం వారి సహకారంతో ఈ వినూత్న ట్రైనింగ్ లను ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ కాలవ్యవధి నెల రోజులు ఉంటుందన్నారు. ప్రతి ట్రేడ్ లో 30 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## యంగ్ లీడర్స్ ప్రోగ్రాం నిర్వహించిన లీడ్ గ్రూప్

**ఖైరతాబాద్, జూన్ 06 (జనం సాక్షి) :** లీడ్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన తన యంగ్ లీడర్స్ ప్రోగ్రాం(వైఎల్‌పీ) విజయవంతంగా ముగిసిందని లీడ్ గ్రూప్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు సుమీత్ మెహతా, స్మితా దేవ్‌రాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం వైఎల్‌పీ 14 రాష్ట్రాల నుంచి 53 మంది ఏడో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే అసాధారణ విద్యార్థులను కలిపిందని పేర్కొన్నారు. చిన్నవయసులోనే వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించే అవకాశం యంగ్ లీడర్స్ ప్రోగ్రాం కల్పించిందని తెలిపారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల పరస్పర సమన్వయంతో విద్యలో సవాళ్లను అధిగమించడానికి పరిశ్రమ నిపుణులతోనూ చర్చలు జరిపారని తెలిపారు.

## ఆదాయం మీద ఉన్న చిత్తశుద్ధి కోడేలపై లేదు

### భాజపా రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 6 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వానికి ఆలయ ఆదాయంపై ఉన్న చిత్తశుద్ధి గోశాలలోని కోడేలపై లేదని భాజపా రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణ బిజెపి శాఖ ఆధ్వర్యంలో తిప్పాపురం గోశాలను పరిశీలించారు. అనంతరం ఆయన గోశాలలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం మీద ఉన్న చిత్తశుద్ధి కోడెల సంరక్షణ మీద లేకపోవడం బాధాకరమన్నారు. గోశాలలో కోడెల పరిస్థితులు చూస్తే హృదయం చలించిపోతుందన్నారు. గోశాల్లో గత వారం రోజుల నుండి ప్రతిరోజు కోడేలు చనిపోతున్నప్పటికీ ఆలయ అధికారులు వాటిపై ప్రత్యేక దృష్టి సారించడం లేదన్నారు. గోశాలలో పరిమితికి మించి ఉన్న కోడెలకు సరియైన దాన పెట్టకపోవడం,చిన్న ,పెద్ద కోడెలను ఒకే దాంట్లో పెట్టడం కూడా కోడేలు తొక్కిసలాటలో మరణిస్తున్నాయన్నారు. వారం రోజుల్లో గోశాలలో పరిస్థితులను చకదిద్దకపోతే పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.ఆయన వెంట రాష్ట్ర ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్, వివేక్ రెడ్డి, కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.






## చిన్నారుల కళ్లలో ఆనందమే లక్ష్యం

- 2 వందల మంది రక్తదానం చేయడం హర్షణీయం
- పుట్టినరోజు పిలుపుతో వందల మంది రక్తమివ్వడం గర్వకారణం
- ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు
- శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి

**ఖమ్మం టౌన్ (జనంసాక్షి) :** తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కళ్లలో ఆనందాన్ని చూడటమే లక్ష్యంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు "శ్రీ బాలాజీ ఎస్టేట్స్" అధినేత వాత్సవాయి రవి అభిప్రాయపడ్డారు. రవి జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అండ్ కన్స్ట్రక్షన్స్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. "సంకల్ప" స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో చేపట్టిన ఈ శిబిరంలో 2 వందల మంది శ్రీ బాలాజీ ఎస్టేట్స్ మార్కెటింగ్ సిబ్బంది, ఉద్యోగులు, అభిమానులు తరలి వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వత్సవాయి రవి మాట్లాడుతూ తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఇచ్చిన ఒకే ఒక్క పిలుపును అందుకుని వందలాది మంది రక్తదానం చేయడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. ఇది హర్షించదగిన పరిణామమన్నారు. తలసేమియా వ్యాధితో ఎంతో మంది చిన్నారులు నిత్యం నెత్తుటి యుద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. బాల్యంలోనే పసిపిల్లలు బలిపీఠం ఎక్కు కూడదని సంకల్పంతోనే ఈ గొప్ప కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.అలాంటి పిల్లలకు రక్తం ఇచ్చి కాపాడటం మనందరి కర్తవ్యంగా భావించాలని తెలిపారు. అందుకే తన జన్మదిన వేడుకల్లో ఆడంబరాలకు బదులుగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయాలని భావించినట్లు స్పష్టం చేశారు. "సంకల్ప" స్వచ్ఛంద సంస్థ సహకారంతో చేపట్టిన ఈ రక్తదాన శిబిరానికి వందలాదిగా తరలిరావడం శుభ పరిణామం అన్నారు. ఆపదలో ఉన్న వ్యక్తులను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా తల సేమియా పిల్లలకు రక్తం ఎక్కించడంతో పాటు మెడిసిన్స్ అవసరం కూడా అధికంగా ఉంటుందని బావించి శ్రీ బాలాజీ ఫౌండేషన్ తరపున 2 లక్షల రూపాయలు విరాళంగా చెక్కు రూపంలో ఇవ్వడం జరిగిందన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. అనంతరం వత్సవాయి రవి జన్మదినాన్ని పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ చేసి అందరికీ మిఠాయిలు పంచారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అండ్ కన్స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ వత్సవాయి రేణుక రవి, కొనిజర్ల మాజీ ఎంపీపీ గోసు మధు, ప్రధాన కార్యాలయం ఇన్ చార్జ్ పోగుల రవికుమార్, సంకల్ప స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అనిత, రవి కుమార్, డాక్టర్ నారాయణ మూర్తి, కార్యాలయం సిబ్బంది, మార్కెటింగ్ సిబ్బంది, సంకల్ప ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## వరిధాన్యం కొనుగోళ్లలో మంథని పీఏసిఎస్ రికార్డ్ బ్రేక్

- జిల్లాలోనే గత ఐదేళ్లలో మంథని పీఏసిఎస్ ద్వారా అత్యధికంగా ధాన్యం కొనుగోళ్లు
- ఈసారి 4.26లక్షల క్వింటాళ్ల వరి ధాన్యం సేకరణ
- అన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి
- మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లాలో మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వరి ధాన్యం కొనుగోళ్లలో సరికొత్త రికార్డు సృష్టించింది. గత ఐదేళ్లలో జిల్లాలో అత్యధికంగా 4,26,860 క్వింటాళ్ల వరి ధాన్యం సేకరించి, గత రికార్డులను బద్దలు కొట్టింది. 35 కొనుగోలు కేంద్రాల ద్వారా ఈ రబీ సీజన్‌లో కొనుగోళ్లను విజయవంతంగా పూర్తి చేసింది. మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో రైతులను దళారుల ఒత్తిడి నుంచి కాపాడేందుకు గ్రామగ్రామాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో రైతుల ముంగిట్లోనే కల్లాలను ఏర్పాటు చేసి, పక్కా ప్రణాళికతో కొనుగోళ్లు నిర్వహించామన్నారు. రైస్ మిల్లర్లు గతంలో క్వింటాళ్ళకు 2–3 కిలోల కోత విధించగా, ఈసారి మంత్రి శ్రీధర్ బాబు చొరవతో ఒక్క గింజ కోత కూడా లేకుండా చూశామన్నారు.

**గత ఐదేళ్లలో మంథని పీఏసిఎస్ రికార్డులు:**

- రబీ 2021: 32 కేంద్రాలు, 4,414 మంది రైతుల నుంచి 3,64,031 క్వింటాళ్ళు, రూ.68.70 కోట్ల వ్యాపారం.
- ఖరీఫ్ 2021–22: 32 కేంద్రాలు, 4,844 మంది రైతుల నుంచి 3,19,879 క్వింటాళ్ళు, రూ.62.31 కోట్ల వ్యాపారం.
- రబీ 2022: 32 కేంద్రాలు, 2,649 మంది రైతుల నుంచి 1,79,476 క్వింటాళ్ళు, రూ.35.17 కోట్ల వ్యాపారం.
- ఖరీఫ్ 2022–23: 34 కేంద్రాలు, 5,009 మంది రైతుల నుంచి 3,48,044 క్వింటాళ్ళు, రూ.71.34 కోట్ల వ్యాపారం.
- రబీ 2023: 33 కేంద్రాలు, 3,820 మంది రైతుల నుంచి 3,63,360 క్వింటాళ్ళు, రూ.74.28 కోట్ల వ్యాపారం.
- ఖరీఫ్ 2023–24: 33 కేంద్రాలు, 3,117 మంది రైతుల నుంచి 2,28,932 క్వింటాళ్ళు, రూ.46.97 కోట్ల వ్యాపారం.
- రబీ 2024: 37 కేంద్రాలు, 5,109 మంది రైతుల నుంచి 3,68,248 క్వింటాళ్ళు, రూ.75.40 కోట్ల వ్యాపారం.
- ఖరీఫ్ 2024–25: 35 కేంద్రాలు, 5,216 మంది రైతుల నుంచి 3,69,823 క్వింటాళ్ళు, రూ.85.13 కోట్ల వ్యాపారం.
- రబీ 2025: 35 కేంద్రాలు, 5,148 మంది రైతుల నుంచి 4,26,860 క్వింటాళ్ళు, రూ.98.46 కోట్ల వ్యాపారం.

ఈ విజయానికి సహకరించిన మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, పౌర సరఫరాల శాఖ డిఎం, డిసిఎస్ఓ, జిల్లా మార్కెటింగ్ అధికారి, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.నరేష్, రెవెన్యూ, వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులు, సంఘ పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, రైతులు, హమాలీలు, సంఘ సిబ్బందికి చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
7 జూన్ 2025

# రెహమాన్‌పై కేసు ఎత్తివేయాలి

## జిల్లాల్లో గళమెత్తిన జర్నలిస్టులు

• అక్రమ కేసు అన్యామని ఉద్ఘాటన • కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేత

జనంసాక్షి దినపత్రిక ఎడిటర్ ఎంఎం రెహమాన్‌పై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులోకం నినదించింది. జిల్లాల్లో జర్నలిస్టులు కలెక్టర్లకు, స్థానిక అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేసు ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జనంసాక్షిలో పెద్దధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీపై ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలని, బాధితుల పక్షాన జనంసాక్షి గొంతుకై నిలబడిందని జర్నలిస్టులు ఉద్ఘాటించారు. ప్రజాందోళనలో జనంసాక్షి ఎడిటర్ రెహమాన్ లేకున్నా కేసులు బనాయించడం అన్యాయమని, ఆయనపై పెట్టిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

*- జనంసాక్షి, విలేకరుల యంత్రాంగం*



జనంసాక్షి ఎడిటర్ రెహమాన్‌పై కేసును ఎత్తివేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు కు వినతి పత్రం అందజేస్తున్న జోగులాంబ గద్వాల్ జిల్లా టీయూడబ్ల్యూజే 143 సంఘం నాయకులు, సభ్యులు, జర్నలిస్టులు



ముస్తాబాద్‌లో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు



జనంసాక్షి ఎడిటర్ రహమాన్‌పై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా జనంసాక్షి విలేకరులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

### రెహమాన్‌పై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలి

**తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు పల్లె రవి కుమార్ గౌడ్**



కాలుష్యాన్ని వెదజల్లుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతాంగం తిరగబడితే, జరిగిన పోరాటంలో జరిగిన సంఘటన లకు బాధ్యుడిగా జనం సాక్షి పత్రిక సంపాదకుడు రెహమాన్ పై అక్రమ కేసు బనాయించడమేమిటని తెలంగాణ జర్నలిస్టుల ఫోరం(టీజేఎఫ్) అధ్యక్షుడు పల్లె రవి కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ ప్రశ్నించేవారి గొంతునొక్కడమేనని అన్నారు. బాధ్యతాయుతమైన పత్రిక ఎడిటర్ పై అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని విమర్శించారు. ప్రజలతో పాటు ఆందోళనలో పాల్గొనకపోయినప్పటికీ, ఆ వార్తలు ప్రచురించినందుకు జర్నలిస్టు రెహమాన్ ను ప్రధాన నిందితుల్లో చేర్చడం దుర్మార్గమన్నారు. పర్యావరణానికి, జల కాలుష్యానికి కారణమవుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, యాజమాన్యం ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు పై సమగ్ర విచారణ జరిపించి సంపాదకుడు రెహమాన్‌పై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలన్నారు.



జడ్చర్ల తాహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ తిరుపతయ్యకు వినతిపత్రం అందజేస్తున్న జడ్చర్ల జర్నలిస్టులు



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన



వనపర్తి రాజీవ్ చౌక్‌లో రెహమాన్ పై పోలీసులు అక్రమ కేసు నమోదుపై యూనియన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన



మహబూబాబాద్ జిల్లా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) జిల్లా కన్వీనర్ గుట్టయ్య ఆధ్వర్యంలో నిరసన



జోగులాంబ గద్వాలలో వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు



ఖమ్మంలో జర్నలిస్టుల నిరసన

### పత్రికా స్వేచ్ఛను హరిస్తే సహించేది లేదు

• **సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్**



**చేర్యాల (జనంసాక్షి) :** జనంసాక్షి పత్రికా ఎడిటర్ రహమాన్ పై అక్రమంగా కేసు నమోదు చేయయడం అప్రజాస్వామికమని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జోగులాంబ గద్వాల జిల్లాలోని రాజోలు మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపడితే ఒక పత్రిక ఎడిటర్ గా ప్రజా సమస్యలను పత్రికలో కవరేజీ చేస్తే సీనియర్ జర్నలిస్టు రెహమాన్ ను ఏ2 గా చేర్చి అక్రమ కేసులు పెట్టడం అప్రజాస్వామికమని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేస్తున్న జర్నలిస్టులపై కేసులు పెట్టడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనన్నారు. ఘటనకు ఎలాంటి సంబంధం లేని రహమాన్ పై అక్రమంగా పెట్టిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జర్నలిస్టులకు మద్దతుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.

## రాజకీయ ప్రేరేపిత కుట్రతోనే ధర్నా

• హరీష్ ది స్వార్థ రాజకీయం
• ఏఐసిసి సభ్యులు సంపత్ కుమార్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాజకీయ ప్రేరేపిత కుట్రతో ధర్నాకు పూనుకున్నారని, స్థానిక ప్రజల బాగోగులు పట్టించుకోకుండా హరీష్ రావు స్వార్థ కోసం వాడుకోవాలని చూస్తున్నారని ఏఐసిసి సభ్యులు సంపత్ కుమార్ అన్నారు. గాంధీభవన్‌లో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనుభవజ్ఞుడు అయినా హరీశ్ దిగజారి ప్రవర్తిస్తున్నారని, శవాలపై పేలాలు ఏరుకునే రకం హరీష్ రావు అని, విత్తనాల ఫ్యాక్టరీ పై హరీష్ రావు పచ్చి అబద్ధాలు మాట్లాడారని దుయ్యబట్టారు. హరీష్ రావు వ్యాఖ్యల పట్ల ప్రజలు చీదరించుకుంటున్నారని, ఫ్యాక్టరీ పై మాకు కానీ సీఎం రేవంత్ కానీ ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. 50 కోట్లకి మించి ఏర్పాటు చేసే ఏ ఫ్యాక్టరీ అయిన కేంద్రం నుంచి అనుమతులు కావాలని, ఎన్విరాన్మెంట్ ,పర్యావరణ కాలుష్యము బోర్డు నుంచి అనుమతులు తీసుకున్నారని, స్థానికంగా బిజెపి ఎంపీగా ఉన్న విషయం హరీష్ కి తెలియదా? అని ప్రశ్నించారు. పదేళ్ల బిఆర్ఎస్ చేసిన పాపాలని కడగటానికి కాంగ్రెస్ పూనుకుందని, రేవంత్ ఇంట్లో మొలిచిన ముల్లును సంపత్ కుమార్ ఇక్కడి తెచ్చి వేశాడని బట్ట కాల్చి మీద వేస్తున్నారని, స్థానిక ప్రజల జీవితాలతో బిఆర్ ఎస్ నేతలు చెలగాటం ఆడుతున్నారని అన్నారు. స్థానిక వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి మంత్రి శ్రీధర్ బాబు గారు, అధికారులు ప్రజాభిప్రాయం తీసుకున్నారని, సాంకేతిక పరిజ్ఞాన నిపుణాలతో చర్చించి ముందుకు వెళు తున్నామన్నారు. ఒక్క సెంటు భూమి కూడా ప్రభుత్వం తీసుకోలేదని, చిలువలు పలువలు చేసి బద్నాం చేసే కుట్ర జరుగుతోందని, రికార్డులు మాయం చేసిన ఘనుడు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని తెలిపారు. బిఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలు విత్తనాల కంపెనీ వాళ్ళతో వేల కోట్లు డిమాండ్ చేసి...ఇవ్వకపోవడంతో ధర్నా పేరిట డ్రామా చేశారని తెలిపారు.

## పత్తి సాగుకే రైతుల మొగ్గు

• సోయాతో నష్టాలు తప్పవన్న భయం



**ఆదిలాబాద్, జూన్6 (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాలో ఏటా పత్తి సాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది పత్తి పంట సాగు వైపే రైతులు మళ్లీ పరుగులు తీస్తున్నారు. గత అనుభవంతోనే ఈసారి పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు అధికంగా ఆసక్తి చూపుతున్నారు.వర్షాధార పంటగా సాగయ్యే పత్తికి జిల్లా వాతావరణం అనుకూలంగా ఉండడంతో పాటు నల్లరేగడి భూముల్లో అధిక దిగుబడులు రావడమే అసలు కారణమని రైతులు చెబుతున్నారు. అధికారులు మాత్రం మిశ్రమ పంటలను సాగు చేస్తేనే మంచి ఫలితా లు వస్తాయని సూచిస్తున్నారు. రైతులు స్వయంగా పత్తి పంటను సాగు చేసిన అనుభవంతోనే ముందుకు సాగుతున్నారు. తొలకరి వర్షాలకే పత్తి పంటను విత్తుతే చీడ పీడల నుంచి తట్టుకుని అధిక దిగుబడులు వస్తాయని పేర్కొంటున్నారు. వాణిజ్య పంటగా పత్తి పంటతో అప్పులు తీరే అవకాశం ఉందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా సంప్రదాయ పంటల సాగుతో రైతులకు భారీ నష్టాలు వస్తున్నాయని భావించిన ప్రభుత్వం గత ఏడాది నుంచి పత్తి పంట సాగును ప్రోత్సహిస్తూ వస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ పంటలైన సోయా, కంది పంటల సాగు తగ్గుతూ వస్తోంది. పంట చేతికి వచ్చే సమయంలో సోయా, కంది పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతూ లబోదిబో మంటున్నారు. ఇలాంటి పరిస్థితు ల్లో ఈ ఏడాది పత్తి పంటనే సా గు చేసేందుకు జిల్లా రైతులు అ ధికంగా ఆసక్తి చూపుతున్నారు. అయితే అధికారులు భావిస్తున్నట్లుగా మిశ్రమ పంటల సాగు విస్తీర్ణం తగ్గి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం కనిపిస్తుంది.అంచనాలకు మించిన ధరలుఅంతర్జాతీయ మార్కెట్‌లో ధరల ఎచ్చుతగ్గుల కారణంగా పత్తి పంటకు ధరలు ఉండవని ప్రచారం జరిగినప్పటికీ గతేడు పత్తి పంటల ధరలు అంచనాలకు మించి ధర పలికింది. పంట చేతికి వచ్చినప్పటి నుంచి కొనుగోలు ముగిసే వరకు మద్దతు ధరను మించిన ధరలేదక్కాయి. తెల్ల బంగారం సిరులు కురిపించడంతో ఈ సారి కూడా రైతులు పత్తి పంటపై భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. దీంతో ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 20వేల ఎకరాలకు పై గా పత్తి పంట సాగు విస్తీర్ణం పెరిగిందని అధికారులే చెబుతున్నారు. ఇప్పటికే రైతులు విత్తనాలను కొనుగోలు చేసి తొలకరి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఒక ఏడాది నష్టం వచ్చిన మరో ఏడాది ఆదుకోకపోతుందా అనే భావనతో పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అయితే ధరలు భాగానే ఉన్న పెట్టుబడి ఖర్చులు మరింతగా పెరిగి పోవడంతో లాభాలు అంతంత మాత్రంగానే వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. జిల్లా సాగు భూమి విస్తీర్ణం 5 లక్ష ల 71 వేల ఎకరాలు కాగా ఈ సారి 3లక్షల 95వేల 200 ఎకరాలలో పత్తిపంట సాగయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఖరీఫ్ పంటల సాగుకు వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. గతేడా కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయం గా పెరుగనుంది. మూడు నాలుగేళ్లుగా విస్తీర్ణం తగ్గినా గత ఏడాది ధరలు పుంజుకోవడంతో ఈసారి సాగుపై రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

## బనకచర్ల కోసం టెండర్ల ఆహ్వానం

• ఆర్థిక వనరుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు
• త్వరగా అటవీ,పర్యావరణ అనుమతులు, డీపీఆర్ ఆమోదం
• ఉన్నతాధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశాలు

**అమరావతి,జూన్ 6(జనంసాక్షి) :** త్వరలో పోలవరం – బనకచర్లకు టెండర్లు ఆహ్వానిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం నేపథ్యంలో ఆర్థిక వనరుల సమీకరణ కోసం కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే ఏపీ ప్రతిపాదనలు పంపించిందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అటవీ – పర్యావరణ అనుమతులు, డీపీఆర్ ఆమోదం తదితర అంశాలన్నీ అనుకున్న సమయానికి జరగాలని జలవనరుల శాఖ ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు సైతం సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. హైబ్రీడ్ యాన్యుటీ– విధానంలో పోలవరం – బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆయన వివరించారు. శుక్రవారం రాజధాని అమరావతిలోని సచివాలయంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడుతోపాటు– ఆ శాఖ ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. టెండర్లకు సంబంధించిన రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీతో డ్రాఫ్ట్ డాక్యుమెంట్ రూపొందించడం, సాంకేతిక నిపుణుల పర్యవేక్షణ అనంతరం టెండర్లు పిలవడం వంటి అంశాలన్నీ జూన్ మాసాంతానికి పూర్తి కావాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. జల హారతి కార్పొరేషన్ కింద పోలవరం – బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు నిర్మాణం చేపడుతుండగా.. దీని కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఇప్పటికే ఏర్పాటు– చేశామన్నారు.మొత్తం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.81,900 కోట్ల వ్యయం అవుతుందన్నారు. అందులో 50 శాతం అంటే రూ.40,950 ఈఏపీ రుణంగా పొందాలని నిర్ణయించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌గా 20 శాతం నిధులు రూ.16,380 కోట్లు– సమకూర్చుకోవాలని.. రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీగా 10 శాతం నిధులు రూ.8,190 కోట్లు–.. హ్యామ్ విధానంలో మరో 20 శాతం నిధులు రూ.16,380 కోట్లు– ఖర్చు చేస్తుందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ ప్రాజెక్ట్ డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తి కావాలని ఆయన ఆదేశించారు.కృష్ణా – గోదావరి డెల్టాకు తక్షణమే నీరు విడుదల చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. తుపాన్ల ముప్పు తప్పేలా పంట కాలం ముందుకు జరగాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 365 రోజులు భూమి పచ్చగా ఉండేలా.. అందుకోసం 3 పంటలు నిరంతరం పండించేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. బుడమేరులో పూడిక తొలగించాలని.. ఆ క్రమంలో వాగులో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా పూడిక తీత, ముళ్ల కంపలు తొలగించాలని సూచించారు. శాస్త్రీయంగా వాటర్ ఆడిటింగ్ – వాటర్ మేనేజ్‌మెంట్ జరగాలన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370